

బిహార్ ఎన్నికలను బహిష్కరించే యోచన
2

ప్రజల అభిప్రాయం తెలుసుకుంటాం.. ఓటర్ల జాబితా సవరణ నేపథ్యంలో తేజస్వీయాదవ్

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆర్డినెన్స్‌ను ఆమోదిస్తారా?
13

గవర్నర్ నిర్ణయం కోసం నిరీక్షణ

స్థానిక సంస్థల రిజర్వేషన్ల ఖరారుపై రేపటితో ముగియనున్న హైకోర్టు గడువు

గవర్నర్ ఏమీ తేల్చకపోతే.. క్యాబినెట్‌లో చర్చించి బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం?

గురువారం | 24-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 116 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య రా.12.41 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పునర్వసు సా.4.44 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా.12.29-2.02; దుర్ముహూర్తం: ఉ.10.13-11.04, మ.3.21-4.13; అమృతఘడియలు: మ.2.27-3.58; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.47

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

42% సాధిస్తాం

కేంద్రం మెడలు వంచైనా తెస్తాం.. రైతు చట్టాల్నీ అలాగే రద్దు చేయించాం



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మల్లు రవి, ఎంపీ చామల

ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్, ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం ఉన్న మహారాష్ట్రలో ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. బీజేపీ నేతలకు దమ్ముంటే ఆ రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించాలి. గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇకపై కూడా అమలు చేస్తామని ఒక ఇంటర్వ్యూలో చెప్పిన అమిత్ షాను బీజేపీ నుంచి సస్పెండ్ చేస్తారా?

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- బీసీ రిజర్వేషన్లపై బీజేపీది ద్వంద్వ వైఖరి
- అసెంబ్లీలో మద్దతు.. కేంద్రంలో తాత్సారం
- రాష్ట్ర బీజేపీ కొత్త అధ్యక్షుడిది వితండవాదం
- ముస్లింల సాకుతో బీసీ రిజర్వేషన్లకు మోకాలడ్డు
- బండి సంజయ్, కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారు
- దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ కులగణన
- ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేతపై ఆలోచిస్తున్నాం
- రాష్ట్రంలో ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు నాయకుడు లేడు
- బీఆర్‌ఎస్‌లో ఇంటిపోరు అంతా ఓ డ్రామా
- ఉపరాష్ట్రపతి పదవిని దత్తాత్రేయకు ఇవ్వాలి
- తెలంగాణ ప్రజల తరఫున కేంద్రాన్ని కోరుతున్నా
- ఢిల్లీలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రం మెడలు వంచైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో మూడు వ్యవసాయ నల్లచట్టాలు చేస్తే.. వాటిని ఉపసంహరించుకునేలా చేశామని గుర్తు చేశారు. తొలుత మొండికేసిన బీజేపీ ప్రభుత్వ మెడలు వంచి రద్దు చేయించామని అన్నారు. చివరికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ రైతులకు క్షమాపణలు చెప్పాల్సి వచ్చిందన్నారు. బుధవారం ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. "బీజేపీ వాళ్లు వితండవాదం చేస్తున్నారు. శాసనసభలో చర్చ జరిగినప్పుడు తీర్మానానికి బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం, సీపీఐ మద్దతు ఇచ్చాయి. ఓవైపు తెలంగాణలోని బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతు ఇస్తుంటే.. కేంద్ర బీజేపీ తాత్సారం చేస్తోంది. ఇక ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రాంచందర్‌రావు మాత్రం 'మీరెలా చేస్తారు? మీరు హామీ ఇచ్చుకుంటే మీరే చేసుకోండి' అని అంటున్నారు. లేదంటే ముస్లింలను రిజర్వేషన్ల నుంచి తొలగించండని వితండవాదం చేస్తున్నారు. ఇవాళ బీజేపీకి, కాంగ్రెస్‌కు వేర్వేరు రాజ్యాంగాలు లేవు. అందరికీ అంబేడ్కర్ రాజ్యాంగం ఒక్కటే. ఆ రాజ్యాంగానికి లోబడే రిజర్వేషన్లు పెంచాలంటున్నాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. వందేళ్ల నుంచి వాయిదా

మిగతా 13వ పేజీలో...

సొంత వాళ్ల ఫోన్ల ట్యాపింగ్!

దాని కన్నా ఆత్మహత్య చేసుకోవడం మేలు 13

ఇంతచేసి సాధించిందేంటి? ఉద్యోగమే ఊడింది కదా?

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

రేపు క్యాబినెట్ భేటీ.. బీసీ 42% రిజర్వేషన్ల ఆర్డినెన్స్, స్థానిక ఎన్నికలపై చర్చించే అవకాశం



కానేకాదు

కేంద్ర సాధికారిక కమిటీ తప్పుడు అంచనాలతో ఆ నిర్ధారణకు వచ్చింది

ఏ చట్టం ప్రకారమైనా కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని అటవీ భూమిగా వర్గీకరించలేం

గతంలో సుప్రీం తీర్పు ఇదే చెప్పింది

సుప్రీంకోర్టుకు తాజాగా సమర్పించిన సమగ్ర అఫిడవిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

అఫిడవిట్‌పై స్పందించేందుకు సమయం కోరిన అమికస్ క్యూరీ

తదుపరి విచారణ 13వ తేదీకి వాయిదా

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి ప్రాంతం ఎట్టి పరిస్థితుల్లోనూ అటవీ భూమి కానేకాదని సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఈ భూములను కేంద్ర సాధికారిక కమిటీ (సీఈసీ) నివేదికలో అటవీ భూమిగా ప్రస్తావించడం సరికాదని.. తప్పుడు అంచనాల ప్రాతిపదికపై ఆ నిర్ధారణకు వచ్చిందని వివరించింది. ఏ చట్టాల ప్రకారం చూసినా ఆ ప్రాంతాన్ని అటవీ భూమిగా వర్గీకరించడానికి వీల్లేదని.. గతంలోని సుప్రీం తీర్పు కూడా ఇదే విషయాన్ని సమర్థిస్తోందని సుప్రీంకోర్టుకు సమర్పించిన తాజా అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. కంచ గచ్చిబౌలి భూముల అంశంలో సుమోటో కేసుతోపాటు ఇతరుల పిటిషన్లపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలో జస్టిస్ కె వినోద్ చంద్రన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. తొలుత రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశానుసారం సీఎస్

మిగతా 14వ పేజీలో...

ఆ విద్యార్థులను అనుమతించండి

వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదవకున్నా.. వైద్య కోర్సుల్లో దరఖాస్తు చేసుకోనివ్వండి: హైకోర్టు 12

వెస్ట్ ఆర్కిటికా దేశమట.. ఆ దేశానికి రాయబారి అట..



ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లో ఏకంగా నకిలీ ఎంబసీనే తెరిచిన ఘనుడు

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో యువతపై వల.. భారీ ఎత్తున వసూళ్లు

హవాలా మార్గాల్లో షెల్ కంపెనీలకు..

నిందితుడు హర్షవర్ధన్ జైన్ అరెస్ట్ 2



కరీంనగర్ పట్టణంలో వర్షపు నీటితో చెరువులా మారిన కలెక్టరేట్ రోడ్డు..

దంచి కొడుతున్న వానలు!

ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరులో 23.4, ములుగు జిల్లా వెంకటాపురంలో 23.1 సెం.మీ.

12.30 గంటల వ్యవధిలోనే నమోదు

అంతకుముందు 24 గంటల్లో వెంకటాపురంలో 25.8 సెం.మీ.. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం

ములుగు జిల్లాలో పర్యటించిన మంత్రి సీతక్క

చేపలు పట్టేందుకు వెళ్లి ముగ్గురి గల్లంతు

పిడుగుపాటుకు ఒకరి మృతి

నేడు ఉత్తర తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు!

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు చోట్ల రోడ్లు తెగి రాకపోకలు స్తంభించగా.. పంటపొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుధవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో అత్యధికంగా 23.4 సెం.మీ., ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో 23.1 సెం.మీ. నమోదైంది. ఇటు మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు వెంకటాపురం మండలంలోనే 25.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక వర్షపాతం.. బుధవారం ములుగు జిల్లా మంగపేట మండలంలో 11.95 సెం.మీ., ఏటూరునాగారం మండలంలో 10.53 సెం.మీ., ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి

మిగతా 3వ పేజీలో...

రాజ్‌నాథ్ లేదా నడ్డా!

కొత్త ఉపరాష్ట్రపతిగా వీరిలో ఒకరికి చాన్స్.. బీజేపీ వర్గాల్లో చర్చ

మోదీ, షాకు నమ్మదగ్గ నేతలుగా రాజ్‌నాథ్, నడ్డాకు గుర్తింపు

పరిశీలనలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పేర్లూ..





న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఆ పదవిలో మరో నేతను ఎన్నుకునేందుకు బీజేపీ అగ్రనేతలు సన్నాహాలు ప్రారంభించారు. ఆ పార్టీ వర్గాల అంచనా ప్రకారం కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లేదా ప్రస్తుత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఉపరాష్ట్రపతి పదవికి అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 10వ తేదీతో 74 ఏళ్లు పూర్తిచేసుకున్న రాజ్‌నాథ్‌సింగ్.. ప్రధాని నరేంద్రమోదీకి, హోంమంత్రి అమిత్ షాకు నమ్మదగ్గ నేతగా నిరూపించుకున్నారు. ప్రతిపక్షాల

మిగతా 2వ పేజీలో...

ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ ప్రారంభం

ఉభయ సభల సభ్యులతో ఎలక్టోరల్ కాలేజీ ఏర్పాటు

వీలైనంత త్వరలో షెడ్యూల్ ప్రకటన: ఈసీ

నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత 30 రోజుల్లోగా పోలింగ్ 2

సంక్షేమ హాస్టళ్లలో స్టీల్ పాత్రల్లోనే వండాలి

అల్యూమినియం పాత్రలు వాడొద్దు

విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు తనిఖీలు చేస్తా 13

మంత్రి అడ్లూరి లక్ష్మణ్

డబ్ల్యూడబ్ల్యూఎఫ్‌తో కలిసి 'మిషన్ ప్రకృతి'కి రాష్ట్ర గురుకులాలు శ్రీకారం



కర్ణాటకలో కాఫీ, టీ అమ్మకాలు బంద్

జీఎస్టీ నోటీసుల నేపథ్యంలో చిరు వ్యాపారుల నిరసన

రూ.లక్షల్లో పన్ను కట్టాలంటూ కొందరికి నోటీసులు అందాయని ఆందోళన

సీఎం సిద్దరామయ్యతో చర్చలు 2

పన్నులు వసూలు చేయబోమంటూ ముఖ్యమంత్రి హామీ.. ఆందోళన విరమణ



ఆర్టీసీకి చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి, ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఆర్టీసీకి మహాలక్ష్మి

ఆ పథకం కింద 200 కోట్లు దాటిన మహిళల ఉచిత ప్రయాణాలు

వాటి టికెట్ల మొత్తం రూ.6,680 కోట్లు

ఆర్టీసీకి చెక్కు అందించిన ప్రభుత్వం

నష్టాల నుంచి లాభాల్లోకి ఆర్టీసీ: భట్టి

మహిళల దైనందిన జీవితంలో 'మహాలక్ష్మి' పథకం భాగమైంది: మంత్రి పొన్నం

ఎంజీబీఎస్‌లో సంబురాలు

ఆర్టీసీ సిబ్బందికి డిప్యూటీ సీఎం సన్మానం

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే 'మహాలక్ష్మి' పథకంతో ఆర్టీసీ ఆర్థికంగా బలోపేతమవుతోందని.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకం కింద మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు 200 కోట్ల మార్కు దాటిన నేపథ్యంలో.. బుధవారం ఎంజీబీఎస్ ప్రాంగణంలో వేడుకలు నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్న మహిళలను, ఆర్టీసీ సిబ్బందిని డిప్యూటీ సీఎం సన్మానించారు. 200 కోట్ల ఉచిత

మిగతా 12వ పేజీలో...

హ్యామ్ 'బాట'లో తొలి అడుగు!

ఆర్‌అండ్‌బీ పరిధిలో 373 రోడ్లకు సర్కారు ఆమోదం.. ఉత్తర్వులు జారీ

మొదటి దశలో 5,190 కి.మీ రోడ్ల కోసం రూ.6,478 కోట్లు 14



జస్టిస్ వర్మ పిటిషన్‌పై విచారణకు ధర్మాసనం

దాంట్లో నేను భాగస్వామిగా ఉండను

గతంలో ఈ అంశంపై ఏర్పాటైన విచారణ కమిటీలో సభ్యుడిగా ఉన్నందునే..

సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వెల్లడి 2



పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపీల నిరసన

మూడో రోజూ అదే తీరు

- పార్లమెంట్‌లో కొనసాగిన విపక్షాల నిరసన
- బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై ఆందోళన
- ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు

న్యూఢిల్లీ, జూలై 23: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై పార్లమెంట్ ఉభయసభల్లో ప్రతిపక్షాలు మూడో రోజు కూడా నిరసన కొనసాగించాయి. దీనిపై చర్చకు పట్టుబట్టిన విపక్ష సభ్యులు సభా కార్యకలాపాలు జరగకుండా అడ్డు తగిలారు. లోక్‌సభలో క్వశ్చన్ అవర్‌లో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకుపోయారు. సభ్యులు ప్లకార్డులు పట్టుకోరాదని, వెళ్లి తమ స్థానాల్లో కూర్చోవాలని స్పీకర్ ఓం బిర్లా కోరినా సభ్యులు వినిపించుకోలేదు. అటు రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆందోళనలు సద్దుమణగకపోవడంతో

మిగతా 2వ పేజీలో...

28న లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ

- 29న రాజ్యసభలో.. ఒక్కో సభకు 16 గంటలు చొప్పున కేటాయింపు
- కాల్పులు విరమింపజేశానని ట్రంప్ పాతికసార్లు అన్నారు. పదే పదే అంటున్నారంటే అనుమానంగానే ఉంది: రాహుల్‌గాంధీ 2

వెస్ట్ ఆర్కిటికా దేశమట.. ఆ దేశానికి రాయబారి అట..

- ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లో ఏకంగా నకిలీ ఎంబసీనే తెరిచిన ఘనుడు
- నిందితుడు హర్షవర్ధన్ జైన్ అరెస్ట్



లఖ్‌నవూ, జూలై 23: వెస్ట్ ఆర్కిటికా, సెబోర్గా, లోడోనియా, పౌల్వియా అనే కాల్పనిక దేశాల పేరుతో భారత్‌లో అనధికారికంగా రాయబార కార్యాలయాన్ని నడుపుతూ.. యువతను ఉద్యోగాల పేరుతో మోసగిస్తున్న కేటుగాడి ఆటను ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) పోలీసులు కట్టించారు. ఈ కేసులో గాజియాబాద్‌కు చెందిన హర్షవర్ధన్ జైన్‌ను అరెస్టుచేసి, అతని నుంచి నకిలీ డిప్లొమాటిక్ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు ఉన్న నాలుగు వాహనాలు, 12 నకిలీ రాయబార పాస్‌పోర్టులు, విదేశాంగ మంత్రిత్వ శాఖ ముద్రలతో ఉన్న నకిలీ పత్రాలు, రెండు నకిలీ పాన్‌కార్డులు, వివిధ కాల్పనిక దేశాలకు చెందిన 34 స్టాంపులు, రెండు నకిలీ ప్రెస్ కార్డులు, రూ.44.7 లక్షల నగదు, విదేశీ కరెన్సీ, అనేక షెల్ కంపెనీలకు సంబంధించిన పత్రాలు, 18 నకిలీ డిప్లొమాటిక్ వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను సీజ్ చేశారు. నిందితుడిని తదుపరి దర్యాప్తు నిమిత్తం కవినగర్ పోలీసులకు అప్పగించారు. కవినగర్ పోలీసుల కథనం ప్రకారం.. గాజియాబాద్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్న హర్షవర్ధన్ జైన్ అందులో 'వెస్ట్ ఆర్కిటికా' అనే కాల్పనిక దేశానికి సంబంధించిన రాయబార కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. తనను తాను ఆ సూక్ష్మ దేశానికి(మైక్రోనేషన్) రాయబారిగా పరిచయం చేసుకునేవాడు. సెబోర్గా, లోడోనియా, పౌల్వియా అనే మైక్రోనేషన్స్‌తో కూడా తనకు సంబంధాలున్నట్లు చెప్పుకొంటూ.. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో యువతను మోసగించేవాడు. యువత నుంచి కొల్లగొట్టిన సొమ్మును హవాలా మార్గాల్లో అనేక షెల్ కంపెనీలకు తరలించేవాడని పోలీసులు అనుమానిస్తున్నారు. తాను విదేశీ రాయబారినని నమ్మించేందుకు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి ఫొటోలు దిగినట్లుగా డిజిటల్ చిత్రాలను సృష్టించి.. ప్రజలకు చూపేవాడు. తన వాహనాలకు 'డిప్లొమాటిక్ నంబర్ ప్లేట్లు' బిగించి, వాటిల్లో తిరిగేవాడు. హర్షవర్ధన్ కదలికలపై అనుమానం రావడంతో.. అరెస్టు చేసినట్లు ఎస్‌టీఎఫ్ వర్గాలు వెల్లడించాయి. శాటిలైట్ ఫోన్‌ను కలిగి ఉన్నందుకు అతనిపై 2011లో కేసు నమోదైందని, వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు చంద్రస్వామి, అంతర్జాతీయ ఆయుధాల వ్యాపారి అద్నాన్ ఖషోగ్గీ వంటి వారితో ఇతనికి సంబంధాలున్నట్లు గుర్తించాయి. కాగా.. 2001లో అమెరికాకు చెందిన ట్రావిస్ మెక్‌హెన్రీ అనే అధికారి 'వెస్ట్ ఆర్కిటికా' దేశాన్ని ప్రకటించి, తాను ఆ దేశానికి గ్రాండ్ డ్యూక్‌గా పేర్కొన్నారు. 6.2 లక్షల చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్న ఆ దేశంలో.. 2,536 మంది పౌరులు జీవిస్తున్నట్లు చెప్పుకొన్నారు. వాస్తవానికి అలాంటి దేశమేలేదు. నిజానికి ఆర్కిటిక్ ఖండం ఉత్తర ధ్రువంలో ఉంటుంది. కానీ, వెస్ట్ ఆర్కిటికా దేశం అంటార్కిటికాలో ఉన్నట్లు పేర్కొనడం హర్షవర్ధన్ జైన్ బండారాన్ని బయటపెట్టి ఉంటుందని స్పష్టమవుతోంది.

లోకం తీరు



పుట్టింటికి వెళ్లిపోయిన భార్య తిరిగి రావాలని నరబలి

- ఆరేళ్ల బాలుడిని హతమార్చిన భర్త.. రాజస్థాన్‌లో ఘోరం

జైపూర్, జూలై 23: తనను వదిలి పుట్టింటికి వెళ్లిపోయిన భార్యను తిరిగి రప్పించుకునేందుకు రాజస్థాన్‌కు చెందిన ఓ భర్త నరబలి ఇచ్చాడు. ఓ మంత్రగాడి మాటలు నమ్మి.. అన్న కొడుకుని హతమార్చాడు. రాజస్థాన్‌లోని సరయకళ గ్రామంలో జూలై 19న ఈ దారుణం జరిగింది. సరయకళకు చెందిన మనోజ్ ప్రజాపత్ మద్యానికి బానిసై భార్యను వేధిస్తుండేవాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య తన వద్దకు తిరిగి వచ్చేందుకు ఏం చేయాలంటూ సునీల్ కుమార్(38)అనే మంత్రగాడిని మనోజ్ సంప్రదించాడు. కాళీమాతకు ఓ చిన్నారిని బలిచ్చి, ఆ చిన్నారి రక్తం, గుండెతో పూజ చేస్తే నీ భార్య నీ వశం అవుతుందని సునీల్ సూచించాడు. జూలై 19న పూజ చేయాలని, తనకు రూ.12వేలు ఇవ్వాలని చెప్పాడు. మనోజ్ తన అన్నకుమారుడు లోకేశ్(6)ను బలి ఇవ్వాలనుకున్నాడు. ఈ క్రమంలో 19న లోకేశ్‌ను మనోజ్ ఎత్తుకెళ్లాడు. ఓ పాడుబడిన ఇంట్లోకి తీసుకెళ్లి పీక కోసి చంపేశాడు. అనంతరం ఆ బాలుడి శరీరంలోని వివిధ భాగాల నుంచి సిరంజితో రక్తం తీసి మృతదేహంపై గడ్డి వేసి వెళ్లిపోయాడు. అయితే, కుటుంబసభ్యులు అదే రోజు రాత్రి మృతదేహాన్ని గుర్తించారు. బాలుడి సోదరి ఇచ్చిన సమాచారంతో పోలీసులు మనోజ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన ఘోరాన్ని బయటపెట్టాడు. మనోజ్, మాంత్రికుడును పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.

ఇటు విదేశాలకు.. అటు ఆందోళనకు..

చర్చనీయాంశంగా మారుతున్న 'యూపీఐ' సేవలు

- విదేశాల్లోనూ యూపీఐ సేవలకు రంగం
- 'పేపాల్ వరల్డ్ యాప్'తో అందుబాటులో
- మరోవైపు బెంగళూరులో భారీగా యూపీఐ లావాదేవీలు జరగడంపై చిరువ్యాపారులకు జీఎస్టీ నోటీసులు



బెంగళూరులో దుకాణాలు మూసి, నల్ల బ్యాడ్జీలతో చిరు వ్యాపారుల నిరసన

న్యూఢిల్లీ, జూలై 23: భారత్‌లో డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్) సృష్టించిన సంచలనం ఇంతా అంతా కాదు. ఓ రకంగా చెప్పాల్సి వస్తే.. యూపీఐకి ముందు, యూపీఐకి తర్వాత అన్నట్టుగా డిజిటల్ చెల్లింపుల చరిత్ర మారిపోయింది. చిన్న కిరాణా దుకాణంలో రెండు, మూడు రూపాయల నుంచి ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలుకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేదాకా దాని విస్తృతి పెరిగింది. అలాంటి యూపీఐ ఓవైపు విదేశాల్లోనూ అందుబాటులోకి వస్తుంటే.. మరోవైపు చిరు వ్యాపారుల్లో ఆందోళనలకూ దారితీస్తోంది.

సెప్టెంబరు నుంచి ప్రపంచవ్యాప్తంగా..

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలు అందించే పేపాల్ సంస్థ.. పెద్ద డిజిటల్ వాలెట్లు, చెల్లింపుల వ్యవస్థలను అనుసంధానం చేస్తూ 'పేపాల్ వరల్డ్ యాప్'ను తీసుకువచ్చింది. అందులో యూపీఐ సేవలను భాగం చేసేందుకు ఇటీవలే 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)'తో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్‌లో యూపీఐ సేవలు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయి. వివిధ దేశాలవారి మధ్యకూడా చెల్లింపులు సులువుగా జరిగేలా యూపీఐతోపాటు వెన్మో, టెన్‌పే గ్లోబల్ తదితర సంస్థలతోనూ పేపాల్ ఒప్పందాలు చేసుకుంది. దీనితో ఏ దేశంలోని వారు అయినా మరో దేశంలోని వారి మొబైల్ నంబర్ నమోదు చేసి, వాలెట్‌ను ఎంపిక చేసుకుని డబ్బులు బదిలీ చేయడానికి వీలవుతుందని పేపాల్ సంస్థ తెలిపింది. ఉదాహరణకు అమెరికాలోని వారు పేపాల్ వరల్డ్ యాప్‌లో.. భారత్‌లోని ఓ వ్యక్తి మొబైల్ నంబర్‌ను నమోదు చేసి, ఇక్కడి జీపే, ఫోన్‌పే, పేటీఎం వంటి వాలెట్‌ను ఎంపిక చేసి నేరుగా డబ్బులు పంపవచ్చు. తరచూ విదేశాలకు వెళ్లేవారు, విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, అక్కడ ఉద్యోగాలు చేస్తున్నవారు సులువుగా చెల్లింపులు చేయడానికి, సొమ్ము బదిలీ చేయడానికి బాగా ఉపకరిస్తుంది.

కర్ణాటకలో పాలు, కాఫీ, టీ అమ్మకాలు బంద్!

చాలా సులువుగా ఉండటంతో ప్రతిచోటా యూపీఐతో చెల్లింపులు చేయడం పెరిగిపోయింది. ఇలా కర్ణాటకలో భారీగా యూపీఐ లావాదేవీలు జరిగిన చిరు వ్యాపారులు, బేకరీలకు జీఎస్టీ కట్టాలంటూ వాణిజ్య పన్నుల శాఖ ఇటీవల నోటీసులు ఇవ్వడం కలకలం రేపింది. కొందరికైతే లక్షల్లో పన్ను కట్టాలంటూ నోటీసులు అందాయి. కూరగాయలు అమ్మే శంకర్‌గౌడ అనే వ్యాపారికి గత నాలుగేళ్లలో రూ.1.63 కోట్లు యూపీఐ చెల్లింపులు అందాయని, రూ.29 లక్షలు పన్ను కట్టాలని నోటీసు అందింది. ఇలా తమకు అందిన నోటీసులను వెనక్కి తీసుకోవాలంటూ వ్యాపారులు ఆందోళనకు దిగారు. యూపీఐ చెల్లింపులు స్వీకరించబోమని చాలా చోట్ల 'నో యూపీఐ' బోర్డులు పెట్టారు. కేవలం నగదు మాత్రమే తీసుకుంటున్నారు. ఆందోళన మరింత ఉధృతం చేస్తూ.. కర్ణాటక వ్యాప్తంగా పాలు, టీ, కాఫీ విక్రయాలను నిలిపివేశారు. బదులుగా ప్రభుత్వానికి నిరసన తెలుపుతూ.. నల్ల బ్యాడ్జీలు ధరించి, కేవలం బ్లాక్ కాఫీ, బ్లాక్ టీలను మాత్రమే విక్రయిస్తున్నారు. ఈ నెల 25వ తేదీన కర్ణాటకవ్యాప్తంగా బంద్‌కు కూడా పిలుపునిచ్చారు. ఆందోళన నేపథ్యంలో వ్యాపారులతో ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య బుధవారం చర్చలు జరిపారు. జీఎస్టీ నుంచి మినహాయింపు ఉన్న వస్తుసేవలు అందిస్తున్న వ్యాపారుల నుంచి పన్నులు, బకాయిలేమీ వసూలు చేయబోమని హామీ ఇచ్చారు. కాగా, సీఎం సిద్ధరామయ్య హామీతో వ్యాపారులు ఈ నెల 25న నిర్వహించాలనుకున్న బంద్‌ను ఉపసంహరించుకున్నారు.

బోగీ, బెర్త్ నంబర్లు చేతిపై ముద్రించి.. 56 మంది యువతుల అక్రమ రవాణా!?

- బెంగాల్‌లోని జల్పాయ్‌గురి నుంచి పట్నా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్‌లో గుర్తింపు

న్యూఢిల్లీ, జూలై 23: పశ్చిమబెంగాల్‌లో యువతుల అక్రమ రవాణా గుట్టు రట్టయింది. న్యూ జల్పాయ్‌గురి రైల్వే స్టేషన్‌లో 56 మంది యువతులు పట్నా వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కారు. రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తుండగా.. 18 నుంచి 31 ఏళ్లలోపు వయసున్న ఈ యువతులందరూ ఒకే బోగీలో ఉండడాన్ని గుర్తించారు. ఇంత మంది ఒకే బోగీలో ప్రయాణిస్తుండడంతో అనుమానం వచ్చిన ఆర్పీఎఫ్ సిబ్బంది.. ఆరా తీశారు. వారి వద్ద ఎలాంటి టికెట్లు లేకపోగా.. అందరి చేతులపై మాత్రం బోగీ, బెర్త్ నంబర్లతో కూడిన స్టాంపులు ఉన్నాయి. ఎలాంటి పత్రాలు, టికెట్లు లేకుండా ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించగా.. వారు పొంతన లేని సమాధానాలు చెప్పారు. తామంతా జల్పాయ్‌గురి, కూచ్‌బెహార్, అలీపూర్‌దార్ జిల్లాలకు చెందిన వారమని.. బెంగళూరులో ఉద్యోగాలు ఇప్పిస్తామని తీసుకెళ్తున్నారని యువతులు వెల్లడించారు. బెంగళూరులో ఉద్యోగాల కోసం అయితే.. పట్నా రైల్లో ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నిస్తే జవాబు ఇవ్వలేకపోయారు. అలాగే 56 మంది యువతులతో పాటు ఉన్న ఓ పురుషుడు, మహిళను ప్రశ్నించగా.. పరస్పర విరుద్ధ సమాధానాలు ఇచ్చారని చెప్పారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మానవ అక్రమ రవాణా కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధిత యువతులను వారి వారి కుటుంబాలకు అప్పగించినట్లు అధికారులు చెప్పారు.

భార్య స్నానం చేస్తుండగా వీడియోలు తీసి.. డబ్బులివ్వకపోతే ఆన్‌లైన్‌లో పెడతానని బెదిరించి

- ఓ భర్త దుర్మార్గం.. మహారాష్ట్రలో ఘటన

ముంబై, జూలై 23: ప్రభుత్వ ఉద్యోగిని అయిన 31ఏళ్ల వివాహిత తన భర్త మీద పోలీసులకు ఫిర్యాదు చేసింది. పడక గదిలో, బాత్‌రూంలో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసి అభ్యంతరకర రీతిలో తన కదలికలను చిత్రీకరించాడని ఆరోపించింది. బాధితురాలిది మహారాష్ట్ర. ఆమె భర్త కూడా ప్రభుత్వ ఉద్యోగే. ఆయన తనపై వరకట్న వేధింపులకు పాల్పడుతున్నాడనీ ఆమె ఫిర్యాదులో ఆరోపించింది. కారుకు సంబంధించిన వాయిదాలు కట్టేందుకు పుట్టింటికి వెళ్లి రూ.1.5 లక్షలు తేవాలంటూ తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులో బాధితురాలు ఆరోపించింది. డబ్బు తీసుకురాకుంటే తాను చిత్రీకరించిన దృశ్యాలను ఆన్‌లైన్‌లో పెడతానంటూ బెదిరిస్తున్నాడని, భర్త దుశ్చేష్టలకు అతడి కుటుంబసభ్యులు మద్దతు పలుకుతున్నారని పేర్కొంది. కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆమె భర్త, అత్త, ముగ్గురు ఆడపడచులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సైబర్ పోలీస్, మహిళా ఎస్సై.. ఇద్దరూ దొంగలే

- రూ.2 కోట్లతో జంట పరార్.. పట్టుకున్న పోలీసులు

న్యూఢిల్లీ, జూలై 23: దొంగల నుంచి ప్రజల్ని రక్షించాల్సిన ఎస్సై దొంగతనానికి తెగబడ్డాడు. ఆయన ప్రియురాలైన మహిళా ఎస్సై ఈ పనిలో ఆయనకు సహకరించింది. ఇద్దరూ కలిసి దొంగసొమ్ముతో టూర్లకు వెళ్లారు. చివరికి పట్టుబడటంతో వారి అక్రమాలు బయటకొచ్చాయి. ఈ ఘటన ఢిల్లీలో జరిగింది. ఢిల్లీ పోలీస్ సైబర్ విభాగానికి చెందిన ఓ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేసే అంకుర్ మాలిక్.. సైబర్ నేరాల్లో జప్తు చేసిన నగదును కోర్టుకు అక్రమ పత్రాలు సమర్పించి తనకు తెలిసిన వాళ్ల ఖాతాల్లోకి మళ్లింపజేసేవాడు. అనంతరం వారి ఖాతాల్లోంచి ఆ డబ్బు తీసుకునేవాడు. ఇలా దాదాపు రూ.2 కోట్లు కొల్లగొట్టాడు. ఈ పనిలో ఆయన ప్రియురాలైన నేహా పూనియా అనే మహిళా ఎస్సై సహకరించేది. నేహా ఢిల్లీలోనే మరో పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తోంది. వివాహితులైన వీరిద్దరికీ కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల వీరు వారం సెలవుపెట్టి గోవా, మనాలీ, జమ్మూ కశ్మీర్‌ల టూర్‌కు వెళ్లారు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో అనుమానం వచ్చిన అధికారులు దర్యాప్తునకు ఆదేశించగా.. ఈ జంట మధ్యప్రదేశ్ ఇండోర్‌లో ఉన్నట్లు తెలిసింది. చేతిలోని డబ్బుతో, కొత్త పేర్లు పెట్టుకొని అక్కడే స్థిరపడాలని వీరు నిర్ణయించుకున్నారు. పోలీసులు వారి ఆచూకీ గుర్తించి పట్టుకోవటంతో గుట్టురట్టయింది. ఇద్దరినీ అరెస్టు చేసి జైలుకు తరలించారు.

రాజీనామాకు ముందు రాష్ట్రపతి భవన్‌కు ధన్‌ఖడ్?

న్యూఢిల్లీ, జూలై 23: మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖను 'ఎక్స్'లో పోస్ట్ చేసే ముందు.. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారా? తన రాజీనామా లేఖను ఆమెకు సమర్పించారా? విశ్వసనీయ వర్గాలు ఈ ప్రశ్నలకు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. ఆరోజు ఆయన ఎలాంటి ముందస్తు షెడ్యూలూ లేకుండా రాష్ట్రపతి భవన్‌కు వెళ్లినట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి. ఆయన అలా అకస్మాత్తుగా రావడంతో రాష్ట్రపతి సచివాలయ సిబ్బంది కంగారుపడ్డారు. అక్కడ ఉండే 'ఎయిడ్-డి-క్యాంప్' (ప్రత్యేక కార్యదర్శి స్థాయి అధికారి.. సాధారణంగా ఈ పదవిలో ఒక సైనికాధికారిని నియమిస్తారు) మిలటరీ కార్యదర్శి వద్దకు వెళ్లి ధన్‌ఖడ్ రాక గురించి సమాచారం ఇచ్చారు. రాష్ట్రపతికి తన రాజీనామా లేఖను సమర్పించిన అరగంట తర్వాత ధన్‌ఖడ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు వీలైనంత త్వరలో షెడ్యూల్: ఈసీ

న్యూఢిల్లీ, జూలై 23: జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా నేపథ్యంలో.. ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఈమేరకు ఉభయసభల సభ్యులతో ఎలక్టోరల్ కాలేజీని ఏర్పాటు చేస్తున్నట్టు.. రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారులను ఖరారు చేస్తున్నట్టు వెల్లడించింది. సన్నాహక చర్యలు పూర్తయ్యాక, వీలైనంత త్వరగా ఎన్నికల షెడ్యూలును ప్రకటిస్తామని వివరించింది. నిబంధనల ప్రకారం.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచి 30 రోజుల్లోగా పోలింగ్ జరగాల్సి ఉంటుంది. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేయడానికి..పార్లమెంటు ఉభయసభలకూ ఎన్నికైన సభ్యులతోపాటు, నామినేటెడ్ సభ్యులు కూడా అర్హులే.

జస్టిస్ వర్మ పిటిషన్‌పై విచారణకు సీజేఐ దూరం

న్యూఢిల్లీ, జూలై 23: నోట్ల కట్టల వ్యవహారంలో జస్టిస్ వర్మ పిటిషన్‌పై విచారణకు బెంచ్ ఏర్పాటు చేస్తామని సీజేఐ జస్టిస్ గవాయ్ తెలిపారు. అయితే, ఆ బెంచ్‌లో తాను ఉండబోనని ప్రకటించారు. ఈ వ్యవహారంపై జస్టిస్ సంజీవ్ ఖన్నా సీజేఐగా ఉన్నప్పుడు నిర్వహించిన విచారణ కమిటీలో తాను సభ్యుడిగా ఉన్నాను కాబట్టి కొత్తగా ఏర్పాటు చేసే బెంచ్‌లో ఉండకూడదని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. జస్టిస్ వర్మ పిటిషన్‌పై వీలైనంత త్వరగా విచారణ చేపట్టాలని ఆయన తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ బుధవారం సీజేఐ నేతృత్వంలోని బెంచ్‌కు విజ్ఞప్తి చేశారు. పలు రాజ్యాంగపరమైన అంశాలను పిటిషన్‌లో లేవనెత్తామని తెలిపారు. దానికి సీజేఐ స్పందిస్తూ తన నిర్ణయాన్ని తెలిపారు.

విదేశీ పర్యటనకు వెళ్లిన మోదీ

న్యూఢిల్లీ, జూలై 23: ప్రధాని మోదీ యూకే, మాల్దీవుల్లో 4రోజులు పర్యటించేందుకు బుధవారం బయలుదేరి వెళ్లారు. తన పర్యటనతో రెండు దేశాలతో భారత్ దౌత్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ప్రధాని ఆశాభావం వ్యక్తంచేశారు. యూకే పర్యటనలో భాగంగా బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో మోదీ భేటీ అవుతారు. ఈ సందర్భంగా భారత్-యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకం చేస్తారు. ఈ ఒప్పం దం ద్వారా 99 శాతం భారతీయ ఎగుమతులకు సుంకాల నుంచి మినహాయింపు లభించనుంది. యూకే పర్యటన తర్వాత మోదీ మాల్దీవులకు వెళ్తారు. అక్కడ 26న జరిగే 60వ స్వాతంత్ర్య దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారు.

మాజీ భర్తకు బహిరంగ క్షమాపణలు చెప్పండి!

- ఐపీఎస్ అధికారి శివంగికి సుప్రీం కోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ, జూలై 23: తప్పుడు కేసులు పెట్టి మాజీ భర్త, అత్తింటి వారిని వేధింపులకు గురి చేసిన ఓ ఐపీఎస్ అధికారిపై సుప్రీంకోర్టు మండిపడింది. సదరు అధికారి, ఆమె తల్లిదండ్రులు.. మాజీ భర్తతోపాటు ఆయన కుటుంబీకులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలంటూ ఆదేశించింది. అలాగే పత్రికాముఖంగా క్షమాపణలు చెప్పాలని.. ప్రముఖ జాతీయ ఆంగ్ల, హిందీ దినపత్రికల్లో ఆ విషయాన్ని వెల్లడించాలని.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో కూడా తెలియజేయాలని స్పష్టంచేసింది. ప్రతీకారంతో భవిష్యత్తులో వారిని ఏరకంగానైనా ఇబ్బందులు పెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించింది. కేసులను తగిన అధికార పరిధికి మార్చాలంటూ ఇరు పక్షాలు నమోదు చేసిన బదిలీ పిటిషన్లను పరిశీలించిన సీజేఐ జస్టిస్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌ల ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. శివంగికి 2015లో షాహిబ్ బన్సాల్‌తో వివాహమైంది. వారికి ఓ కూతురు పుట్టింది. విభేదాలతో వారు 2018 నుంచి విడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలోనే పరస్పరం కేసులు పెట్టుకున్నారు. శివంగి పెట్టిన కేసుల్లో గృహహింస, హత్యాయత్నం, అత్యాచారం తదితర అభియోగాలున్నాయని, భర్త షాహిబ్ 109 రోజులు, ఆయన తండ్రి 103రోజులు జైలు శిక్ష అనుభవించినట్లు ధర్మాసనం గుర్తించింది. దీంతో ఆ కుటుంబం ఎంతో మానసిక వేదనకు గురైందని.. దీనికి ఏరకంగానూ పరిహారం చెల్లించలేమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే ఇప్పుడు అందుతున్న భరణంతో పాటు మాజీ భర్త ఆస్తిలో హక్కు వదుకోవాలని శివంగికి షరతు విధించింది. ఈ వ్యవహారంలో నమోదైన అన్ని కేసులను కొట్టేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, అత్తింట్లో వేధింపులు ఎదుర్కొంటూనే శివంగి 2022లో యూపీఎస్సీకి ఎంపికయ్యారని అప్పట్లో పత్రికలు ప్రచురించాయి.

జెలెన్‌స్కీకి వ్యతిరేకంగా ఆందోళనలు

కీవ్, జూలై 23: ఉక్రెయిన్‌వ్యాప్తంగా ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి. అవినీతిని నిరోధించే ప్రధాన స్వతంత్ర సంస్థలను బలహీనపరిచేలా ఆయన కొత్త చట్టాన్ని తీసుకువస్తూ సంతకం చేయడమే ఇందుకు కారణం. మూడేళ్లుగా రష్యాతో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో పౌరుల మద్దతు జెలెన్‌స్కీకి ఉన్నా.. తాజా చట్టంతో ఆయనపై వ్యతిరేకత వెల్లువెత్తడం గమనార్హం.! ఉక్రెయిన్‌లో అవినీతిని నిరోధించేందుకు స్వతంత్ర సంస్థలుగా నేషనల్ యాంటీ-కరప్షన్ ప్రాసిక్యూటర్ ఆఫీస్(ఎన్ఏబీయూ), స్పెషలైజ్డ్ యాంటీ-కరప్షన్ ప్రాసిక్యూటర్ ఆఫీస్(ఎస్ఏపీవో) పనిచేస్తున్నాయి. జెలెన్‌స్కీ సంతకం చేసిన తాజా చట్టంతో.. ఈ సంస్థల స్వతంత్రత ప్రమాదంలో పడుతుంది. వీటిపై ప్రాసిక్యూటర్ జనరల్‌కు నియంత్రణ దఖలుపడుతుంది. సోమవారం రాత్రి జెలెన్‌స్కీ ఈ బిల్లుపై సంతకం చేసి, ఆమోదించడంతో అది చట్టంగా మారింది.

మోదీ మౌనం అనుమానాన్ని పెంచుతోంది

- కాల్పులు విరమింపజేశానని ట్రంప్ పాతిక సార్లు అన్నారు
- కానీ, మోదీ ఒక్కసారైనా స్పందించలేదు
- ప్రధానిని చూస్తే ఏదో తేడా కొడుతోంది
- ట్రంపే కాల్పులను ఆపించారు: రాహుల్



బుధవారం పార్లమెంటు ఆవరణలో రాహుల్, డీఎంకే ఎంపీ బాలు

న్యూఢిల్లీ, జూలై 23: భారత్-పాకిస్థాన్ మధ్య తానే కాల్పులు విరమింపజేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికి పాతిక సార్లు అన్నారని.. దీనిపై మోదీ ప్రభుత్వం ఎందుకు స్పందించదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నిలదీశారు. కాల్పులు విరమింపజేయడానికి ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. దీనిపై ప్రధాని మోదీ ఒక్కసారి కూడా జవాబివ్వలేదంటే ఏదో తేడా కొడుతోందని వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణ దిశగా మధ్యవర్తిత్వం నెరిపానని ట్రంప్ చెబుతూ ఉన్నా.. మోదీ మౌనం వహిస్తున్నారని..అమెరికా అధ్యక్షుడిగా విధేయుడిగా ఉండాలని అనుకుంటున్నారా అని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ప్రశ్నించారు. బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో వారిద్దరూ మీడియాతో మాట్లాడారు. 'ట్రంప్ ఒకటికి పదిసార్లు నేనే యుద్ధాన్ని ఆపానంటూ భారత్‌ను అవమానిస్తుంటే మోదీ గట్టిగా స్పందించాలి. కానీ ఆయన మాట్లాడడం లేదు. ఇది ఆయన బలహీనతను సూచిస్తోంది' అని ఖర్గే అన్నారు. ప్రతిపక్షం డిమాండ్ చేసినట్లుగా ఈ అంశంపై పార్లమెంటులో ప్రధాని ప్రకటన చేయాలంటారా అని విలేకరులు అడుగగా.. ప్రధాని ఎలా ప్రకటన చేస్తారని రాహుల్ ఎదురుప్రశ్న వేశారు. 'ఆయనేం చెబుతారు? కాల్పుల విరమణ ట్రంప్ చేయించారని చెబుతారా? చెప్పరు. కానీ అదే కరెక్టు. మోదీ దాక్కోలేరు. ట్రంపే కాల్పులు ఆపించారు. యావత్ ప్రపంచానికీ ఈ వాస్తవం తెలుసు' అని అన్నారు. దేశంలో ఎన్నికలను దొంగిలిస్తున్నారని రాహుల్ మరోసారి ఆరోపించారు. బిహార్‌లో 52 లక్షల ఓట్లను తొలగించడంపై స్పందిస్తూ.. 'ఇది 52 లక్షల ఓట్ల గురించి కాదు. బిహార్ ఒక్కదాని గురించే కాదు. మహారాష్ట్రలోనూ మోసం చేశారు. దీనిపై ఈసీని ప్రశ్నించాం. ఓటర్ల జాబితాలను చూపించాలని అడిగితే చూపించలేదు. ఎన్నికల బూత్‌లలో వీడియో ఫుటేజీ కోరితే.. రూల్స్‌ను సవరించేశారు. బిహార్లో ఎస్ఐఆర్ పేరుతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ సోదరసోదరీమణుల ఓట్లను కాజేస్తున్నారు. దీనిపై మౌనంగా కూర్చోం. ప్రజల హక్కుల కోసం ఇండియా కూటమి పార్లమెంటు నుంచి వీధుల వరకు పోరాడుతుంది' అని రాహుల్ స్పష్టంచేశారు.

మూడోరోజూ అదేతీరు..

(మొదటి పేజీ తరువాయి)

ఉభయసభలూ తొలుత మధ్యాహ్నానికి, తర్వాత గురువారానికి వాయిదా పడ్డాయి. అంతకు ముందు సభా కార్యకలాపాలు ప్రారంభం కాకముందే ఇండియా బ్లాక్‌కు చెందిన పలు పార్టీల ఎంపీలు పార్లమెంట్ కాంప్లెక్స్ మకర ద్వారం బయట నిలబడి ఆందోళన చేపట్టారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, డీఎంకేకు చెందిన టీఆర్ బాలు, శివసేన యూబీటీకి చెందిన సంజయ్ రౌత్, టీఎంసీకి చెందిన కల్యాణ్ బెనర్జీ పాల్గొన్నారు.

సిందూర్‌పై 28న లోక్‌సభలో.. 29న రాజ్యసభలో చర్చ

న్యూఢిల్లీ, జూలై 23: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 28న లోక్‌సభలో, 29న రాజ్యసభలో చర్చ జరగనుంది. దీనికోసం ఒక్కో సభకు 16 గంటలు చొప్పున ప్రభుత్వం సమయం కేటాయించింది. బుధవారం జరిగిన రాజ్యసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్చలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తారని భావిస్తున్నారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని ట్రంప్ పదేపదే ప్రకటించుకోవడంపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చ జరగాలని కాంగ్రెస్ సహా విపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో చర్చకు తేదీని నిర్ణయించారు. సిందూర్‌పై చర్చలో ప్రభుత్వం తన వాదనను దూకుడుగా వినిపించడానికి సిద్ధమవుతోంది. సీడీఎస్ అనిల్ చౌహాన్, రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, త్రివిధ దళాల అధిపతులతో రాజ్‌నాథ్ భేటీలు నిర్వహించారు.

బిహార్ ఎన్నికలను బహిష్కరించే యోచన

బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ వెల్లడి



పట్నా, జూలై 23: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ నేపథ్యంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను బాయ్‌కాట్ చేయాలని విపక్ష మహాఘట్‌బంధన్ యోచిస్తోంది. ఈ విషయాన్ని బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ వెల్లడించారు. ఈ విషయంలో ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకుంటామని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై బుధవారం బిహార్ అసెంబ్లీ అట్టుడికింది. అధికార, విపక్ష సభ్యులు పరస్పరం దుర్భాషలాడుకున్నారు. నల్ల టీ షర్ట్ ధరించి వచ్చిన తేజస్వీ యాదవ్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ సరిగ్గా ఎన్నికల ముందు ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టడాన్ని తప్పుబట్టారు. "నకిలీ ఓటర్ల ఏరివేత అంటున్నారు. మరి ఈ నకిలీ ఓటర్లతోటే ప్రధానిగా మోదీ, సీఎంగా నితీశ్ గెలిచారా" అన్నారు.

తేజస్వీ పిల్లవాడు

అసెంబ్లీలో తేజస్వీ ప్రసంగిస్తుండగా సీఎం నితీశ్ అడ్డు తగిలారు. తేజస్వీని పిల్లాడిగా అభివర్ణించారు. ఇలాంటి విషయాలు తేజస్వీకి అర్థం కావన్నారు. అసెంబ్లీ సమావేశాలు మూడ్రోజుల్లో ముగుస్తాయని, ఆ తర్వాత కావాలంటే ఎన్నికల సభల్లో ప్రసంగించుకోవాలని ఎద్దేవా చేశారు.

ఐదేళ్ల విరామం తర్వాత చైనీయులకు భారత్ పర్యాటక వీసాలు

బీజింగ్, జూలై 23: చైనీయులకు పర్యాటక వీసాల జారీని పునఃప్రారంభిస్తున్నట్టు భారత్ ప్రకటించింది. ఈ వీసాల కోసం గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని బీజింగ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత చైనీయులకు భారత్ పర్యాటక వీసాల జారీని పునరుద్ధరించింది. కొవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో 2020లో చైనీయులకు పర్యాటక వీసాల జారీని భారత్ నిలిపివేసింది. తర్వాత గల్వాన్ ఘర్షణ కారణంగా ఈ ఆంక్షలను కొనసాగించింది. అయితే ఇరుదేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచుకునే చర్యల్లో భాగంగా తాజాగా భారత్.. చైనీయులకు పర్యాటక వీసాల జారీని పునఃప్రారంభించింది.

రాజ్‌నాథ్ లేదా నడ్డా!

(మొదటి పేజీ తరువాయి)

గౌరవం కూడా చూరగొన్న రాజ్‌నాథ్‌సింగ్ ఇరు వర్గాల మధ్య వారధిలా ఉపయోగపడతారని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఇప్పటికే పదవీకాలం పూర్తయిన జేపీ నడ్డా పేరును కూడా అగ్రనేతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. మోదీ, షాలకు తలలో నాలుకలా నడ్డా ఉన్నారని, స్పీకర్ ఓం బిర్లా లాగే సభను నియంత్రించగలరని పార్టీ వర్గాలు అంటున్నాయి. అయితే బీజేపీ కొత్త జాతీయ అధ్యక్షుడి పేరు ఖరారు కానంత వరకూ నడ్డా విషయం తేల్చడం కష్టమని ఈ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా.. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పేరు బుధవారం మీడియా వర్గాల్లో చక్కర్లు కొట్టింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాధాకృష్ణన్‌కు ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉంది. మర్యాదస్తుడిగా పేరుంది. గతంలో కొన్నాళ్లు జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాలకు కూడా ఆయన గవర్నర్‌గా వ్యవహరించారు. తమిళనాడులో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకొని అధికారం దక్కించుకోవాలనే ప్రయత్నంలో బీజేపీ ఉంది. ఈ నేపథ్యంలో అదే రాష్ట్రానికి చెందిన నేతకు ఉపరాష్ట్రపతి పదవి కట్టబెట్టడం ద్వారా తమిళ ప్రజలకు చేరువ కావాలని కమలం పార్టీ యోచిస్తున్నట్లు ప్రచారం జరిగింది. మరోవైపు జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పేర్లు కూడా ఉపరాష్ట్రపతి పదవికి చర్చకు వస్తున్నాయి.





ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో నీట మునిగిన పంట చేలు, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ అమలాపూర్ వాగు పొంగడంతో కొట్టుకుపోయిన గులాబీ తోట, వరద నీటి ముంపులో కరీంనగర్ పట్టణ రహదారి

దంచి కొడుతున్న వానలు!

(మొదటి పేజీ తరువాయి)

మండలం రవీంద్రనగర్‌లో 10.6, కౌటాలలో 10.3, భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో 9.82 సెం.మీ., వికారాబాద్ జిల్లా చిట్టంపల్లిలో 8.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ ముసురు వాన పడింది. ములుగు జిల్లాలో పలు చోట్ల చెరువు కట్టలు తెగిపోయాయి. దీంతో అప్రమత్తమైన జిల్లా అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. గోవిందరావుపేట మండలంలోని గుండ్లవాగు, జలగలంచవాగును పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పరిశీలించారు. బొగత జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పర్యాటకుల సందర్శనకు అధికారులు అనుమతి నిలిపేశారు. భారీ వర్షానికి కరీంనగర్‌లో రోడ్లన్నీ వాగుల్ని తలపించాయి. బెజ్జూరు మండలంలో కురిసిన వర్షానికి కృష్ణపల్లి-సోమిని గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెన ఉప్పొంగి ప్రవహించడంతో అవతల ఉన్న గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడెం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల నారచీరల ప్రాంతాన్ని గోదావరి వరద నీరు చుట్టుముట్టడంతో సీతమ్మ వారి విగ్రహంతోపాటు పరిసర లోతట్టు ప్రాంత దుకాణాలు నీట మునిగాయి. అలాగే పలు ప్రాంతాల్లో సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా.. కొన్నిచోట్ల అంతరాయం ఏర్పడింది. భూపాలపల్లి ఓపెన్ కాస్టు గనుల్లో నిలిచిన ఉత్పత్తి కారణంగా రూ.3 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ముగ్గురు గల్లంతు..

చేపల వేటకు వెళ్లి వేర్వేరు చోట్ల ముగ్గురు గల్లంతవ్వగా.. పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. కరీంనగర్ సాలేహ్‌నగర్‌కు చెందిన సయ్యద్ సర్వర్ (55), తన తమ్ముడి కుమారుడు సయ్యద్ రిజ్వాన్(20), మహమ్మద్ ఇసాక్ (33)తో కలిసి తిమ్మాపూర్ మండలంలోని లోయర్ మానేర్ డ్యాం(ఎల్ఎండీ)లో చేపల వేటకు వెళ్లారు. ఈ సమయంలో సయ్యద్ రిజ్వాన్ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోగా.. కాపాడేందుకు పెద్దనాన్న సయ్యద్ సర్వర్ ప్రయత్నించి అతడితోపాటే నీటిలో మునిగిపోయాడు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బూరుగుగుంపులో చేపలు పట్టేందుకు వెళ్లి నరేశ్ (30) వాగులో గల్లంతయ్యాడు. ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరుకు చెందిన తోటపల్లి వేణు (20) బైక్‌పై వెళ్తుండగా పిడుగుపాటుకు గురయ్యాడు. దీంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పర్ణశాలలో సీతమ్మవారి విగ్రహాన్ని చుట్టుముట్టిన వరద



భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం భూర్నపల్లి శివారులో చలివాగు ఉధృతికి తెగిపోయిన రోడ్డు

ఉత్తర తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు!

ఉత్తర తెలంగాణ ప్రాంతానికి హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రత్యేక వాతావరణ హెచ్చరిక జారీ చేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని.. అక్కడక్కడ 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశముందని హెచ్చరించింది. అలాగే నిర్మల్ నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన చేసింది. గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే ఈనెల 27వ తేదీ ఆదివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

శ్రీశైలం నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం ఒక గేటు తెరిచి నీటి విడుదల ప్రారంభించగా బుధవారం మరో గేటు ఎత్తి దిగువకు 54,956 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1.20 లక్షల క్యూసెక్కులు నమోదవుతుండగా.. 1.45 లక్షల క్యూసెక్కులను స్పిల్‌వే, విద్యుదుత్పత్తి, పోతిరెడ్డిపాడు, ఎంజీకేఎల్ఐ, హంద్రీనీవా ద్వారా విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు 1.21 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. 5,174 క్యూసెక్కులను కిందకు వదులుతున్నారు. కృష్ణాబేసిన్‌లో ఎగువన ఉన్న ఆల్మట్టికి 44,054 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 25,640 క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. నారాయణపూర్‌కు 24,842 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 14,411 క్యూసెక్కులను కిందకు విడుదల చేస్తున్నారు. జూరాలకు 67 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఔట్‌ఫ్లో 69,122 క్యూసెక్కులుగా ఉంది. తుంగభద్రకు 29,546 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 38,760 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఇటు కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు పైనుంచి భారీగా వరద వస్తుండటంతో.. 15 గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి 98,440 క్యూసెక్కుల వరద వస్తుండటంతో.. 85 గేట్లు ఎత్తి అంతేస్థాయిలో దిగువకు వదులుతున్నారు.



శ్రీశైలం ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

పంటలకు ఊపిరి!

- రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్‌లకు జీవం
- పుంజుకుంటున్న వరి నాట్లు.. తగ్గిన లోటు వర్షపాతం

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 3-4 రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు పంటలకు ఊపిరి పోశాయి. మే నెలాఖరులోనే మురిపించిన వర్షాలు తర్వాత ముఖం చాటేశాయి. ఆ తర్వాత అడపాదడపా వానలు కురిసినా సాధారణ స్థాయికి చేరుకోలేదు. తాజాగా కురుస్తున్న వర్షాలతో నీటికొరతను ఎదుర్కొంటున్న పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, ఇతర ఆరుతడి పంటలకు జీవమొచ్చింది. వరి నాట్లు పుంజుకోవడానికి మార్గం సుగమమైంది. గ్రేటర్ హైదరాబాద్ సహా కొన్ని జిల్లాల్లో ఇంకా లోటు వర్షపాతం ఉన్నా.. 23 జిల్లాలు వర్షాభావ పరిస్థితుల నుంచి సాధారణ స్థాయికి చేరాయి. దీంతో కొద్ది రోజుల క్రితం వరకు 30శాతం ఉన్న లోటు వర్షపాతం ఇప్పుడు 10 శాతానికి తగ్గి సాధారణ స్థితికి చేరుకుంది. జూన్ 1 నుంచి జూలై 23 వరకు రాష్ట్రంలో 29.78 సెం.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 26.79 సెం.మీ. మాత్రమే నమోదైంది. మంగళవారం (22న) ఉదయం 8 గంటల నుంచి బుధవారం 8 గంటల వరకు రాష్ట్రంలో 2.83 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈ 24 గంటల వ్యవధిలో 1 సెం.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా.. 183 శాతం అధికంగా నమోదైంది. రాష్ట్రంలోని 621 మండలాల్లోని 47 మండలాల్లో అధిక, 5 మండలాల్లో అత్యధికంగా, ఒక మండలంలో (ములుగు జిల్లా వెంకటాపురం) అసాధారణంగా వర్షం కురిసింది. 301 మండలాల్లో ఓ మోస్తరు, 171 మండలాల్లో స్వల్ప, 61 మండలాల్లో అతిస్వల్పంగా వర్షం కురిసింది. 35 మండలాల్లో వర్షం లేదు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల్లో సాధారణ స్థాయిని మించి 20-35 శాతం వరకు అధిక వర్షపాతం నమోదైంది.

పంటల సాగు విస్తీర్ణం ఇలా..

రాష్ట్ర సాధారణ సాగు విస్తీర్ణం 1,32,44,305 ఎకరాలు కాగా... ఇప్పటివరకు 76,28,084 ఎకరాల్లో రైతులు పంటలు వేసినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ బుధవారం నివేదికలో పేర్కొంది. వరి సాధారణ విస్తీర్ణం 62,47,868 ఎకరాలు కాగా.. 17,52,144 ఎకరాల్లో (28.4 శాతం) నాట్లు వేశారు. పత్తి సాధారణ విస్తీర్ణం 48,93,016 ఎకరాలు కాగా 42,00,411 ఎకరాల్లో (85.85 శాతం) సాగు పూర్తయింది. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 5,21,206 ఎకరాలు కాగా... 5,20,527 ఎకరాల్లో(99.87శాతం) పంట వేశారు. కంది 62.95 శాతం, సోయాబీన్ 83.12శాతం విస్తీర్ణంలో సాగయ్యాయి. ఇతర పంటలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగు పురోగతిలో ఉందని వ్యవసాయశాఖ పేర్కొంది.

పోలవరం వద్ద నీటి లభ్యత 2191 టీఎంసీలు!

- గోదావరిలో 651 టీఎంసీల మిగులు జలాలు
- బనకచర్లతో తరలించేది 200 టీఎంసీలే
- సీడబ్ల్యూసీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వివరణ

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు వద్ద 75 శాతం.. అంటే నాలుగేళ్లలో కచ్చితంగా మూడేళ్లు వచ్చే వరద ఆధారంగా 2191 టీఎంసీల నీటి లభ్యత ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. ఈ లెక్కల ఆధారంగా గోదావరి ట్రైబ్యునల్ జరిపిన కేటాయింపుల మేరకు ఎగువ రాష్ట్రాలన్నీ తమ నీటి వాటాలను పూర్తి స్థాయిలో వాడుకున్నా, పోలవరం వద్ద 651 టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని పేర్కొంది. మరోవైపు తాము కేవలం 200 టీఎంసీల జలాల తరలింపు కోసమే గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు స్పష్టం చేసింది. బేసిన్ పరిధిలోని అన్ని రాష్ట్రాలూ ప్రస్తుత అవసరాల మేరకు నీళ్లను వాడుకున్నా ఏటా సగటున 3000 టీఎంసీల జలాలు పోలవరం ప్రాజెక్టు వద్ద నుంచి సముద్రంలోకి పోతున్నాయని పేర్కొంది. ఏపీ ప్రభుత్వం సమర్పించిన బనకచర్ల ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)పై కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) లేవనెత్తిన అభ్యంతరాలను నివృత్తి చేస్తూ ఈ నెల 14న ఏపీకి చెందిన కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ రాంబాబు సీడబ్ల్యూసీకి లేఖ రాశారు. గోదావరి ట్రైబ్యునల్ కేటాయింపుల మేరకు బేసిన్ పరిధిలోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిసా, తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు తమ పూర్తి వాటా జలాలను వాడుకుంటే బనకచర్లకు నీటి లభ్యత ఉంటుందా? అని సీడబ్ల్యూసీ లేవనెత్తిన ప్రశ్నకు ఏపీ ప్రభుత్వం వివరణఇచ్చింది. వరద జలాలంటే మిగులు జలాలేనని వివరించింది. బచావత్ ట్రైబ్యునల్ తీర్పుకు అనుగుణంగానే బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదించామని పేర్కొంది. న్యాయపరంగా బేసిన్ చివరి రాష్ట్రాలు మిగులు జలాలను వాడుకోవడం ఎగువ రాష్ట్రాల హక్కులను హరించినట్లు కాదని తేల్చిచెప్పింది.

కన్నతండ్రి.. కర్కోటకుడై..!

- అకారణంగా చిన్నారి ముఖంపై కాలుతో తన్నుతూ దండన
- భార్య వారించినా దుర్మార్గం.. ఆ వీడియో వాట్సాప్ స్టేటస్‌గా
- నెట్‌లో వైరల్ అవడంతో వెలుగులోకి.. కేసు నమోదు
- కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో ఘటన



కుమార్తెను కాలుతో తన్నుతున్న రమేశ్

బూర్గంపాడు, జూలై 23: బుద్ధిగా హోంవర్క్ చేసుకుంటున్న బాలిక పట్ల కన్నతండ్రి మూర్ఖంగా ప్రవర్తించాడు. అకారణంగా ఆమెను దండించాడు. భార్య అడ్డుపడినా పదే పదే చిన్నారి బిగ్గరగా రోదిస్తున్నా ఆమె ముఖంపై కాలుతో తన్నాడు! పైగా ఆ దృశ్యాలను తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక గ్రామంలో ఈ ఘటన జరిగింది. బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంకు చెందిన రమేశ్ అనే వ్యక్తి సారపాక ఐటీసీ కర్మాగారంలో ఉద్యోగం చేస్తూ అక్కడే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని భార్య భవాని, కుమార్తెతో కలిసి ఉంటున్నాడు. అతడి కూతురు నాలుగో తరగతి చదువుతోంది. ఈ నెల 20న బాలిక ఇంట్లో హోంవర్క్ చేసుకుంటుండగా పక్కన కుర్చీ వేసుకొని కూర్చొని.. ఆమెను కాలితో తన్నుతూ తీవ్ర భయభ్రాంతులకు గురిచేశాడు. భార్య అడ్డుపడగా ఆమెతో గొడవకు దిగాడు. కూతురిని భర్త తన్నుతున్న దృశ్యాలను భార్య వీడియో తీసి.. దాన్ని అధికారులకు పంపుతానని అతడిని బెదిరించింది. అయితే.. 'నువ్వేంటి అధికారులకు పంపేది?'అంటూ రెచ్చిపోయిన అతడు.. సెల్‌ఫోన్‌ను లాక్కుని ఆ వీడియోను తీసుకుని వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఆ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారగా.. కొందరు చైల్డ్ హెల్ప్ లైన్ నంబరుకు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. స్పందించిన ఆ అధికారులు ఐసీడీఎస్ అధికారులను అప్రమత్తం చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సక్కుబాయి విచారణ జరిపి ఘటనపై మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమేశ్‌పై జువైనల్ జస్టిస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని ఎస్సై ప్రసాద్ తెలిపారు. కాగా, ఘటన అనంతరం రమేశ్ భార్య కూతురిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. రమేశ్.. క్రికెట్ బెట్టింగులకు అలవాటుపడి అప్పులపాలయ్యాడని, మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవ పడుతుండేవాడని స్థానికులు చెబుతున్నారు.

నిన్న కల్తీ కల్లు.. నేడు కల్తీ మద్యం

- రెక్టిఫైడ్ స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారీ
- బ్రాండ్ల వారీగా నకిలీ లేబుల్స్, స్టిక్కర్లు
- సూర్యాపేట ఘటన ఎక్సైజ్‌లో కలవరం

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు గంజాయి, డ్రగ్స్.. నిన్న కల్తీకల్లు కేసులతో సతమతమైన ఎక్సైజ్ శాఖను ఇప్పుడు కల్తీ మద్యం కలవరపెడుతోంది. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే రెక్టిఫైడ్ స్పిరిట్(ఆర్ఎస్)తో యథేచ్ఛగా కల్తీమద్యాన్ని తయారు చేస్తున్నారు. దానికి వేర్వేరు బ్రాండ్ల వారీగా నకిలీ లేబుళ్లు, స్టిక్కర్లను అంటిస్తూ.. విక్రయాలు సాగిస్తున్నారు. మూడ్రోజుల క్రితం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం రామాపురంలోని ఒక రైస్‌మిల్లులో పెద్ద ఎత్తున కల్తీ మద్యం తయారీ కేంద్రం గుట్టు రట్టయిన నేపథ్యంలో.. ఇప్పుడు ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ తరహా దందాపై దృష్టిసారించారు. మేళ్లచెరువు రైస్ మిల్లులో 8 నెలలుగా కల్తీ మద్యం తయారవుతున్నట్లు అధికారులు తేల్చారు. ఏపీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్యూరియస్ లిక్కర్ దందా నడిపి, అక్రమార్జనకు పాల్పడిన ముఠాలోని కొందరు తెలంగాణకు మకాం మార్చారు. వారి నుంచి 38 కార్టన్ల ఎంసీ విస్కీ క్వార్టర్ సీసాలు, 11,800 ఖాళీ బాటిళ్లు, 42.8 కిలోల మూతలు, 7,814 లేబుల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఎక్సైజ్‌శాఖ అధికారులు విచారణ జరపగా.. హైదరాబాద్ శివార్లలోని ఓ ఫార్మా కంపెనీ నుంచి రెక్టిఫైడ్ స్పిరిట్‌ను కొనుగోలు చేసి.. కల్తీ మద్యం తయారు చేసినట్లు తేలింది. అలా తయారు చేసిన మద్యాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని బెల్టు షాపుల ద్వారా విక్రయిస్తున్నారు. గతంలోనూ ఇబ్రహీంపట్నం, భువనగిరి, రామన్నపేట, నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో రాయల్‌స్టాగ్ విస్కీ తాగిన వారికి కడుపు నొప్పి వచ్చిందనే ఫిర్యాదులపై ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక కమిటీ వేసి, విచారణ జరిపితే.. ఒడిసాలోని టోంగ్ జిల్లాలోని కల్తీ మద్యం తయారీ యూనిట్ ద్వారా రాష్ట్రానికి ఆ సరుకు వచ్చినట్లు తేల్చారు.

ఫార్మా కంపెనీల నుంచి..

మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఎక్సైజ్‌శాఖ లైసెన్సులు జారీచేసిన పది దాకా డిస్టిలరీస్ పరిశ్రమలున్నాయి. వాటిల్లో తయారైన రెక్టిఫైడ్ స్పిరిట్‌ను ఫార్మా కంపెనీలు కొనుగోలు చేస్తాయి. ఆ స్పిరిట్ కేటాయింపు, రవాణా అంతా ఎక్సైజ్‌శాఖ పర్యవేక్షణలోనే జరగాలి. కానీ.. కొవిడ్ కల్లోలం సమయంలో శానిటైజర్ల అవసరం పెరగడంతో.. వాటి తయారీకి కోటాకు మించి స్పిరిట్‌ను ఫార్మా పరిశ్రమలకు కేటాయించారు. దీంతో కొన్ని కంపెనీలు లెక్కాపత్రం లేకుండా స్పిరిట్‌ను తరలించుకుపోతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పలు పరిశ్రమల నిర్వాహకులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. వాస్తవానికి రెక్టిఫైడ్ స్పిరిట్ అనేది తాగడానికి ఉపయోగపడకుండా ఉండేందుకు అందులో బెంజిన్ అనే విషపూరిత రసాయనాన్ని కలిపి.. దానిని పరిశ్రమల అవసరాలకు వినియోగించుకునేలా పంపుతారు. 80% రెక్టిఫైడ్ స్పిరిట్‌ను లిక్కర్ తయారీలో రా మెటీరియల్‌గా వాడతారు. దాన్ని శుద్ధీకరించి, ఫ్యూజల్ ఆయిల్, ఆల్డిహైడ్స్, మిథనాల్‌లను తొలగించిన తర్వాత ఎగ్స్ట్రా న్యూట్రిన్ ఆల్కహాల్(ఈఎన్ఏ) తయారవుతుంది. దీన్నుంచి లిక్కర్ తయారవుతుంది. అయితే.. అక్రమార్కులు రెక్టిఫైడ్ స్పిరిట్‌ను కొనుగోలు చేసి, నీళ్లు కలిపి.. కల్తీ మద్యాన్ని తయారు చేస్తున్నారు. కాగా, ఎస్‌టీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ బృందాలతో రాష్ట్ర వ్యాప్తంగా విచారణ జరిపి.. కల్తీ మద్యం తయారీ మూలాలను కనుగొని, చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఢిల్లీలో భారీ వర్షాలు.. ఈత కొలనుల్లా రోడ్లు

న్యూఢిల్లీ, జూలై 23: భారీ వర్షాలతో ఢిల్లీలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. చాలా ప్రాంతాల్లో నడుము లోతు నీళ్లు నిలిచాయి. ఆ నీళ్లలో ఈత కొడుతూ, ఇళ్లలోని బాత్ టబ్‌లను పడవల్లాగా నీళ్లలో వేసుకొని అటూ ఇటూ తిరుగుతూ అక్కడి ప్రజలు బీజేపీ ప్రభుత్వంపై వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు. "అన్ని వీధుల్లో స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేఖా గుప్తాకు కృతజ్ఞతలు" అని ఆప్ నాయకురాలు అతిశీ ఎద్దేవా చేశారు. వర్షాల నేపథ్యంలో బీజేపీ ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే, వాన నీటిని మళ్లించడం తెలియకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆప్ నాయకులు విమర్శించారు. అయితే, తాము అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అవుతోందని, ఆప్ ప్రభుత్వమే రోడ్లను బాగు చేయలేదని బీజేపీ ఎదురుదాడి చేసింది.

ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

- పెండింగ్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి
- రాష్ట్రంలో పాఠశాలలు, కాలేజీల బంద్ విజయవంతం
- వామపక్ష విద్యార్థి సంఘాల 'చలో సచివాలయం' ఉద్రిక్తత



విద్యార్థి సంఘం నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు బుధవారం చేపట్టిన పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల పిలుపు నేపథ్యంలో ముందు రోజే విద్యా సంస్థలు సెలవు ప్రకటించాయి. బంద్ నేపథ్యంలో విద్యార్థి సంఘాలు చలో సచివాలయం చేపట్టాయి. సంఘం నేతలు అమరవీరుల స్మారక చిహ్నం వరకు చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ తోపులాట జరిగి, ఉద్రిక్తతకు దారితీసింది. విద్యార్థి నేతలను పోలీసులు అరెస్టు చేశారు. పిడిగుద్దులతో బలవంతంగా లాగారని, ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వ్యాన్లలో వేశారని విద్యార్థి నేతలు ఆరోపించారు. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో 2253 ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేదని, 1500 పైగా బడుల్లో మరుగుదొడ్లు లేవని తెలిపారు. సచివాలయానికి వచ్చిన మంత్రులకు సమస్యలు చెప్పాలని వస్తున్న విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఈ అరెస్టులను ఖండిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ దిష్టి బొమ్మలు దహనం చేయాలని విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి.

త్వరలోనే స్వదేశీ డెంగీ వ్యాక్సిన్

- 'డెంగీఆల్' మూడో దశ ట్రయల్స్‌కు 7,248 మంది నమోదు

న్యూఢిల్లీ, జూలై 23: ప్రాణాంతక డెంగీ వ్యాధి నివారణకు స్వదేశీ వ్యాక్సిన్ అభివృద్ధికి చకచకా అడుగులు పడుతున్నాయి. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) సహకారంతో పనాసియా బయోటెక్ అభివృద్ధి చేస్తున్న 'డెంగీఆల్' వ్యాక్సిన్ ప్రస్తుతం మూడో దశ క్లినికల్ ట్రయల్స్‌లో ఉంది. గతేడాది ఆగస్టులో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న 10,355 మంది ఆరోగ్యవంతమైన వలంటీర్లపై ట్రయల్స్ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు 7,248 మంది నమోదు చేసుకున్నారు. ట్రయల్స్‌లో పాల్గొనే వలంటీర్ల నమోదు ప్రక్రియ ఈ ఏడాది అక్టోబరు వరకూ కొనసాగుతుంది. ఐసీఎంఆర్ నేతృత్వంలో డెంగీఆల్ వ్యాక్సిన్‌కు ట్రయల్స్ నిర్వహిస్తున్నారు. డెంగీఆల్ అనేది నాలుగు డెంగీ వైరస్‌సెరోటైప్‌ల నుంచి రక్షణనిచ్చేందుకు రూపొందించిన టెట్రావాలెంట్ వ్యాక్సిన్. వాస్తవానికి టెట్రావాలెంట్ డెంగీ వ్యాక్సిన్ స్ట్రెయిన్ (టీవీ003/టీవీ005)ను మొదట అమెరికాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఎన్ఐహెచ్) అభివృద్ధి చేసింది. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన ప్రీక్లినికల్ ట్రయల్స్‌లో ఈ స్ట్రెయిన్ ఆశాజనక ఫలితాలను చూపించింది. దీంతో దీన్ని అనేక దేశాలకు అందించారు. దీన్ని స్వీకరించిన మూడు భారతీయ కంపెనీల్లో ఒకటైన పనాసియా బయోటెక్ ఈ స్ట్రెయిన్ ఆధారంగా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడంలో ముందంజలో ఉంది. 2018-19లోనే తొలి, రెండో దశ ట్రయల్స్‌ను పూర్తిచేసింది. ఆ తర్వాత వ్యాక్సిన్ పూర్తి ఫార్ములేషన్‌ను అభివృద్ధి చేసి ప్రాసెస్ పేటెంట్‌ను కూడా పొందింది. మూడో దశ ట్రయల్స్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) నుంచి అన్నిరకాల అనుమతులు వచ్చాయి. కాగా, భారత్‌కు చెందిన మరో సంస్థ సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) కూడా సొంత డెంగీ వ్యాక్సిన్ 'డెంగీసిల్' కోసం మూడో దశ క్లినికల్ ట్రయల్స్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రక్రియ ఈ ఏడాది చివరినాటికి మొదలయ్యే అవకాశం ఉంది.

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

కన్నాయిగూడెం, జూలై 23(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బుట్టాయిగూడెం పంచాయతీ పరిధి కొత్తూరు అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్‌గా పనిచేస్తున్న కుమ్మరి శాంతి ఇంటి వద్ద ఎలుకల మందు మింగి విధులకు హాజరయ్యారు. కొద్ది సేపటి తర్వాత అస్వస్థతకు గురికాగా ఆయాలు ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. ఆ తర్వాత హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలుకడగానే ఉందని సమాచారం. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది. శాంతి భర్త కుమ్మరి నాగయ్య ఇందిరమ్మ ఇల్లు రాలేదని మనస్తాపం చెంది కొన్ని నెలల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

35.74 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'మీపై మనీ లాండరింగ్ కేసు నమోదు అయిందం'టూ సైబర్ నేరగాళ్లు సీబీఐ అధికారుల పేరిట బెదిరించి ఓ వృద్ధుడి నుంచి రూ.35.74 లక్షలు కాజేశారు. ఆ తర్వాత 'మీపై అభియోగాలు రుజువు కాలేదు. మీ డబ్బును సమీప సైబర్ క్రైంపోలీస్ స్టేషన్‌కు వెళ్లి తీసుకోవాల'ని సూచించడం కొసమెరుపు. హైదరాబాద్ దోమలగూడ ప్రాంతానికి చెందిన 79 ఏళ్ల వృద్ధుడికి ఈ నెల 6న వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి సీబీఐ అధికారి విజయ్ ఖన్నాగా పరిచయం చేసుకున్నాడు. ముంబై కొలాబా పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పాడు. 'మీ పేరుతో కొలాబా కెనరా బ్యాంక్‌లో ఖాతా ఉంది. దాని నుంచి అక్రమంగా విదేశాలకు డబ్బు తరలింద'ని భయపెట్టాడు. ప్రధాన నిందితుడు నితీష్ గోయల్‌ను అరెస్ట్ చేశామని, అతడికి సహకరించిన వారిపై కూడా మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయని చెప్పాడు. అరెస్ట్ వారెంట్‌లు, సుప్రీంకోర్టు ఆదేశాలంటూ నకిలీ పత్రాలు చూపి, ఏ క్షణంలోనైనా అరెస్ట్ చేస్తామని బెదిరించాడు. ఇది దేశ ఆర్థిక భద్రతకు సంబంధించిన కేసు అని, ఈ దర్యాప్తు గురించి ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించాడు. 'మీపై కేసు తొలగించాలంటే మీ ఖాతాలో ఉన్న డబ్బును భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ఖాతాలకు బదిలీ చేయాల'ని సూచించాడు. ఆర్బీఐ అధికారులు తనిఖీచేసి, ఆ డబ్బు సరైన పద్ధతుల్లో వచ్చిందేనని నిర్ధారించుకుని తిరిగి ఇస్తారని నమ్మబలికాడు. తర్వాత కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారినంటూ పరిచయం చేసుకున్న ఆయుష్ గుప్తా అనే వ్యక్తి రోజూ ఫోన్ చేస్తూ డబ్బు బదిలీ చేయాలని, లేకుంటే అరెస్ట్ తప్పదంటూ భయపెట్టేవాడు. ఇలా సైబర్ నేరగాళ్లు 10 రోజుల్లో రూ..35.79 లక్షలు పలు ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. తర్వాత 'మీపై అభియోగాలు రుజువు కాలేదు. మీ డబ్బును సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తీసుకోవాల'ని చెప్పారు. వారి మాటలు నమ్మి డబ్బు కోసం ఆ వృద్ధుడు సైబర్ క్రైంస్టేషన్‌కు రావడంతో మోసం వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చర్చ జరగాల్సిందే...

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కుదిపేస్తున్న 'ఆపరేషన్ సిందూర్' మీద ప్రభుత్వం చర్చకు సిద్ధపడింది. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, తన పర్యటనలు ముగించుకొని 26న స్వదేశానికి చేరుకున్నాక, 28న ఈ అంశంపై చర్చ జరగబోతున్నట్టు వార్తలు వింటున్నాం. దాదాపు పదహారు గంటల ప్రత్యేక చర్చ అనంతరం ప్రధాని సమాధానం ఇస్తారు. మూడురోజుల పాటు పార్లమెంట్ ఉభయసభలూ స్తంభించిపోయిన నేపథ్యంలో, అధికారపక్షం తన వైఖరిని సడలించుకున్నందుకు సంతోషించాలి, అభినందించాలి.

బిహార్ ఓటర్ల జాబితాకు ఎన్నికల సంఘం చేపట్టిన 'ప్రత్యేక సమగ్ర సవరణ' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్) మీదా, పహల్గాం ఉగ్రదాడి-ప్రతీకార ఆపరేషన్ సిందూర్ మీదా అధికారపక్షాన్ని చర్చకు దించాలని విపక్షాలు మూడు రోజులుగా తీవ్ర ప్రయత్నం చేస్తున్నాయి. ఈ ప్రతిష్టంభనకు తోడు ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ రాజీనామా కూడా ప్రభుత్వానికి జవాబు చెప్పుకోవాల్సిన కొత్త సమస్యగా ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో, సిందూర్ మీద చర్చకు ప్రభుత్వం సిద్ధపడటం విపక్షాలతో ఘర్షణను చల్లార్చేందుకు ఉపకరిస్తుంది. సభ వెలుపల ఉభయపక్షాలూ ఎంత రాజకీయమైనా చేసుకోవచ్చును కానీ, దేశ పరువుప్రతిష్ఠలతో ముడిపడిన ఈ అంశం మీద సభ లోపల అర్థవంతమైన, విలువైన, లోతైన చర్చ జరగాలి. పహల్గాం, సిందూర్ రెండూ కూడా జవాబులేని అనేక ప్రశ్నలను మిగల్చాయి. పాలకులు చెప్పినదానిని నమ్ముతూ వచ్చిన దేశప్రజల్లో, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యానాలు గందరగోళం కలిగించాయి. యుద్ధం ఆపడం, యుద్ధవిమానాలు కూలిపోవడం వంటి మాటలు అసహనాన్ని, ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ నేపథ్యంలో, అధికారపక్షాన్ని అవమానించడమో, నిలదీయడమో లక్ష్యంగా కాక చర్చ హుందాగా సాగేట్టు విపక్షం చూడాలి. యుద్ధం అన్నాక కష్టనష్టాలూ, ఎదురుదాడులు, ఉపసంహరణలూ అత్యంత సహజం. ప్రజలకు నిజాలు నిర్భయంగా చెప్పడానికి పార్లమెంట్‌ను మించిన పవిత్రక్షేత్రం మరొకటిలేదు.

సభలో రభస పూర్తిగా ఉపశమించాలంటే బిహార్ విషయంలోనూ ప్రభుత్వం దిగిరావలసిందే. 'సర్'లో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల సమర్పణ గడువు ఇంకో రెండురోజుల్లో ముగియబోతున్నది. 98శాతం ప్రక్రియ పూర్తయిందని ఈసీ అంటోంది. ఆగస్టు ఒకటిన ప్రకటించబోయే ఓటర్ల ముసాయిదా జాబితాలో నుంచి ఎన్నికల సంఘం తొలగించబోతున్న పేర్లు బుధవారం నాటి అంచనాల ప్రకారం 56లక్షలు. చనిపోయినవారు 20 లక్షలు, శాశ్వతంగా వలసపోయినవారు 28 లక్షలు, పలుచోట్ల నమోదైనవారు 7 లక్షలు, ఆచూకీ తెలియనివారు లక్ష ఉన్నారట. రాష్ట్రం వెలుపల ఉన్నవారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చునంటూ ఇస్తున్న అవకాశాన్ని, పొట్టకూటికోసం కార్మికులుగా ఇతర రాష్ట్రాలకు వలసపోయినవారిలో ఎంతమంది వినియోగించుకోగలరో ఈసీకి తెలియదనుకోలేం. ప్రాథమిక పత్రాలుగా ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు కార్డులను పరిగణనలోకి తీసుకోవాలని సూచనచేయడం వినా, ఈ ప్రక్రియలో జోక్యం చేసుకొనేందుకు సుప్రీంకోర్టు ప్రస్తుతానికి ఇష్టపడలేదు. ఈ మూడింటినీ ప్రామాణిక పత్రాలుగా ఆమోదించేది లేదని ఎన్నికల సంఘం వెనువెంటనే తాను సమర్పించిన అఫిడవిట్‌లో తేల్చేసింది. ఓటరు పౌరసత్వాన్ని ప్రశ్నించే, పరీక్షించే, రుజువులు కోరే హక్కు తనకు దఖలు పడి ఉన్నదని కూడా ఈసీ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో, చట్టసభల్లో తమ ఆగ్రహాన్ని, ఆవేదనను వెలిబుచ్చడంతో పాటు, బిహార్‌తో ఆరంభమై దేశమంతా విస్తరించబోతున్న ఈ కొత్త పౌరసత్వ పరీక్ష వెనుక ఉన్న రాజకీయలక్ష్యాలు, కుట్రలు, ప్రజాస్వామ్యానికి ఒనగూరే నష్టాలు ప్రజలకు తెలియచెప్పాలని విపక్షాలు ఆశించడం సహజం. ఇప్పుడు తొలగించబోతున్న దాదాపు అరకోటిమంది ఓటర్ల జాబితాతోనే గత రెండు దశాబ్దాల్లో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు పలుమార్లు జరిగి, ప్రధాని మోదీనీ, నితీశ్‌కుమార్‌ను ప్రజలు ఎన్నుకున్నారని విపక్షాలు గుర్తుచేస్తున్నాయి. తన ఉనికినీ, ఓటుహక్కునూ నిరూపించుకోవాల్సిన అంతిమబాధ్యతను పూర్తిగా పౌరుడి నెత్తి మీదకు నెట్టిన ఈ 'సర్' ప్రక్రియ మీద పార్లమెంట్ ఉభయసభల్లోనూ లోతైన చర్చ జరగడం అత్యంత అవశ్యం.

వీధికుక్కల సమస్యకు పరిష్కారం లేదా?

దేశంలో వీధికుక్కలు దాడులు చేయడం ఇటీవల బాగా పెరిగిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో గత మూడేళ్లలో 6,72,860 కుక్క కాటు కేసులు నమోదైనట్లు కేంద్ర పశుసంవర్ధకశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఒక్క జనవరి నెలలోనే 23,180 కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ప్రతియేటా దేశంలో వీధికుక్కల బారిన పడి గాయాలపాలవుతున్న వారి సంఖ్య 26.5 శాతం చొప్పున పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

మధ్యప్రదేశ్ ప్రభుత్వం వీధికుక్కల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఏడుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో ఏకంగా ఒక కమిటీనే నియమించిందంటే దేశంలో వీధికుక్కల సమస్య ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పంజాబ్-హర్యాణా హైకోర్టులో దాఖలైన 193 కుక్కల దాడి ఘటనలపై తీవ్రంగా స్పందించిన హైకోర్టు ఒక్కొక్క పంటిగాటుకు పదివేల రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలనీ, గాయం 0.2 సెంటీమీటర్లు ఉండి, కండ ఊడి వచ్చిన కేసుల్లో బాధితునికి పరిహారంగా ఇరవై వేలు చెల్లించాలని తీర్పు చెప్పింది.



విచిత్రమేమంటే, ఎవరినైనా వీధికుక్క కరవటమో, పత్రికలలోను, మీడియాలోను వార్తలు రావటమో, ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తటమో లేదా న్యాయస్థానాలు గట్టిగా చీవాట్లు పెట్టటమో జరిగినప్పుడు మాత్రమే అప్పటికప్పుడు అధికారులు సమీక్షలు జరుపుతున్నారు. ఆ తరువాత మెల్లగా సమస్యను పక్కనపడేస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఇదే తంతు జరుగుతోంది. ఈ తంతులో అమాయకులైన ప్రజలు గాయపడటమో, ప్రాణాలు కోల్పోవటమో జరుగుతోంది. పాలకులకు, అధికారులకు ఎటువంటి శిక్షలూ ఉండవు. కనుక సమస్య గురించి పెద్దగా పట్టించుకోవటం లేదు. మన దేశంలో ఏటా పదిహేను లక్షల మంది కుక్కకాటుకు గురవుతున్నారని, ఇరవై వేల మంది రేబిస్ వ్యాధి సోకి చనిపోతున్నారనీ, వీరిలో నలభైశాతం పదిహేనేళ్ళ లోపు స్కూలు వయస్సు బాలబాలికలేననీ లెక్కలు చెబుతున్నాయి. ఒక సర్వే ప్రకారం దేశంలో ముప్పై లక్షలకు పైగా వీధికుక్కలు ఉన్నాయి.

పంచాయితీలు, మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల చట్టాలలో ప్రమాదకరమైన వీధికుక్కల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యల గురించి నిబంధనలు స్పష్టం చేస్తున్నా, సంబంధిత అధికారులు వాటిని అమలుచేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఇందుకు కారణం– చట్టాల అమలు తీరును పర్యవేక్షించేవారు, సకాలంలో సమీక్షించేవారు లేకపోవటం; చట్టాలు, నిబంధనలను అమలుచేయని అధికారులపై సరైన చర్యలు లేకపోవటం.

అలసత్వాన్ని ప్రదర్శించే అధికారులపై కొరడా ఝుళిపించాలి. కుక్కకాటుకు గురైన వారికి నిర్దిష్ట మొత్తంలో పరిహారాన్ని బాధ్యులైన అధికారుల నుంచి వసూలు చేసి బాధితులకు చెల్లించేలా నిబంధనలను మార్చాలి. స్టెరిలైజేషన్ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించి, చిత్తశుద్ధితో సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. సకాలంలో చర్యలు తీసుకుంటే వీధికుక్కల వల్ల రేబిస్ వ్యాధి బారినపడే వారి సంఖ్యను 80 శాతం వరకు తగ్గించవచ్చు. రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిత్యం సమీక్షించాలి. న్యాయస్థానాలు కూడా తాము ఇచ్చిన తీర్పులను తరచు సమీక్షించి, అలసత్వం ప్రదర్శించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్సుచేయాలి.

– డా. వి. రాజేంద్రప్రసాద్

ఆదివాసుల మతం ఏమిటి?

జనాభా గణన అధికారి మా ఇంటికి వచ్చిన ప్రతిసారి నన్ను 'మీ మతం ఏమిటి' అని అడుగుతారని ఎంతో ఆశతో ఎదురుచూసేవాణ్ణి. కానీ, నా ఆశను అడియాశ చేస్తూ నన్ను అడగకుండానే వారు నా మతాన్ని హిందువుగా నమోదు చేసేవారు. ఎందుకు మతం అడగలేదని వారితో అంటే, మీరు హిందువులు కదా అని ఆశ్చర్యంగా సమాధానం ఇచ్చేవారు. జనగణన సమయంలో ప్రతి ఆదివాసీ బిడ్డకు ఎదురయ్యే సంఘటన ఇది.

కేంద్ర ప్రభుత్వం 2021లో జరగాల్సిన జనగణనను ఎట్టకేలకు 2027లో నిర్వహించడానికి నిర్ణయించింది. ఈ జనగణనలో ఒక ప్రత్యేకత ఏమంటే, ప్రతి పౌరుడి కులాన్ని నమోదు చేయటం. 1931 తరువాత కులాల వారీ జనగణనను నిలిపివేశారు. దీంతో పాటు ఆదివాసులను Other Religions and Persuasion (ORP) అనే మత కేటగిరీ నుంచి తొలగించి హిందూ మతంలో విలీనం చేయాలనే ప్రతిపాదన కూడా చర్చలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదే జరిగితే ఆదివాసులు తమ మతాన్ని ప్రత్యేక మతంగా నమోదు చేసుకునే హక్కును కోల్పోతారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 నిబంధనను ఉల్లంఘించడమే. ఈ నిబంధన– ప్రతి పౌరుడు తనకు ఇష్టమొచ్చిన మతాన్ని ఆచరించే హక్కును కల్పిస్తోంది. వందలాది మత సమూహాలు ఈ నిబంధనను ఉపయోగించుకుని ఓఆర్‌పీ కేటగిరీలో తమ మతాన్ని నమోదు చేసుకుంటున్నాయి. ఈ మధ్య కాలం నుంచే ఆదివాసులు తమను ప్రత్యేక మతంగా గుర్తించాలనే డిమాండ్‌తో ముందుకు వస్తున్నారు. ఈ డిమాండ్‌ను ఆదిలోనే తొక్కేయాలనే ప్రయత్నం జరుగుతోంది. ఇప్పటికే ఆదివాసులను గుండుగుత్తగా హిందువులుగా నమోదు చేస్తున్నారు.

వాస్తవానికి ఆదివాసుల మత విశ్వాసాలకూ హిందూ మతానికీ ఏ సంబంధమూ లేదు. బ్రిటిష్ వలస పాలనలో 1871లో మొదలైన జనగణనతోనే ఆదివాసుల మతం ప్రశ్నార్థకంగా మారింది. బ్రిటిష్ పాలకులకు ఎవరిని హిందువులుగా గుర్తించాలనే ప్రశ్న ఒక సవాలుగా మారింది. ఎందుకంటే అప్పటికి దేశంలో ఇస్లామేతర మతాలు తమ ప్రత్యేక ఉనికిని కలిగివుండేవి. మొదటగా ఇస్లామేతర మత విశ్వాసాలను బ్రిటిష్ వారు పెగానిజంగా పరిగణించారు. అంటే బహుదేవత ఆరాధన, ఆత్మలను, ప్రకృతిని పూజించటం, విగ్రహారాధన చేయడం. ఈ మతాచారాలకు 19వ శతాబ్దంలో హిందూ మతంగా నామకరణం చేశారు. ఇందులో బ్రిటిష్ పాలకులతో పాటు, మత సంస్కరణవాదులు కూడా ప్రధాన పాత్ర పోషించారు.

ఇండియాలో పురాతనకాలం నుంచి అనేక ప్రాంతీయ మతాచరణలు ఉన్నాయి. అయితే దేశ స్థాయిలో బ్రాహ్మణ (వైదిక), శ్రమణ (బౌద్ధ, జైన) మతాలు ఉండేవి. ఇవి మళ్లీ అనేక శాఖలుగా విభజన అయ్యాయి. బ్రాహ్మణిజం ముఖ్యంగా వైష్ణవ, శైవంగా విభజన



తమ మతాన్ని ప్రత్యేక మతంగా గుర్తించాలనే డిమాండ్‌తో ఆదివాసులు బలంగా ముందుకు వస్తున్నారు. ఇది సెంట్రల్ ఇండియాలో మరింత బలంగా ఉంది. 1951లో 18.4 లక్షల మంది ఓఆర్‌పీ కింద నమోదు కాగా, 2011లో ఇది 79.3 లక్షలకు పెరిగింది. సర్నాధర్మంగా నమోదు చేసుకున్న వారి సంఖ్య 1991లో 18 లక్షల నుంచి 2011లో 35 లక్షలకు పెరిగింది.

అయింది. శైవిజం బ్రాహ్మణేతర మతాచారాల నుంచి అభివృద్ధి చెందింది.

హిందూ అనే పదాన్ని 11వ శతాబ్దం ముస్లిం చరిత్రకారుడు అల్బెరూనీ మొదటిసారి వాడారు. దీనిని సింధూ నది తూర్పున ఉన్న భౌగోళిక ప్రాంతాన్ని, ఆ ప్రజల సంస్కృతిని వర్ణించడానికి వాడారు. క్రమంగా ముస్లిమేతరులను హిందుస్థానీలుగా వర్ణించారు. అలా ఈ పదం ముస్లిమేతరుల భాష, సంస్కృతి, మతాచారాలను వర్ణించడానికి వాడారు.

బ్రిటిష్ పాలకులు దేశంలోని విభిన్న మత విశ్వాసాల్ని ఒక తాటిపైకి తీసుకువచ్చి హిందూయిజంను ఏకరీతి మతంగా రూపొందించడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో అనేక ప్రశ్నలు ముందుకొచ్చాయి. ఒక మతాన్ని ఆధునిక మతంగా గుర్తించాలంటే అది మోనోథియిజం (ఒకే దేవుని విశ్వాసం) పునాది మీద నిర్మితమై ఉండాలి. హిందూయిజంలో కోట్లాది దేవతలున్నారనే భావన ఉంది. మరి ఇది ఆధునిక మతం ఎట్లా అవుతుందనే ప్రశ్న వచ్చింది. అప్పుడు రాజా రామ్మోహన్‌రాయ్ వేదాంత గ్రంథాల్లో మోనోథియిజం ఉందని ప్రచారం చేయడంతో ఇది ఆధునిక మతంగా గుర్తింపు పొందింది.

హిందూయిజాన్ని ఒక మతంగా పరిగణించిన తరువాత ఎవరిని హిందువులుగా గుర్తించాలనే ప్రశ్న ముందుకొచ్చింది. ఏ కులం, సమూహం హిందూయిజంలో భాగం అనే ప్రశ్న అపరిష్కృతంగా ఉండిపోయింది. ఈ చర్చ ఆదివాసుల మతవిశ్వాసాలపై చాలా ప్రభావం చూపింది. ఎందుకంటే హిందూయిజానికి, ఆదివాసీ మతానికి మధ్య గీత క్రమంగా చాలా పలచనైంది. అనేక ఆదివాసీ దేవతలు హిందూ దేవతలుగా చలామణి అవుతున్నారు. ఆ దేవతలకు సంస్కృత పేర్లు పెట్టి, ఆ దేవతలను ఆదివాసీలకు కాకుండా చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి.

ఎవరిని హిందువులుగా గుర్తించాలనే చర్చ 19వ శతాబ్దం చివరి అంకంలో తారస్థాయికి చేరింది. దయానంద సరస్వతి హిందూ మతంలోని బహుళ అంధ మత ఆచరణలను తిరస్కరించి శుద్ధ ఆర్యవాదాన్ని ప్రచారం చేశారు. ఆయన దృష్టిలో నిజమైన హిందువులు కేవలం ఆర్యులు. కానీ 20వ శతాబ్దానికి వచ్చేసరికి మత రాజకీయాలు మొదలైనాయి. అప్పుడు మత గణాంకాలు రాజకీయ అధికారానికి మార్గమయ్యాయి. ఈ నేపథ్యంలోనే హిందూ మహాసభ నాయకుడు సావర్కర్ 1923లో "హిందూత్వ: హిందువు ఎవరు?" అనే రచనలో ఎవరు హిందువు అనే విషయాన్ని నిర్వచించారు. ఆయన ప్రకారం... ఎవరైతే భారతదేశాన్ని పితృభూమి, పుణ్యభూమిగా స్వీకరిస్తారో వారే హిందువులు.

ఈ భావజాలం దేశంలో మతతత్వ వాదానికి మరింత ఆజ్యం పోసింది. ఆ తరువాత ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు గోల్వాల్కర్– ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు హిందూమతానికి శత్రువులని ప్రకటించారు. దీనికి విరుద్ధంగా మహాత్మాగాంధీ– హిందువు అంటే అన్ని మతాలను గౌరవించేవాడు అని నిర్వచించారు. ఈ మత రాజకీయాలు ఆదివాసీ సమాజాన్ని క్లిష్ట పరిస్థితిలోకి నెట్టివేశాయి. ఆదివాసులను తమ మతంలో కలుపుకోవడానికి హిందు, క్రిస్టియన్ మతాలు పోటీపడ్డాయి. క్రిస్టియన్లు మొదటగా కొంత పైచేయి సాధించినా, హిందూ నాయకులు బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ఆదివాసులను గుండుగుత్తగా హిందూయిజంలో కలుపుకునే ప్రయత్నం చేశారు. 1941లో అధికారికంగా ప్రకటించకపోయినా ఆదివాసులు హిందువులుగా నమోదయ్యారు.

ఆదివాసుల మతాన్ని జనగణనలో నమోదు చేయడం మొదటి నుంచి (1871–72) క్లిష్టంగానే ఉండేది. అందుకు కారణం హిందూ మతానికి ఒక స్పష్టమైన నిర్వచనం లేకపోవడమే. హిందూ మతం నుంచి ఇతర స్థానిక మతాలను వేరు చేయడం అధికారులకు సవాలుగా మారింది. 1871 జనగణనలో ఆదివాసులను వారి జాతి పేరుతో (ఓఆర్‌పీ) కేటగిరీ కింది నమోదు చేశారు. 1881లో కూడా ఇదే పద్ధతిని కొనసాగించారు. 1891 నుంచి ఆదివాసి మతాన్ని Animistగా పరిగణించారు... అంటే ప్రకృతి ఆరాధకులుగా. దీనిపై పెద్ద చర్చ జరిగింది. 1921లో యానిమిస్ట్ స్థానంలో ట్రైబల్ రెలిజియన్ అనే పదాన్ని వాడారు.

అయితే హిందూ మహాసభ, ఆర్యసమాజ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఆదివాసులను హిందువులుగా గుర్తించాలని జనగణన కమిషన్ మీద చాలా ఒత్తిడిని తీసుకువచ్చారు. వారి ఒత్తిడి వల్ల 1951 నుంచి ట్రైబల్ రెలిజియన్‌ను పూర్తిగా తొలగించి, ఆరు ప్రధాన మతాలతో పాటు Other Religions and Persuasion కేటగిరీని ఎంచుకునే సౌకర్యాన్ని కల్పించారు.

ఆదివాసులను హిందూ మతంలో విలీనం చేయాలన్న ప్రయత్నం పూర్తిగా రాజకీయ లక్ష్యాలతో కూడినదనే విషయాన్ని ఆదివాసులు గ్రహించారు. దేశ వ్యాప్తంగా తమ మతాన్ని ప్రత్యేక మతంగా గుర్తించాలనే డిమాండ్‌తో బలంగా ముందుకు వస్తున్నారు. ఇది సెంట్రల్ ఇండియాలో మరింత బలంగా ఉంది. 1951లో 18.4 లక్షల మంది ఓఆర్‌పీ కింద నమోదు కాగా, 2011లో ఇది 79.3 లక్షలకు పెరిగింది. సర్నాధర్మంగా నమోదు చేసుకున్న వారి సంఖ్య 1991లో 18 లక్షల నుంచి 2011లో 35 లక్షలకు పెరిగింది. సర్నా ధర్మం, సర్నా మతం లేదా పవిత్ర అడవుల మతం అని కూడా పిలుస్తారు. ఇది గిరిజన వర్గాలు, ముఖ్యంగా చోటా నాగపూర్ పీఠభూమి ప్రాంతంలో ఆచరించే, ప్రకృతిని ఆరాధించే విశ్వాసం.

ఆదివాసులు చారిత్రకంగా గ్రామ, కుల వ్యవస్థకు బయట అడవుల్లో జీవించారు. క్రమంగా వారు తమ భాష, మతం, సంస్కృతిని ఏర్పరచుకుని... ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు. వారి పోరాటంలో వారి చరిత్రే వారికి ఆయుధంగా ఉంది. వారి ప్రత్యేక మత, భాష, సంస్కృతి ఉనికిని తొలగించడాన్ని వారి చరిత్రను చెరిపివేసే ప్రయత్నంగా చూడాల్సి ఉంటుంది.



▪ ప్రొ. భంగ్యా భూక్యా
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

ఎరువుల సరఫరాలో విఫలమవుతున్న పాలకులు

రాష్ట్రంలో ఎరువులు ముఖ్యంగా యూరియా, డీఏపీ అవసరానికి సరిపడా లభించటం లేదు. మార్కెట్‌లో లభించినా అధిక ధరలతో పాటు వేరే ఎరువులు కొనాలనే ఒత్తిడిని రైతాంగం ఎదుర్కొంటున్నది. అందుకే పలు జిల్లాల్లో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి తలెత్తింది. వాస్తవ పరిస్థితి ఇదైతే, రాష్ట్ర ప్రభుత్వం ఒకసారి "అవసరం మేరకు నిల్వలున్నాయ"ని, మరోసారి "కేంద్రం నెలవారీగా కోటా ప్రకారం రాష్ట్రానికి పంపటం లేద"ని ప్రకటిస్తున్నది. ఇలా రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన ఎరువులు అందటం లేదనేది వాస్తవం. అందిన మేరకైనా ప్రభుత్వమే స్వయంగా, సక్రమంగా వాటిని రైతులకు అందించేలా చర్యలు చేపట్టలేకపోతున్నది. కారణాలు ఏమైనా, ఎరువులు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

ఖరీఫ్ సీజన్‌లో 16.70 లక్షల టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయ శాఖ అంచనా. కేంద్ర ప్రభుత్వం వీటిని అందించటంలో జాప్యం చేస్తున్నది. ఇదే అదునుగా వ్యాపారులు రేటు పెంచి అమ్ముతున్నారు. 45 కిలోల యూరియా ఎరువు బస్తా సబ్సిడీ రేటు రూ.266.50 నుంచి రూ.268 వరకు ఉంది. దానికి రూ.300 నుంచి రూ.325 వరకు అమ్ముతున్నారు. ఎరువులు ఎక్కువ వాడితే దిగుబడి ఎక్కువ వస్తుందనే దురభిప్రాయంతో రైతాంగం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వాలు రైతులకు అవగాహన కల్పించాలి.

అడుగడుగునా రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎరువులకిస్తున్న సబ్సిడీ రూ.1350 భారం తగ్గించుకోవాలనే ఉద్దేశ్యంతో ఉంది. ఎరువుల జాప్యానికి ఇది కూడా ఓ కారణం. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగాన్ని కలుపుకొని కేంద్ర ప్రభుత్వ రైతు విధానాలను వ్యతిరేకిస్తూ, ఎరువులు నెలవారీ కోటా ప్రకారం రాష్ట్రానికి అందేలా పోరాడాలి. ఆ ఎరువులను రైతులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి.

– కెచ్చెల రంగారెడ్డి
అఖిల భారత ఐక్య రైతు సంఘం (AIKUS) రాష్ట్ర అధ్యక్షులు

'భారతీయ భాషలన్నీ జాతీయ భాషలే'

దేశంలో భాషా వివాదాలు తీవ్రమవుతున్న తరుణంలో ఆరెస్సెస్ అధికార ప్రతినిధి సునీల్ అంబేకర్ 'భారతీయ భాషలన్నీ జాతీయ భాషలే' అంటూ ఇటీవల ఓ ప్రకటన చేశారు. ఇది కేవలం ప్రకటన మాత్రమే కాదు.. దేశంలోని ప్రతి భాషకూ సమాన ప్రాధాన్యం ఉందని, ప్రాంతీయ భాషలంటూ లేవని ఆరెస్సెస్ స్పష్టం చేసింది. ఇది భాషా ఐక్యతకు సంబంధించిన చర్చలకు కొత్త, ఆశాజనకమైన కోణాన్ని అందించింది.

భారతదేశం భిన్న భాషలకు నెలవు. ప్రజల సంస్కృతికి, గుర్తింపునకు భాష ప్రతీక. పౌరుల్లో దేశ సమగ్రతను, ఐక్యతను పెంపొందించాలంటే భాషా వైవిధ్యాన్ని గౌరవించడం, అన్ని భాషలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షిస్తూ, అన్ని భాషలనూ ఆదరించడం ద్వారానే భారతదేశం ఒక బలమైన దేశంగా ముందుకు సాగుతుంది. కానీ దేశంలో కొంతకాలంగా హిందీని జాతీయ భాషగా రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై ప్రజల నుంచి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వం అధికారిక కమ్యూనికేషన్లలో, విద్యా విధానాల్లో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడానికి చేస్తున్న ప్రయత్నాలు మరోసారి వివాదానికి దారితీశాయి. ఉదాహరణకు.. మహారాష్ట్రలోని ప్రాథమిక పాఠశాలల్లో హిందీని మూడో భాషగా తప్పనిసరి చేయాలంటూ ప్రభుత్వం సర్క్యులర్‌ను జారీ చేసింది. కానీ శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), మహారాష్ట్ర నవనిర్మాణ సేన వంటి పార్టీలు దీన్ని వ్యతిరేకించడంతో ఆ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా దక్షిణాదిపై హిందీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఆయా రాష్ట్రాలను ఏకం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. సినీ నటులు అజయ్ దేవగన్, కిచ్చా సుదీప్ మధ్య ఇటీవల ట్విట్టర్‌లో జరిగిన వాగ్వివాదం.. వంటి ఘటనలు కూడా ఈ భాషా వివాదానికి జాతీయ స్థాయిలో రాజకీయ రంగులు పులిమాయి.

ఈ నేపథ్యంలో ఆరెస్సెస్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. వీరి ప్రకటనలో మరో కీలకమైన అంశం 'విద్యను మాతృభాషలోనే బోధించాలి' అనే సిఫార్సు. ఈ అంశం వెనుక శాస్త్రీయ, విద్యాపరమైన కారణాలు ఉన్నాయి. బోధన, అభ్యసన మాతృభాషలో జరిగినప్పుడే పిల్లలు ఆయా విషయాలను సులభంగా అర్థం చేసుకుంటారు. తద్వారా వారిలో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన మెరుగుపడుతుంది. అలా కాకుండా చిన్నతనం నుంచే ఇతర భాషలను పిల్లలపై బలవంతంగా రుద్దడం వల్ల వారిపై అనవసరమైన మానసిక భారం పడుతుందని, ఇది వారి ఆలోచనా సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని భాషా శాస్త్రజ్ఞులు, విద్యావేత్తలు చెబుతున్నారు.

1956లో భాషా ప్రాతిపదికనే రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఇది ప్రజలకు స్వభాషలో పరిపాలనను అందించి, వారి సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించడానికి దోహదపడింది. ఈ విషయాన్ని కేంద్రం గుర్తించాలి. ప్రస్తుత ఆరెస్సెస్ ప్రకటనను ఆచరణలో పెట్టి, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సహకార స్ఫూర్తితో భాషా వైవిధ్యాన్ని రక్షించి, ప్రోత్సహించినప్పుడే దేశంలో భాషా సామరస్యం సుస్థిరమవుతుంది. ఇది దేశ సమైక్యతకు, అభివృద్ధికి బలమైన పునాది.

– డా. రావుల కృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, హెచ్‌సీయూ

తాత్కాలిక జీవోలతో బీసీలు మోసపోవద్దు!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ప్రతిపాదన – పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ '285ఎ'ను సవరించి, స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడం. ఇది ఒకవైపు రాజకీయంగా గర్వపడే ప్రకటనలా కనిపిస్తున్నప్పటికీ, దీని వెనక ఉన్న చరిత్రను, న్యాయపరమైన పరిమితులను, కోర్టు తీర్పులను, గత అనుభవాల్ని బీసీ ప్రజలు, ప్రజాస్వామికవేత్తలు గమనించాల్సిన అవసరం ఉన్నది.

2018లో తెరపైకి వచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టంలో సెక్షన్ '285ఎ' అనే విభాగం అసలు లేనే లేదు. ఆ సంవత్సరం ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.396 ద్వారా బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించగా, హైకోర్టు విచారణ అనంతరం ఈ జీవోను రద్దు చేసింది. కారణం– మొత్తం రిజర్వేషన్లు 50శాతం సీలింగ్‌ను మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు (కృష్ణమూర్తి కేసు, 2010). దీంతో ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసినా, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తర్వాత అప్పీల్‌ను వెనక్కి తీసుకుంది. ఆ పరిస్థితుల్లో బీసీలకు 23శాతం రిజర్వేషన్‌తో ఎన్నికలు నిర్వహించేందుకు ఆర్డినెన్స్ 2/2018ను తీసుకొచ్చింది. కానీ ఆ ఆర్డినెన్సుకు కాలపరిమితి ఆరు నెలలు మాత్రమే. కాబట్టి, ఆర్డినెన్సును శాశ్వతంగా చట్టంగా మార్చే ఉద్దేశంతో యాక్ట్ నెం.4/2019 ద్వారా పంచాయతీరాజ్ చట్టంలో సెక్షన్ '285ఎ'ను చేర్చారు. ఇప్పుడు ప్రభుత్వం మళ్లీ అదే సెక్షన్‌ను తొలగించి 42శాతం బీసీ రిజర్వేషన్‌ను జీవో ద్వారా అమలుపరచాలన్న నిర్ణయానికి వచ్చింది. అయితే ఇది సాంకేతికంగా సాధ్యమైనప్పటికీ న్యాయపరంగా నిలవదని గత అనుభవాలూ, న్యాయ పరిధిలోని నిపుణుల అభిప్రాయాలూ స్పష్టం చేస్తున్నాయి.

పంచాయతీరాజ్, మున్సిపల్ సంస్థలకు 73, 74 సవరణ ద్వారా 1992లో రాజ్యాంగ హోదా కల్పించారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 243డి, 243టి చేర్చారు. మొదటిసారిగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించారు. ఎస్సీ, ఎస్టీలకు ఆర్టికల్ 243డి 1, టీ 1 కింద జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించారు. కానీ బీసీలకు ఆర్టికల్ 243డి 6, టీ 6 ప్రకారం రాష్ట్రాలు రిజర్వేషన్ ఇచ్చుకోవచ్చు అని చెప్పి వదిలి వేశారు. అందువల్ల సుప్రీంకోర్టు 2010లో 50శాతం సీలింగ్‌ను విధించింది. మొత్తం రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిపి) 50 శాతాన్ని మించకూడదు అని సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా ఉన్నాయి. ఎస్సీ ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ ఇవ్వగా 50శాతంలో మిగిలిన శాతాన్ని బీసీలకు ఇవ్వాలి.

డెడికేటెడ్ కమిషన్ పెట్టాం, కులగణన చేశాం, బీసీల రాజకీయ వెనుకబాటుతనంపై ఎంపిరికల్ డాటా సేకరించాం– కాబట్టి రిజర్వేషన్లు పెంచితే న్యాయస్థానాలు తప్పు పట్టవని, జీవో ఇస్తే సరిపోతుందని కొందరు వాదిస్తున్నారు. ఈ విషయంలో బిహార్ అనుభవాన్ని గుర్తు చేసుకోవాలి. బిహార్లో నితీష్ కుమార్ గవర్నమెంట్ కూడా 2023లో కులగణన చేసి ఆ రిపోర్టును, కులాలవారీగా జనాభాను పబ్లిష్ చేసి రిజర్వేషన్లు 65శాతానికి పెంచింది. కానీ 50శాతం సీలింగ్ దాటిందనే ఉద్దేశంతో హైకోర్టు ఆ జీవోను కొట్టివేసింది. మళ్లీ మనం అదే ప్రయత్నం తిరిగి చేయడం వృథా ప్రయాస తప్ప మరోటి కాదు. రాజకీయ ప్రయోజనం కోసం ఆర్డినెన్సుల/ జీవోల ఆట ఇది తొలిసారి కాదు. ప్రతి స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా ఆర్డినెన్సు/ జీవో జారీ చేస్తోంది. తర్వాత అది కోర్టులో రద్దవుతోంది. ప్రజల్లో బీసీల హక్కుల కోసం కృషి చేస్తున్నట్టు చూపించేందుకు దీన్ని వినియోగిస్తున్నారు. ఇది ఓటు బ్యాంక్ రాజకీయాలకు నిదర్శనం.

నిజంగా సెక్షన్ '285ఎ'ను సవరించి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించినా, అది కేవలం జీవో జారీకి సహాయపడే ఉపాయంగా ఉపయోగపడుతుంది. కానీ కోర్టుల న్యాయ సమీక్షలో మళ్లీ రద్దయ్యే అవకాశాలే ఎక్కువ. ఇందుకు చట్టపరమైన రక్షణ అవసరం. వాస్తవానికి బీసీలకు న్యాయంగా 42శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే చట్టం చేసి భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చటం ముఖ్యం.



నిజంగా సెక్షన్ '285ఎ'ను సవరించి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించినా, అది కేవలం జీవో జారీకి సహాయపడే ఉపాయంగా ఉపయోగపడుతుంది. కానీ కోర్టుల న్యాయ సమీక్షలో మళ్లీ రద్దయ్యే అవకాశాలే ఎక్కువ. ఇందుకు చట్టపరమైన రక్షణ అవసరం. వాస్తవానికి బీసీలకు న్యాయంగా 42శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే చట్టం చేసి భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చటం ముఖ్యం. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ ఒక బిల్లును, స్థానిక సంస్థల్లో 42శాతం పెంచుతూ ఇంకో బిల్లును గవర్నర్ ఆమోదంతో కేంద్రానికి పంపింది. తక్షణం ముఖ్యమంత్రి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానమంత్రిని కలిసి ఈ బిల్లులను ఇప్పుడు ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాలలో పాస్ అయ్యేలాగా కృషి చేయాలి. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో ఆ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్పిస్తే ఈ సమస్యకు శాశ్వతంగా ఒక పరిష్కారం లభిస్తుంది.

ఇందుకు తమిళనాడు ప్రభుత్వ ఉదాహరణ మన ముందు ఉన్నది. తమిళనాడులో విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 69శాతం రిజర్వేషన్లను 1994లో 9వ షెడ్యూల్‌లో చేర్చింది. తెలంగాణ కూడా అదే మార్గాన్ని అనుసరించాలి. పార్లమెంటులో చర్చించి, రాష్ట్రపతి ఆమోదంతో చట్టాన్ని చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలి. ఇది కేవలం పంచాయతీరాజ్ చట్టానికే కాదు, అన్ని విద్యా ఉద్యోగాలకు కూడా వర్తించే శాశ్వత పరిష్కారం అవుతుంది.

9వ షెడ్యూల్లో పెట్టిన చట్టాలను కూడా న్యాయ సమీక్ష చేసే అధికారం మాకు ఉందని 2007లో సుప్రీంకోర్టు ఐఆర్ కోయెల్హో కేసులో అభిప్రాయపడింది. కేశవానంద భారతి కేసు అనగా 1973 నుంచి 9వ షెడ్యూల్లో చేర్చిన ఏ చట్టం అయినా అది రాజ్యాంగం మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా ఉంటే సమీక్షించే అధికారం తమకు గలదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అదే విధంగా జనహిత వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో (2022) ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కేసులో సుప్రీంకోర్టు రిజర్వేషన్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకం కావు అని అభిప్రాయపడింది. కాబట్టి 9వ షెడ్యూల్లో చేర్చితే న్యాయ సమీక్ష చేసినా తప్పించుకోగలం. అదే విధంగా 9 షెడ్యూల్లో ఇప్పటివరకు సుమారు 284 చట్టాలు చేర్చారు. ఏ ఒక్క చట్టాన్ని కూడా సుప్రీంకోర్టు ఇప్పటివరకు రద్దు చేయలేదు. కావున తొమ్మిదో షెడ్యూల్లో చేర్చడమే మనకు రక్షణ.

జీవో జారీ చేసి తక్షణమే ఎలక్షన్ నోటిఫికేషన్‌కు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఒక్కసారి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినట్లయితే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవు అనే వాదన కూడా తెరపైకి తీసుకొచ్చారు. కానీ ఇది వాస్తవం కాదు. మహారాష్ట్రలో 2018, 2020లో జరిగిన ఎన్నికల్ని 2021లో సుప్రీంకోర్టు 'వికాస్ కిషన్‌రావు గవాలి కేసు' కారరణంగా ఐదు జిల్లాలలో కొట్టివేయడమే కాకుండా డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్ లేదనే ఉద్దేశంతో బీసీలకు రిజర్వేషన్ కూడా ఇవ్వకుండా మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

ఈ నేపథ్యంలో బీసీ ప్రజలు మళ్లీ మోసపోకూడదు. తాత్కాలిక జీవోలు, ఆర్డినెన్సుల మీద ఆశలు పెట్టుకోవద్దు. రాజకీయాల కోసం బీసీల హక్కులను కాలరాసే ప్రయత్నాలను గమనించాలి. బీసీ హక్కులు, న్యాయబద్ధ రిజర్వేషన్ల కోసం ఊహలపై కాదు; రాజ్యాంగ పరిధిలో పోరాటం చేయాలి.

• టి. చిరంజీవులు
ఐఏఎస్ (రిటైర్డ్)
చైర్మన్, బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం



జయేష్ రంజన్‌కు వినతిపత్రం ఇస్తున్న కడియం, నాయిని, నాగరాజు

స్పోర్ట్స్ స్కూల్, క్రికెట్ స్టేడియం
ఏర్పాటు చేయండి

స్పోర్ట్స్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీకి ఎమ్మెల్యేల వినతి

హనుమకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు కోరారు. బుధవారం ఎమ్మెల్యేలు హైదరాబాద్ టూరిజం ప్లాజాలో తెలంగాణ స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జేయేష్ రంజన్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని సమర్పించారు. ఉమ్మడి జిల్లాలో స్పోర్ట్స్ స్కూల్, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటు ఆవశ్యకతను ఎమ్మెల్యేలు వివరించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ధర్మసాగర్ మండలం ఉనికిచెర్ల వద్ద జాతీయ రహదారి 163కు ఆనుకొని 20 ఎకరాల ప్రభుత్వ స్థలంలో స్పోర్ట్స్ పాఠశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆగస్టు 15న స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభించేందుకు తాత్కాలిక భవనాన్ని, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన స్పెషల్ చీఫ్ సెక్రెటరీ.. స్కూల్ ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఉప్పొంగుతున్న బొగత




భారీ వర్షాలకు ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉప్పొంగుతోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఏకధాటిగా కురుస్తున్న భారీవర్షానికి వరద నీరు పోటెత్తుతోంది. కొండలు, గుట్టల నుంచి ఒక్కసారిగా నీటి ఉధృతి పెరగడంతో జలధారలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. బుధవారం ఉదయం 10.30 గంటల వరకు మామూలుగా ఉన్న జలపాతం 11 గంటల తర్వాత హోరెత్తింది. దీంతో చుట్టూ ఉన్న రక్షణ కంచె, ట్రీహౌస్, మరుగుదొడ్లు మునిగిపోయాయి. దీంతో జలపాతం సందర్శనను అటవీ శాఖ అధికారులు నిలిపివేశారు.
- వాజేడు (ఆంధ్రజ్యోతి)

వెల్లువెత్తిన 'మహాలక్ష్మి' సంబరం



రాష్ట్రవ్యాప్తంగా 200కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసిన సందర్భంగా బుధవారం సాయంత్రం వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో సంబరాలు జరుపుకున్నారు. హనుమకొండ డిపో మేనేజర్ ధరమ్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సంబరాల్లో రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కేక్ కట్ చేసి మహిళలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండా సుధారాణి, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు పాల్గొన్నారు.
- గిర్మాజీపేట (ఆంధ్రజ్యోతి)

7



విచారణ ఏమాయే..
నివేదిక ఏమాయే..?!

కేయూలో అవినీతి, అక్రమాలపై చర్యలేవి?

- మాజీ వీసీ రమేష్‌పై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ
- మాజీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అర్హతలపై ఎంక్వైరీ అటకెక్కినట్టేనా?
- నిబంధనలు పాటించలేదని మాజీ వీసీ వెంకటరత్నంపై ఆరా
- ఏళ్లు గడుస్తున్నా నివేదికలు ఏమయ్యాయో తెలియని వైనం
- వెంటనే బహిర్గతం చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన అటకెక్కింది. యూనివర్సిటీ భూముల అక్రమణలు, నిధులు దుర్వినియోగం, అక్రమ నియామకాలపై వేసిన విచారణ కమిటీల నివేదికలు మాయమయ్యాయి. మాజీ వీసీలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టిన విచారణ ఏమైందో తెలియడం లేదు. మాజీ వీసీ రమేష్ హయాంలో వచ్చిన అనేక అక్రమాలు, అవినీతిపై ఆరోపణలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టినప్పటికీ, వాటి నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే విద్యార్హతలపై గత రిజిస్ట్రార్‌పై విచారణకు జారీచేసిన ఆదేశాలు ఎటు వెళ్లాయనేది ప్రశ్నార్థకంగా మారాయి. గత వీసీ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై దృష్టి సారిస్తూనే.. నేటితరానికి ఉపాధి అవకాశాలు కల్పించే కొత్త కోర్సులను యూనివర్సిటీ పరిధిలో ఏర్పాటు చేసేలా అధికారులు దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

విజిలెన్స్ విచారణ అటకెక్కినట్టేనా..?

కాకతీయ యూనివర్సిటీ భూముల అక్రమణలతో పాటు అధ్యాపకుల నియామకాల్లో అక్రమాలు, అవినీతిపై వేసిన విజిలెన్స్ విచారణలు మౌనం రాగం ఆలపిస్తున్నాయి. మే 2021లో కేయూ వైస్‌చాన్స్‌లర్‌గా తాటికొండ రమేష్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పలు వివాదాలు చుట్టుముట్టాయి. ప్రధానంగా నిబంధనలకు విరుద్ధంగా సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారనే ఆరోపణలు వచ్చాయి. తన హయాంలో ఎలాంటి అనుమతులు లేకుండా 16మందిని అనుబంధ అధ్యాపకులుగా నియమించటంపై వివాదం ఏర్పడింది. వీటితో పాటు కేయూ పరిధిలో మొత్తం 24పార్మసీ కాలేజీలు ఉన్నాయి. అయితే 2023-24 విద్యాసంవత్సరంలో 12 కాలేజీలు డీఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు కోరుతూ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకోగా, వీటిలో ఆరు ఫార్మసీ కాలేజీలకు మాత్రమే అర్హత ఉండగా, మిగతా ఆరు కాలేజీలకు ఎలాంటి అనుబంధ వైద్యశాలలు లేకపోయినప్పటికీ యూనివర్సిటీ అనుమతులు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. న్యాక్ గ్రేడింగ్ సమయంలో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు చేసే విషయంలో అధికారులు కక్కుర్తిపడ్డారనే ఆరోపణలు వచ్చాయి. వీటితో పాటు యూనివర్సిటీ భూములు 12 ఎకరాల వరకు కబ్జాకు గురైనట్లుగా గుర్తించారు. కబ్జాకోరులను వీసీ రక్షిస్తున్నారనే ఆరోపణలను ఎదుర్కొన్నారు. అలాగే పీహెచ్‌డీ సీట్లు, కేయూలో సీడ్‌మనీ పేరుతో నకిలీ పరిశోధన ప్రాజెక్టులతో రూ.20లక్షలకు పైగా నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపించాయి. ఆరుగురు ప్రొఫెసర్లతో కలిసి సీడ్‌మనీ పేరుతో జరిగిన ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని అప్పట్లో అకుట్ ఆందోళన చేపట్టింది. వీటన్నింటిపై సీఎం రేవంత్‌రెడ్డికి అకుట్ బృందం పిర్యాదులు చేసింది. దీంతో ప్రభుత్వం అప్పటి వీసీ రమేష్‌పై 2024 మే 18వ తేదీన విచారణకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. మే 21న కేయూ వైస్ చాన్స్‌లర్‌గా రమేశ్ పదవీ విరమణ చేయనుండగా, ప్రభుత్వం మే 18వ తేదీనే రమేష్‌పై కేయూలో జరిగిన పలు అక్రమాలు, అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయటం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేగింది. విజిలెన్స్ అధికారులు సైతం రంగంలోకి దిగారు. మాజీ వీసీపై వచ్చిన ఆరోపణలపై క్షుణ్ణంగా పరిశీలన చేశారు. కేయూ భూముల అక్రమణలతో పాటు వివిధ ఆరోపణలపై విచారణ చేసిన విజిలెన్స్ అధికారులు.. నివేదికలను ప్రభుత్వానికి పంపించినట్లుగా సమచారం. అయితే ఏడాది గడిచినప్పటికీ ఇప్పటి వరకు విజిలెన్స్ విచారణలో ఏం తేలిందో.. మాజీ వీసీపై వచ్చిన ఆరోపణలు వాస్తవమా..? కాదా..? అనేది చర్చనీయాంశంగా మారింది. వాస్తవమైతే చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని.. కాకపోతే పదవిలో ఉన్న మూడేళ్లు అనవసరమైన ఆరోపణలతో రమేష్‌ను మానసికంగా ఇబ్బందికి గురి చేశారా..? అనేది కూడా తెలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. విచారణ పూర్తయినప్పటికీ చర్యలకు తాత్సారం వెనుక ఉన్న మతలబు ఏమిటనేది చర్చనీయాంశంగా మారింది.

జాడలేని నివేదికలు

మాజీ వీసీ వెంకటరత్నంపై కూడా విజిలెన్స్ విచారణ చేపట్టింది. 2013-15లో కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌గా పని చేసిన వెంకటరత్నంపై ప్రభుత్వం 2024 ఆగస్టు 12 విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయటం అప్పట్లో కేయూలో కలకలం రేగింది. ఆగస్టు 16వ తేదీన వరంగల్ విజిలెన్స్ అధికారులు మాజీ వీసీ వెంకటరత్నంను విచారించారు. 2013లో ప్రొఫెసర్ వెంకటరత్నం ప్రభుత్వం అనుమతి లేకుండా కాకతీయ యూనివర్సిటీలో కనీస కాలపరిమితి కలిగిన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయటంపై విచారణ జరిగింది. పదేళ్ల కిందట రెగ్యులరైజ్ చేసిన సంఘటనకు సంబంధించి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయటం అప్పట్లో కేయూలో కలకలం సృష్టించింది. దీనికి సంబంధించిన విచారణ పూర్తయినప్పటికీ విజిలెన్స్ అధికారులు ఎలాంటి నివేదికలు ప్రభుత్వానికి ఇచ్చారనే చర్చ జరుగుతోంది. అలాగే మరోవైపు కేయూ మాజీ రిజిస్ట్రార్ మల్లారెడ్డిపై ప్రభుత్వం విచారణకు ఆదేశాలు జారీ చేసింది. హనుమకొండకు చెందిన కేఎస్ రెడ్డి అనే వ్యక్తి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ అధికారికి ప్రొఫెసర్ మల్లారెడ్డి నియామకంపై పిర్యాదులు వెళ్లాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అనుభవం, అర్హతలు లేకుండానే అసోసియేట్ ప్రొఫెసర్‌గా కేయూ నియమించిందని, అప్పటి అధికారులు నిబంధనలను ఉల్లంఘించి పదోన్నతి కల్పించారని ఆరోపించారు. రిజిస్ట్రార్‌గా మల్లారెడ్డికి ఎలాంటి టీచింగ్ అనుభవం, అర్హతలు లేవని, దీనిపై విచారణ జరిపించి చర్యలు (మిగతా 8వ పేజీలో)

అక్రమాలపై పాలకమండలి, వీసీ దృష్టి సారించాలి..

కాకతీయ యూనివర్సిటీలో జరిగిన అక్రమాలు, అవినీతి తదితర వాటిపై కొత్తగా కొలువుతీరిన పాలక మండలితో పాటు నూతన వైస్ చాన్స్‌లర్ దృష్టి పెట్టాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు. ప్రధానంగా కేయూ భూముల కబ్జాలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. అక్రమార్కులకు అవకాశం ఇవ్వకుండా కఠినంగా వ్యవహరించాలని విద్యార్థులు కోరుతున్నారు. వీటితోపాటు ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఫీజుల పేరుతో సుమారు రూ.5కోట్లు స్వాహా చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ద్విసభ్య కమిటీ వేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తీసుకరావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మెస్ బిల్లుల పేరుతో యూనివర్సిటీలో రూ.2.50కోట్ల స్కామ్ జరిగినట్లుగా ప్రచారం జరిగింది. దీనిపై పిర్యాదులు వచ్చినా గత వీసీ పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ల, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి.

ఎంజీఎం ఆర్‌ఎంవో-2గా
వసంతరావు



వరంగల్ మెడికల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్‌ఎంవో-2గా డాక్టర్ ముదిళి వసంతరావు బుధవారం విధుల్లో చేరారు. సిరిసిల్ల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన ఎం.వసంతరావును ఎంజీఎంకు నియమించారు. బుధవారం ఆయన విధుల్లో చేరారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, శ్రీకాకుళం టెక్కలి ప్రాంతానికి చెందిన వసంతరావు.. తెలంగాణ ఐఎంఏ యాక్షన్ కమిటీ సభ్యుడిగా కూడా కొనసాగుతున్నారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో వసంతరావు విధులు నిర్వర్తించారు.

శ్రీకరం.. శుభకరం..

- రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- నెల రోజుల పాటు దేవాలయాల్లో సందడి
- ఆలయాల్లో సామూహికంగా వరలక్ష్మి వ్రతాలు

7





హనుమకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు

విద్యాసంస్థల బంద్ సక్సెస్

- హనుమకొండలో బైక్ ర్యాలీ, ఆందోళన
- పాల్గొన్న వామపక్ష విద్యార్థి నాయకులు

కేయూ క్యాంపస్ జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాల నేతృత్వంలో జరిగిన పాఠశాల, జూనియర్ కళాశాల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్‌లతోపాటు ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అశోకా జంక్షన్ వద్ద బైఠాయించి నిరసన ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలను పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని నిర్ల క్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.8వేల కోట్ల (మిగతా 8వ పేజీలో)

హసన్‌పర్తిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- పీహెచ్‌సీ, కేజీబీవీ, తహసీల్దార్ కార్యాలయాల తనిఖీ
- రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న శబరీష్
- కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం

హసన్‌పర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం హసన్‌పర్తిలో సుడిగాలి పర్యటన చేసి పలు కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి సిబ్బందిని, రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి సకాలంలో రోగులకు ఎటువంటి వైద్య సేవలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని రికార్డులను, మెడికల్ స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వ్యాధుల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భూ భారతి చట్టం అమలు తీరును తహసీల్దార్ చల్ల ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రైతులకు సిబ్బంది ద్వారా అందుతున్న సేవలను, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భీమారం కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల కళాశాల, విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు సకాలంలో విద్యా బోధన, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులో ఉన్న నిల్వలను పరిశీలించారు. హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యను అందించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కలెక్టర్ స్నేహ శబరీష్ వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, జిల్లా విద్యా శాఖ అధికారి వాసంతి, మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రాంభార్గవ్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.డి.రహీమ్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్, వైద్య, రెవెన్యూ, అధ్యాపక సిబ్బంది, పాల్గొన్నారు.



కేజీబీవీలో విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ స్నేహ శబరీష్



రఘునాథపల్లిలోఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న కలెక్టర్

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

రఘునాథపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు సరిపోయే యూరియా నిల్వలు ఉన్నాయని, అనవసరంగా ఫర్టిలైజర్ షాపుల యాజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో రిజిస్టర్లు పరిశీలించారు. క్లాస్‌రూంలకు వెళ్లి విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడారు. అలాగే మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. తాజా కూరగాయలు, శుభ్రమైన నీటితోనే వంట చేయాలని సూచించారు. అనంతరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, డీఏవో రామారావు నాయక్, ఏవో కె.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ఫణి కిషోర్, ఎంపీడీవో శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సరిత మృతి పార్టీకి తీరని లోటు

మాజీ మంత్రి హరీష్‌రావు



సరిత చిత్రపటం వద్ద సంతాపం తెలుపుతున్న హరీష్‌రావు

వేలేరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాజీ జడ్పీటీసీ చాడ సరిత (48) మృతి పార్టీకి తీరనిలోటని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. బుధవారం వేలేరు మండలం మల్లికుదుర్లలో సరిత దశదిన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆయన విచ్చేసి సరిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జడ్పీటీసీగా మండలానికి, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని కొనియాడారు. చిన్న వయస్సులో సరిత చనిపోవడం బాధా కరమన్నారు. సరిత కుటుంబాన్ని అన్ని విధాలుగా అందుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ రాజయ్య, వినయ్‌భాస్కర్, ధర్మారెడ్డి, శంకర్ నాయక్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ సుధీర్ కుమార్, రాకేష్‌రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 1 నుంచి ఆధార్ బేస్డ్ అటెండెన్స్

వరంగల్ మెడికల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలోని అన్ని విభాగాల్లో ఆగస్టు 1వ తేదీ నుంచి ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌ను అమలు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ ప్రభుత్వ మెమో నెంబరు 1807/ఎఫ్/2025ని విడుదల చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్, వైద్య విద్య సంచాలకుడు, ప్రజారోగ్య సంచాలకుడు, ఆయూష్ విభాగంలోని అన్ని ఆస్పత్రులలో ఆగస్టు 1 నుంచి అమలు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు విభాగాల అధిపతులు తగిన చర్యలు తీసుకోనున్నారు.

పంటలను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

ధర్మసాగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలను కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియ శ్రీహరి అన్నారు. బుధవారం ధర్మసాగర్ రిజర్వార్ దక్షిణ కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీటిని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి దక్షిణ, ఉత్తర కెనాల్‌కు సాగునీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సాగునీటిని విడుదల చేశామన్నారు. దక్షిణ కెనాల్ కింద 12 డిస్ట్రిబ్యూటరీల ద్వారా ఒక లక్ష ఆరువేల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. ఈ కెనాల్ ద్వారా ధర్మసాగర్, ఐనవోలు, జఫర్‌గఢ్, హసన్‌పర్తి మండలాలకు సాగునీరు అందుతుందన్నారు. రైతులు నారు పోసుకొని వర్షాల కోసం ఎదురుచూస్తున్న క్రమంలో నాట్లు వేసుకునేలా గోదావరి నదీజలాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఆన్, ఆఫ్ పద్ధతి ద్వారా పది రోజులు నీటిని విడుదల చేసి, మరో పది రోజులు నీటిని ఆపనున్నట్లు ఆయన తెలిపారు. ఐనవోలు, జఫర్‌గఢ్ మండలాల చివరి గ్రామాలకు కూడా సాగునీరు అందే విధంగా నీటిని విడుదల చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నీటి దుర్వినియోగం చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులకు కడియం సూచించారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. అనునిత్యం రైతుల కోసం, రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పరితపిస్తోందన్నారు. నీటి విడుదల కోసం ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి అనుమతిని తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే దేవాదుల ప్రాజెక్ట్‌ను నిర్మించామని అన్నారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు అవాకులు చెవాకులు పేలుతూ రైతుల పట్ల కపట ప్రేమను చూపిస్తున్నారని,వారి మాటలను నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, మార్కెట్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రసాద్, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, రమేష్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ యాదకుమారస్వామి, రాజు, పెద్ది శ్రీనివాస్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ రిజర్వాయర్ దక్షణ కాలువకు సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నాగరాజు

బిల్లులు చెల్లించని సర్వీసులపై దృష్టి సారించాలి

సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

రాంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు చెల్లించని సర్వీసులపై నోడల్ జీఎంలు దృష్టి సారించి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో డైరెక్టర్లు, సీఈలు, నోడల్ జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. కాలిపోయిన, పనిచేయని మీటర్లను వెంటనే మార్చాలన్నారు. హెచ్‌టీ సర్వీసులను తనిఖీ చేయాలన్నారు. రెండేళ్లపైబడిన వర్క్ ఆర్డర్స్ పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ సర్వీసులు పెండింగ్ లేకుండా రిలీజ్ వేగవంతం చేయాలన్నారు. కొత్త సబ్‌స్టేషన్ పనులను విధిగా తనిఖీలు చేయాలని క్వాలిటీ కంట్రోల్ వింగ్‌ను ఆదేశించారు. రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ పనులు, ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్ పనుల పురోగతిపై ఆరా తీస్తూ వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. భారీవర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి అంతరాయాలు ఏర్పడిన వెంటనే పునరుద్ధరణ చేసేలా మెన్, మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. 16 సర్కిళ్ల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్‌కు కొత్త ఎస్పీఎం షెడ్లను ఏర్పాటు చేశామని, ఇక నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. సమావేశంలో డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, మధుసూదన్, మోహన్‌రావు, ప్రభాకర్, సీఈలు సదర్‌లాల్, అశోక్‌కుమార్, తిరుమల్‌రావు, రాజుచౌహాన్, అశోక్, రవీంద్రనాథ్, ఆర్.చరణ్‌దాసు, వెంకటరమణ, మాధవరావు, జాయింట్ సెక్రటరీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

మహిళల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

మహాలక్ష్మి సంబరాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క



ములుగు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పక్షపాతి అని, అందుకే వారి అభ్యున్నతికి అనేక పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో మహాలక్ష్మి సంబరాలు నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసిందన్నారు. మహిళలు ఇప్పటి వరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని, దీంతో వారికి రూ.6,700 కోట్లు ఆదా అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, ఆర్ఎం విజయభాస్కర్ తదితరులు పాలల్గొన్నారు.

రూ.9 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఒడిషా రాష్ట్రానికి చెందిన ఇద్దరి అరెస్టు



నిందితులను చూపిస్తున్న వరంగల్ ఏసీపీ శుభం, సీఐ షూకూర్

వరంగల్ టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఇంతేజార్‌గంజ్ పోలీసులు భారీ స్థాయిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ శుభం, సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రంలోని గజపతి జిల్లా కట్టంగుమా గ్రామానికి చెందిన జులియం బెహరా(60), జులియం కుమారి బెహరా(55) అనే దంపతులు సుమారు 18 కిలోల ఎండు గంజాయిని తీసుకొని సోలాపూర్‌కు వెళ్లేందుకు టికెట్ లేకుండా రైలెక్కారు. వరంగల్ రైల్వేస్టేషన్ వద్దకు రాగానే టీటీ రావడంతో రైలు దిగారు. తిరిగి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో వెళదామని నిర్ణయించుకున్నారు. దానికి సమయం ఉండటంతో స్టేషన్ బయటికి వచ్చారు. అదేసమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి పరుగెత్తుతుండగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.9లక్షల విలువ గల 18 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐలు వెంకటేశ్వర్లు, తేజ, ఏఎస్ఐ భిక్షపతి, సిబ్బందిని ఏసీపీ శుభం, సీఐ షూకూర్ అభినందించారు.

ఏజెన్సీకి ఆర్టీసీ బస్సు పునప్రారంభం..

బయ్యారం(మహబూబాబాద్ జిల్లా), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం ఏజెన్సీ ప్రాంతానికి ఆర్టీసీ బస్సు సర్వీస్ పునప్రారంభమైంది. గతంలో కొంత కాలం పాటు మహబూబాబాద్ బయ్యారం రామగుండాల మీదిగా ఇల్లెందు పట్టణానికి బస్సు సర్వీస్ నడిపారు. అనంతరం ఏమైందో ఏమో తెలియదు కాని సర్వీసును రద్దు చేసిన ఆర్టీసీ తిరిగి బుధవారం పునప్రారంభించింది. దీంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మత్తడి పోస్తున్న పెద్ద చెరువు అలుగు



మత్తడి పోస్తున్న పెద్ద చెరువు అలుగు

బయ్యారం (మహబూబాబాద్ జిల్లా), జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకే తలమానికమైన కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు అలుగు మత్తడి పోస్తుంది. బుధవారం నాటికి 16.2 అడుగుల పూర్తి సామర్థ్యంతో చెరువు నిండటంతో మత్తడి దుంకుతుంది. వర్షం తగ్గుముకం పట్టకపోవడం, పందిపంపుల, మసివాగుల గుండా వరద ఉధృతి అధికంగా ఉండటంతో చెరువులోకి భారీగా నీరు వచ్చి చేరే అవకాశముంది. కాగా, చెరువు అలుగు పోస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ సాగు పనులు ముమ్మరం చేశారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

- బూరుగు గుంపులో ఘటన



నరేష్ (ఫైల్)

కొత్తగూడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు వాగులో గల్లంతయ్యాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బూరుగుగుంపులో బుధవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలుకు కొత్తగూడ మండలంలోని వాగులు పొంగుతున్నాయి. ఈ క్రమంలో బూరుగుగుంపు గ్రామానికి చెందిన ఆగబోయిన వెంకటయ్య-పుల్లక్క దంపతుల కుమారుడు నరేష్ (30) భూర్కపల్లి వాగులో చేపలు పట్టేందుకు తోపెనతో వెళ్లాడు. వాగులో చేపలు పడుతూ నీటిలో కొట్టుకుపోయాడు. నరేష్ కొట్టుకుపోతుండగా చూసిన ఓ వ్యక్తి గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసులకు, అధికారులకు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ తిరుపతిరావు, తహసీల్దారు రాజు, సీఐ సూర్యప్రకాష్, ఎంపీడీవో రోజారాణి, ఎస్సై రవికుమార్ వాగువద్దకు చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎస్పీ, రాజు మాట్లాడుతూ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నయీంనగర్‌లోని ఓ మాజీ ప్రజాప్రతినిధి నివాసంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. పరకాల కు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 54వ డివిజన్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి పరకాలకు చెందిన నలుగురు మాజీ ప్రజాప్రతినిధులు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు జరిపారు. ఇందులో పరకాలకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకొని రూ.17,070, నాలుగు సెల్‌ఫోన్ లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): 8 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25వేల జరిమానా చెల్లించాలని వరంగల్ జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం కం రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి న్యాయమూర్తి మనిషా శ్రావన్ ఉన్నమ్ బుధవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.7లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా గీసుగొండ మండలానికి చెందిన వివాహిత.. తన 8 ఏళ్ల కూతురితో కలిసి జీవిస్తోంది. 2021 జూన్ 28న సాయంత్రం 5 గంటలకు ఊరిలోని వాటర్ ప్లాంట్ వద్దకు పాపను పంపించింది. కొద్ది సేపటికే తన కూతురు వాటర్‌ప్లాంట్ వద్ద ఏడుస్తోందని చెప్పడంతో ఆమె అక్కడికి వెళ్లింది.

ఏమైందని విచారించగా అదే గ్రామానికి చెందిన పసునూరి ఐలయ్య (62)పాపను తీసుకొనిపోతుండగా తాము చూశామని, తర్వాత పాప ఏడుస్తూ వచ్చిందని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పాపను అడుగగా ఐలయ్య అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. దీంతో పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన గీసుగొండ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలుచేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి చనిపోయే వరకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ బొల్లం యుగంధర్ సాక్షులను ప్రవేశపెట్టగా లైజన్ అధికారిగా ఏఎస్ఐ కంతేటి హరికృష్ణ, భరోసా లీగల్ అడ్వయిజర్ సీహెచ్.నీరజ కేసులో సహకరించారు. దర్యాప్తు అధికారిగా అప్పటి ఏసీపీ ఎ.నరేష్‌కుమార్ వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందాదేవి గాయని కేసు వాదించారు.

భూ తగాదాల నేపథ్యంలో...

బావను హత్య చేసిన బావమరిది

గొర్రెలను కాసేందుకు వెళ్లిన బావను

ఇనుపరాడ్‌తో తలపై కొట్టి హత్య

కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో ఘటన



హత్యాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో హత్యకు గురైన ఉప్పలయ్య(ఫైల్)

కేసముద్రం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : భూ తగాదాల నేపథ్యంలో కక్ష పెంచుకొని బావను బావమరిది హత్య చేసిన ఘటన కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కంకల ఉప్పలయ్య(50) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. ఉప్పలయ్యకు ఇదే గ్రామానికి చెందిన ఆయన బావమరిది కొనగొండ్ల మల్లేషంతో కొద్దిరోజులుగా భూమికి సంబంధించిన వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో గ్రామంలోని మసీదుకు సమీపంలో ఉప్పలయ్య తన గొర్రెలను కాస్తున్నాడు. ఆయనపై మల్లేషం ఇనుపరాడ్‌తో తలపై పలుమార్లు బలంగా కొట్టడంతో ఉప్పలయ్య అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. వెంటనే మల్లేషం అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లి ఉప్పలయ్య మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య ఘటన స్థలానికి చేరుకొని విచారణను సమీక్షించారు. మహబూబాబాద్ నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు. మృతునికి భార్య కోమల, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు రూరల్ సీఐ తెలిపారు. సొంత బావమరిదే బావను హత్య చేసిన ఘటన మండలంలో కలకలం రేపింది.

నల్లబెల్లం, పట్టిక స్వాధీనం

మహబూబాబాద్ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం పరిధిలోని శనిగపురం శివారు రాంసింగ్‌తండాలో బుధవారం ఓ ఇంట్లో ఉన్న నిల్వ ఉన్న నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. రాంసింగ్‌తండాకు చెందిన దారావత్ భీములు, బానోత్ రవీందర్ ఇద్దరు కలిసి గతకొద్ది రోజులుగా నల్లబెల్లం వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. బాబునాయక్‌తండాకు చెందిన భూక్య అరుణ్‌వద్ద నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం,50 కిలోల పటిక, 10 లీటర్ల గుడుంబాను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వాటి విలువ సుమారు రూ.1.69 లక్షలు ఉంటుందన్నారు.దాడుల్లో ఏఎస్సై వెంకన్న, కానిస్టేబుళ్లు హుస్సేన్, రాజు, బాలరాజు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2432	1521
పల్లికాయ (సూక)	4350	3450
పల్లికాయ (పచ్చిది)	5050	1575
కందులు	6232	3022
పెసళ్లు	7052	3022
పత్తి	7800	5300
పసుపు (కాడి)	10333	9534
పసుపు (గోల)	9788	8700
తేజ మిర్చి	11000	8500
తేజ ఏసీ	13100	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	12800	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

పారదర్శకంగా బొగ్గు విక్రయ విధానాలు

- కేంద్ర గనుల మంత్రి కిషన్ రెడ్డి
- లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కావ్య ప్రశ్నకు వివరణ



లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య

హనుమకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో బొగ్గు ఉత్పత్తులపై కేంద్రం అనుసరిస్తున్న విధానాన్ని లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. డాక్టర్ కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి వివరణ ఇచ్చారు. సింగరేణి బొగ్గుగనుల కంపెనీ లిమిటెడ్ బొగ్గు విక్రయ విధానాలను వివరించారు. సంస్థ అనుసరిస్తున్న విధానాలు పారదర్శకంగా ఉండడమే కాకుండా తెలంగాణలో పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు. శక్తి విధానం (2017, 2025లో నవీకరణ), నాన్ రెగ్యులేటెడ్ సెక్టార్ లింకేజ్ వేలం విధానం (2026-2020లో సవరణ), న్యూ కోల్ డిస్ట్రిబ్యూషన్ పాలసీ (2007, 2022 సవరింపు) బ్రిడ్జి లింకేజ్ పాలసీ (2026) వంటి కేంద్ర బొగ్గు శాఖ విధానాల ప్రకారం సింగరేణి బొగ్గు గనుల కంపెనీ లిమిటెడ్ తన బొగ్గు సరఫరాను నిర్వర్తిస్తోందని మంత్రి వివరించారు. ఈ విధానాల అమలుతో పాదర్శకత, సమాన అవకాశాలు, పరిశ్రమలకు మద్దతు, ఉపాధి అవకాశాల పెరుగుదల, అలాగే రాయల్టీ, పన్నుల రూపంలో రాష్ట్రానికి భారీ ఆదాయం లభిస్తోందన్నారు. ఇది తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 2025లో సవరించిన శక్తి విధానం ఆధారంగా పవర్ రంగానికి కొత్త బొగ్గు లింకేజీలు మంజూరు చేయడమవుతోందని ఆయన తెలిపారు. ఈ విధానాల వల్ల తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలకు స్థిరమైన బొగ్గు సరఫరా లభించడంతో పాటు పోటీతత్వ ధరల ద్వారా వ్యాపార వ్యయాలు తగ్గుతుండటంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలలకు సంగీత వాయిద్య పరికరాలు



విద్యార్థులకు అందించిన సంగీత వాయిద్య పరికరాలు

- త్వరలో విద్యార్థులకు శిక్షణ
- పీఎంశ్రీ కింద 15 పాఠశాలల ఎంపిక

జనగామ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు తమకు అభిరుచి ఉన్న కళారంగంలో కూడా రాణించడానికి పాఠశాల స్థాయి నుంచే వివిధ సంగీత కళలపై శిక్షణ ఇచ్చి వారు ఆశించిన రంగంలో స్థిరపడేలా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. నూతన విద్యా విధానం-2020 ప్రకారం విద్యార్థులను ఇంటర్ తర్వాత వారు అన్ని రకాలుగా సాధికారత సాధించడానికి వివిధ వృత్తి విద్య అభ్యసనలతో పాటు సంగీత విద్య కూడా తోడ్పడుతుంది. అందుకనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పరిపూర్ణ అభ్యసనకు దోహదపడే అంశాలను వారికి అందుబాటులోకి తెచ్చి పాఠశాల విద్యను బలోపేతం చేస్తున్నాయి.

పీఎంశ్రీ కింద బడుల ఎంపిక

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) యోజన పథకం ద్వారా రాష్ట్రంలో 832 బడులు ఎంపికయ్యాయి. జనగామ జిల్లా నుంచి 15 ఎంపిక కాగా, సంగీత తరగతులు నిర్వహించడానికి తొలి విడతలో 8 స్కూళ్లను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ మ్యూజిక్ క్లాసులు చెప్పించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. వీటిలో నాలుగు స్కూళ్లకు వయోలిన్, తబలా, మృదంగం, హార్మోనియం మరో నాలుగు పాఠశాలలకు బ్యాండ్ సంగీత పరికరాలను అందించారు. పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేసిన ఒక్కో స్కూల్‌కు రూ.ఒక లక్ష చొప్పున అందనున్నాయి. ఈ మేరకు ఆరవ తరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు సంగీతాన్ని నేర్పించనున్నారు. వారానికి ఒక క్లాసు చొప్పున ఆయా పరికరాలతో శిక్షణ ఇప్పిస్తారు. త్వరలో సంగీత తరగతుల నిర్వహణపై ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లకు శిక్షణ ఇస్తారు.

ఎంపికైన స్కూళ్లు ఇవే..

సంగీత శిక్షణకు జనగామ జిల్లాలో 15 స్కూళ్లు ఎంపిక కాగా, తొలి విడతగా 8 స్కూళ్లకు సంగీత పరికరాలు అందజేశారు. అవి టీఎస్ఎంఎస్ స్టేషన్‌ఘన్‌పూర్, జడ్పీహెచ్ఎస్ బచ్చన్నపేట, టీఎస్ఎంఎస్ చౌడారం, జడ్పీహెచ్ఎస్ పాలకుర్తి, టీఎస్‌డబ్ల్యూఆర్ (బాలికలు) జఫర్‌గఢ్, టీఎస్ఎంఎస్ నర్మెట, టీఎస్ఎంఎస్ కొడకండ్ల, జడ్పీహెచ్ఎస్ తరిగొప్పుల ఉన్నాయి.



డ్రెస్సులో బ్యాండ్ వాయిద్య పరికరాలతో విద్యార్థులు

సంగీత బోధనకు టీచర్లు

సంగీత పాఠాలు చెప్పే ఒక్కో స్కూల్‌కు ఒక టీచర్‌ను కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని అధికారులు భావిస్తున్నారు. దానికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు వచ్చిన తర్వాత జిల్లా అధికారులు రెగ్యులర్ పర్యవేక్షణతో సంగీత పాఠాలు నేర్పిస్తారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

బొమ్మనబోయిన శ్రీనివాస్, ఏఎంవో



చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో పట్టు సాధించాలి. సంగీత శిక్షణకు తొలి విడతగా జనగామలో 8 స్కూళ్లు ఎంపికయ్యాయి. వీటికి పూర్తి స్థాయి మార్గదర్శకాలు రాగానే ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తాం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శ్రీకరం.. శుభకరం..

- రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- ఇంటింటా వ్రతాలు, ఊరూరా వన భోజనాలు
- నెల రోజుల పాటు దేవాలయాల్లో సందడి
- ఆలయాల్లో సామూహికంగా వరలక్ష్మి వ్రతాలు

వరంగల్ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం అంటేనే పండుగలు, పర్వదినాలు, పూజలు, విందులు, వినోదాలు. ఆధ్యాత్మిక శోభతో అలరారే విధంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, వ్రతాలు నిర్వహిస్తారు. శివకేశవులకు, అమ్మవారికి అత్యం త ప్రీతికరమైన మాసం. 30 రోజుల పాటు నిత్య పూజలు, ఆరాధనలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దివ్యనామ సంకీర్తలతో ఆలయాలు సందడిగా మారుతాయి. వరలక్ష్మి అమ్మవారి వ్రతాన్ని ఈ మాసంలోనే నిర్వహిస్తారు. ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహిస్తారు.



ఆషాఢ మాసం అనంతరం వచ్చేది శ్రావణ మాసం. ఈ నెల 24న అమావాస్య అవుతున్నందున 25న శుక్రవారం నుంచి శ్రావణ మాసం ఆరంభం అవుతుంది. ఈ మాసంలో శివాలయాల్లో రుద్రాభిషేకాలు, విష్ణు ఆలయాల్లో ప్రత్యేక ఆరాధనలు, పూజలు, అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. అందుకే దేవతలకు ప్రీతికరమైన మాసంగా పేర్కొంటారు. శ్రావణం అంటే వ్రతాలకు నెలవు. వీటితో పాటు పండుగలు, పర్వదినాలు, వన భోజనాల సందడి నెలకొంటుంది. ముఖ్యంగా సత్యనారాయణ స్వామి వ్రతం, దత్తాత్రేయ స్వామి వ్రతాన్ని ఆచరించుకుంటారు. రాఖీపండుగ, జంజిరాల పున్నం ఈ నెలలోనే వస్తాయి. శ్రావణ వన భోజనాలకు ఇంటిల్లిపాది తరలివెళ్తారు. ఆలయాల్లో నిత్య రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, ఆరాధనలు, భజనలు, కుంకుమ పూజలు నిర్వహిస్తారు. మహిళలు భక్తిశ్రద్ధలతో నెలరోజుల పాటు నియమ నిష్ఠలతో పూజలు చేస్తారు. అమ్మవారి ఆశీర్వాదం కలుగాలని వరలక్ష్మి వ్రతాలను ఇంటింటా నిర్వహించుకుంటారు. ఇంటిలో సౌకర్యం లేని వారు ఆలయాల్లో నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొంటారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తారు.

మహిళలకు వరం.. మహాలక్ష్మి పథకం..

- ఉచిత ప్రయాణంతో ఆలయాలకు ఆదాయం పెరిగింది
- వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లగలుగుతున్నారు..
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ సంబరాలు



ఆర్టీసీ 200 కోట్ల ఉచిత ప్రయాణాల సంబరాల్లో కేక్ కట్ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

గిర్మాజీపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిదని, పేదలు అనేక ప్రయోజనాలు పొందుతున్నారని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 200కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసిన సందర్భంగా బుధవారం వరంగల్ ఆర్‌టీసీ బస్‌స్టేషన్‌లో సంబరాలు జరుపుకున్నారు. హనుమకొండ డిపో మేనేజర్ ధరమ్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సంబరాల్లో మేయర్ గుండా సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మంత్రి కొండా సురేఖ కేక్ కట్ చేసి మహిళలకు అభినందనలు తెలిపారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన మరుక్షణమే మహిళలకు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అమలుచేశారని గుర్తు చేశారు. ఈ సౌకర్యం వల్ల మహిళలు వైద్య సేవల కోసం హైదరాబాద్ వెళ్లి ఉస్మానియా, గాంధీ, నిమ్స్ తదితర ఆస్పత్రులతో ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారని అన్నారు. అదేవిధంగా ఆలయాల దర్శనం వల్ల రూ.176కోట్ల ఆదాయం పెరిగిందని అన్నారు. ఆర్‌టీసీ ఉచిత ప్రయాణం బుధవారం 23వతేదీ నాటికి 200కోట్ల ప్రయాణాలకు చేరుకుందని అన్నారు. ఉచిత ప్రయాణం వల్ల మహిళలు అమ్మనాన్న, అన్నదమ్ములు, అత్తమామల వద్దకు బాగోగులు చూసుకుంటున్నారని, వైద్యం కోసం పెద్దాస్పత్రులకు వెళుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు 15.43కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా రూ.690కోట్లు ఆదా చేసుకున్నారని మంత్రి సురేఖ అన్నారు. కేవలం వరంగల్ జిల్లాలోనే 4.54 కోట్ల మహిళలు ఉచితంగా ప్రయాణించి రూ.190కోట్లు ఆదా చేసుకున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల మంది మహిళలు రూ.6680 కోట్లు పొదుపు చేసుకున్నారని వివరించారు. ఉచిత ప్రయాణమే కాకుండా మహిళాసమాఖ్యలకు ఆర్‌టీసీ బస్సుల నిర్వహణను ప్రభుత్వం అప్పగించిందని గుర్తు చేశారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల కోసం వినూత్న పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తున్నారని అన్నారు. వరంగల్ మహిళా సమాఖ్యలకు కూడా ఆర్‌టీసీ బస్సుల నిర్వహణను అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అనంతరం ఆర్టీసీ మహిళా సిబ్బంది, ప్రయాణికులతో పాటుగా వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్యాదేవి, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కె.భానుకిరణ్, తహసీల్దార్ ఇక్బాల్, వరంగల్ బస్‌స్టేషన్ మేనేజర్ గౌస్ మొహినుద్దీన్, టీపీసీసీ నాయకుడు మీసాల ప్రకాష్, మెప్మా సిబ్బంది, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన వివిధస్టాల్స్‌ను మంత్రి కొండా సురేఖ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మార్కెట్‌లో లెక్క తేలని బస్తాలెన్నో?

- లాట్ ఐడీలు ఇచ్చిన మిర్చి బస్తాలు మాయం
- అధికారులు, దడువాయిలు, వ్యాపారుల కుమ్మక్కు
- మార్కెట్ ఆదాయానికి గండి



వరంగల్ వ్యవసాయం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఈ సీజన్‌లో అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలెన్నో లెక్క తేలడం లేదు. లాట్ ఐడీలు ఇచ్చినపప్పటికీ వేలాది మిర్చి బస్తాల ఆచూకీ తెలియడం లేదు. కోట్లాది రూపాయల సరుకును ఎవరు.. ఎక్కడికి తీసుకు వెళ్లారు.. పన్ను రూపేణా రావాల్సిన లక్షలాది రూపాయల మార్కెట్ ఆదాయానికి గండి కొట్టిందెవరు.. అన్నది మార్కెట్ అధికారులు తేల్చాల్సి ఉంది.

మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన బస్తాలకు తొలుత మార్కెట్ సిబ్బంది లాట్ ఐడీలు ఇస్తారు. అందులో రైతు పేరు, ఊరు, ఏ రకం మిర్చి, ఎన్ని బస్తాలు, అడ్తిదారుడి పేరు తదితర పూర్తి సమాచారం ఉంటుంది. ఆ తరువాత ఖరీదుదారు కొనుగోలు చేస్తే దానికి సబంధించిన సమాచారం కూడా ఉంటుంది. ఒకవేళ రైతుకు ధర గిట్టుబాటు కాకపోతే తన బస్తాలను తీసుకెళ్లి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటాడు. లేదా తిరిగి ఇంటికి తీసుకెళుతాడు. ఇంటికి తిరిగి తీసుకుని పోవడం అన్నది వెయ్యిలో ఒకసారి జరుగుతుంది. మిర్చి బస్తాలను ఇంటి దగ్గర నిల్వ చేసే అవకాశం ఉండదు పాడైపోతుంది.. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటారు.

మార్కెట్‌లో లాట్ ఐడీలు ఇచ్చిన తరువాత దానికి సబంధించిన బస్తాలు తిరిగి మార్కెట్ నుంచి బయటకు వెళ్లాలంటే సంబంధిత అడ్తిదారు ఆ బస్తాలను ఏ కోల్డ్ స్టోరేజీకి తీసుకువెళుతున్నాడో.. మార్కెట్ కమిటీ సిబ్బందికి సమాచారం అందించాలి. లాట్ ఐడీలను రద్దు చేయించుకోవాలి. కానీ ఎలాంటి సమాచారం లేకుండా వేలాది మిర్చి బస్తాలు బయటకు వెళ్లినట్లు తెలుస్తోంది. బయటకు వెళ్లిన ఆ మిర్చి బస్తాలు ఎక్కడ ఉన్నాయనేది మార్కెటింగ్‌శాఖాధికారులు తేల్చాల్సి ఉంది.

ఖమ్మంలో 4 లక్షల మిర్చి బస్తాలు మాయం

ఇటీవల ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో నాలుగు లక్షల బస్తాలకు లెక్క తేలకపోతే మార్కెట్ కార్యదర్శి అడ్తిదారులకు నోటీసులు జారీ చేశారు. ఏనుమాముల మార్కెట్‌లో లెక్కతేలని మిర్చి బస్తాలకు సంబంధించి మార్కెట్ అధికారులు ఇక్కడ అడ్తిదారులకు నోటీసులు ఇస్తారా..?.లెక్క తేల్చుతారా చూడాలి మరి.

మార్కెట్ ఆదాయానికి గండి..

మార్కెట్లో గిట్టుబాటు ధర పలుకనప్పుడు రైతులు తమ మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటారు. మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకుంటారు. తద్వారా మార్కెట్‌కు ఆదాయం వస్తుంది. అయితే ఇక్కడ అడ్తిదారు, దడువాయి, మార్కెట్ అధికారులు కుమ్మక్కై మార్కెట్‌కు పన్ను చెల్లించకుండానే సరుకును బయటకు తీసుకెళ్లారు. దీనివల్ల మార్కెట్ ఆదాయానికి కోట్లాది రూపాయలు గండి కొట్టారు. ఇప్పటికైనా మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ విభాగం ప్రత్యేక శ్రద్ధ కనబరిచి అక్రమాల వెనుక జరుగుతున్న తతంగాన్ని వెలికి తీయాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

నేటి నుంచి రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

- ఆఫీసర్స్ క్లబ్ వేదికగా నాలుగు రోజుల పాటు క్రీడలు
- 20 జిల్లాల నుంచి 190 మంది క్రీడాకారుల హాజరు
- బ్యాడ్మింటన్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఏసీపీ జితేందర్‌రెడ్డి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : యోనెక్స్ సన్‌రైజ్ సహకారంతో మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీ నిర్వహించనున్నట్లు మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏసీపీ(ఎస్‌బీ) మూల జితేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జితేందర్‌రెడ్డి పాల్గొని బ్యాడ్మింటన్ క్రీడా పోటీల వివరాలను వెల్లడించారు.

ఈ నెల 24న క్రీడాకారుల సర్టిఫికెట్ల పరిశీలన, ఎంట్రీలు (క్వాలిఫైయింగ్ రౌండ్) 25న ఉదయం ఆఫీసర్స్ క్లబ్ వేదికగా ఏర్పాటు చేయనున్న క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు తెలంగాణ యూనివర్సిటీ వీసీ డాక్టర్ టి.యాదగిరిరావు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తారని జితేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నాలుగు రోజుల పాటు ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో సింగిల్స్, డబుల్స్ మిక్స్‌డ్ డబుల్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న బ్యాడ్మింటన్ టోర్నీలో 20 జిల్లాల నుంచి సుమారు 190 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అదే విధంగా ఈ నెల 27న ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేయనున్న క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అంతర్జాతీయ స్థాయి పూర్వపు బ్యాడ్మింటన్ క్రీడాకారులు శశిధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారని జితేందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ నిబంధనల మేరకు క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత బస, భోజన వసతులను కల్పిస్తామన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబరు మాసంలో ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమ్ము రాజేందర్, వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి, కోశాధికారి నాగ కిషన్ తదితరులు పాల్గొన్నారు.


ఈ-పంచాయతీ సేవలకు సుస్తీ..!

- కంప్యూటర్ సేవలన్నీ ఎంపీడీవో ఆఫీసుల్లోనే..
- తుప్పుపడుతున్న టీ-ఫైబర్ బాక్సులు
- ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామాల ప్రజలు

వర్ధన్నపేట రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వేగంగా మరింత మెరుగ్గా అందించడానికి గత ప్రభుత్వం ఈ-పంచాయతీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ధ్రువీకరణ పత్రాలను ఎక్కడికక్కడే అందించమే ముఖ్య ఉద్దేశంగా ఈ విధానాన్ని తీసుకువచ్చింది. తొలుత కొన్ని గ్రామ పంచాయతీలకు ఆపరేటర్లను నియమించి కంప్యూటర్లను అందించింది. మిగతా వాటికి కంప్యూటర్లు, ఆపరేటర్లు లేకపోవడంతో సేవలు అందడం లేదు. నియమించిన వారికే క్లస్టర్లుగా విభజించి సేవలు అందిస్తున్నామని ప్రస్తుతం అధికారులు చెబుతున్నారు. వరంగల్ జిల్లాలో 11 మండలాలు, 317 గ్రామాలకు గాను క్లస్టర్ల వారీగా 38 మంది కంప్యూటర్ ఆపరేటర్లను నియమించగా ప్రస్తుతం అందరూ ఎంపీడీవో ఆఫీసుల్లోనే పనిచేస్తున్నారు.

పంచాయతీకో టీ-ఫైబర్

ఈ-పంచాయతీ పాలన అమలు కావాలంటే కార్యాలయాల్లో కంప్యూటర్ సేవలు ఉండాలి. గత ప్రభుత్వం ఇంటింటికీ ఇంటర్‌నెట్ అందిస్తామని ప్రకటించి మిషన్ భగీరథ పైపులైన్‌తోనే టీ-ఫైబర్ లైను కోసం కేబుల్‌లను వేశారు. గ్రామ పంచాయతీ భవనాల్లో టీఫైబర్ సర్వర్ బాక్సులను ఏర్పాటు చేశారు. కానీ, అన్ని జీపీలకు కంప్యూటర్లను సరఫరా మాత్రం చేయలేదు. కొన్ని పంచాయతీలకు సరఫరా చేసినా వాటిని కూడా మండల పరిషత్ కార్యాలయాలకు తరలించి అక్కడి నుంచే పనిచేస్తున్నారు. చాలా చోట్ల వీరు గ్రామాల్లో కాకుండా ఎంపీడీవో కార్యాలయాల నుంచే పనిచేస్తున్నారు. గతంలో మండలానికో 2-3నుంచి మూడు క్లస్టర్లను ఏర్పాటు చేసి పెద్ద గ్రామ పంచాయతీల ద్వారా ఆపరేటర్లు కేటాయించిన పంచాయతీలకు వెళ్లేలా చేశారు. కానీ దానిని సైతం తొలగించి అన్ని మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాల నుండే పనులు చక్కబెడుతున్నారు.



జీపీ భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్లు

దీంతో మారుమూల గ్రామీణ ప్రజలు మండల కేంద్రానికి వచ్చి పనులు చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

సమస్త సమాచారం పొందుపర్చేలా..

ప్రతీ పంచాయతీకి అందించే ఈ-సేవలతో గ్రామాల్లో మెరుగైన పౌరసేవలు అందించేందుకు వీలవుతుందని ప్రభుత్వం భావించింది. పనులకు సంబంధించి నివేదికలు తయారు చేయడంతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహాల నమోదు, జాబ్ కార్డుల జారీ, రేషన్ కార్డులు, పెన్షన్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ, వృత్తి, వ్యాపార లైసెన్సుల మంజూరు ఇలా ఎన్నో సేవలను ఈ పంచాయతీల ద్వారా ప్రజలకు అందించాలి. దీనికి తోడు టాక్స్‌ల వసూళ్లు, పెన్షన్లు, వ్యక్తిగత సమాచారాలు, గ్రామ ప్రణాళికలు, అనుమతులు, గ్రామ సభల నిర్వహణ తదితర అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా పంచాయతీ నిర్వహణ మొత్తం పారదర్శకంగా ఉంటుందని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. పల్లె ప్రగతి నివేదికలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పంచాయతీలకు అందించే నిధులు, వీటికి సంబంధించిన పనులు, ఖర్చులు, అన్ని వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేయడం ద్వారా కచ్చితమైన సమాచారం ఉంటుందని భావించింది. ఇంటర్‌నెట్ సేవలతో సమయం ఆదాతో పాటు పనులు త్వరగా పూర్తవుతాయని తలచింది. గ్రామ పంచాయతీల ద్వారా ప్రజలకు ఇవి అందకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. అన్ని గ్రామ పంచాయతీలకు కంప్యూటర్లు సరఫరా చేసి, ఆపరేటర్లను నియమిస్తే ప్రజలకు మెరుగైన సేవలు సకాలంలో అందే అవకాశం ఉంది.

అందుబాటులోకి ఎప్పుడు?

వరంగల్ జిల్లాలోని 317 గ్రామ పంచాయతీల్లో టీ ఫైబర్ ఇంటర్‌నెట్ కనెక్షన్ల బాక్స్‌లు బిగించారు. బిగించిన పరికరాలు మూలన పడుతున్నాయే తప్ప ఇంకా సేవలు అందుబాటులోకి రావడం లేదు. వీటికి విద్యుత్ సరఫరాలో అవరోధం రాకుండా జీపీ భవనాలపై సోలార్ ప్లేట్లను సైతం అమర్చారు. కానీ, ఇప్పటివరకు అవి నిరుపయోగంగానే మారాయి. కొన్ని గ్రామాల్లో టెస్టింగ్ నడుస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో పూర్తి స్థాయిలో నడవడం లేదు. ఇక టీ ఫైబర్ సేవలను వినియోగించుకునేందుకు ఆయా పంచాయతీలకు కంప్యూటర్లను సైతం అందించారు. వాటిని వినియోగించకపోవడంతో మూలన పడినట్లు చెపుతున్నారు. రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన టీ-ఫైబర్ సేవలు, కంప్యూటర్లు నిరుపయోగంగా ఉండడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి ప్రభుత్వమైనా వాడుకలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

3 నెలలుగా జీతాలు నై..

వరంగల్ జిల్లా వ్యాప్తంగా 38 మంది కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే పనిచేస్తుండగా, వారికి సక్రమంగా జీతాలు అందడం లేదు. దాదాపు రూ.15000-20000 వరకు జీతం తీసుకుంటున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు వెట్టి చాకిరీ చేయాల్సి వస్తోంది. వర్ధన్నపేట మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా ఇక్కడ ఇద్దరు ఆపరేటర్లు మాత్రమే పనిచేస్తున్నారు. దాదాపు ఒక్కో ఆపరేటర్‌కు 9 గ్రామ పంచాయతీల పనులు చేయిస్తున్నారు. ఓ పక్క అదనపు భారంతో అవస్థలు పడుతుండగా, పనికి తగినంతా వేతనం రాకపోవడం, జీతాలు సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఔట్ సోర్సింగ్ విధానంలో 2015లో నాటి ప్రభుత్వం వీరిని రిక్రూట్ చేసుకోగా, ఇప్పటి వరకు పంచాయతీల నుంచే జీతాలు అందిస్తున్నారు. ఉద్యోగ భద్రత సైతం ప్రభుత్వం కల్పించక పోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.



వర్ధన్నపేట మండలంలోని దివిటిపల్లిలో మూలన పడి ఉన్న టీ-ఫైబర్ బాక్సు

ప్రభుత్వానికి నివేదిస్తాం..

కల్పన, జిల్లా పంచాయతీ అధికారి వరంగల్



గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తాం. పారదర్శకమైన పాలన అందాలనే లక్ష్యంగా ఈ-పంచాయతీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ప్రజలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో అందేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తే తప్పకుండా ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. టీ ఫైబర్ సేవలు, కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

నేడు జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 23(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాల బాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ అశోక జంక్షన్ సమీపంలోని డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు ప్రారంభం కానున్నట్లు ఆయన వెల్లడించారు. 1 జనవరి 2011 నుంచి 31 డిసెంబరు 2012 మధ్య జన్మించిన వారు ఈ ఎంపిక పోటీలకు అర్హులను ఆయన తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 25నుంచి 27వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పాఠశాల నుంచి జారీ చేసిన బోనఫైడ్ సర్టిఫికెట్‌తో పాటు రెండు పాస్ పోర్టు సైజ్‌ఫొటోలను వెంట తీసుకోని గురువారం ఉదయం 7గంటలకు హనుమకొండ అశోక జంక్షన్ సమీపంలోని డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని రాజేందర్ సూచించారు.

కేయూ ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎన్నిక



హరికృష్ణ జ్ఞానేశ్వర్

కేయూక్యాంపస్ జూలై 23 (ఆంధ్ర జ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఏబీవీపీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఉబ్బటి హరికృష్ణ, మేకల జ్ఞానేశ్వర్ ఎంపికయ్యారు. ఈ మేరకు కేయూలో బుధవారం జరిగిన ఏబీవీపీ విద్యార్థుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంబాబు ఇతర నేతలు ప్రకటించారు. కేయూ నూతన అధ్యక్షుడు ఉబ్బటి హరికృష్ణ, మేకల జ్ఞానేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యక్షులుగా సాయికుమార్, రాజ్ కుమార్, ఫణీంద్ర, వీరన్న, చరణ్‌గౌడ్, జాయింట్ సెక్రటరీలుగా శివాజీ, రోహిత్, ప్రవీణ్‌కుమార్, హరికృష్ణ, ఉమేశ్, కార్యవర్గ సభ్యులు నవీన్ యాదవ్, రాము, సురేంద్ర, విద్యార్థి శక్తి విభాగం ఇన్‌చార్జిగా శివరాజ్‌లను ఎంపిక చేశారు. ఈ సమావేశంలో వరంగల్ విభాగ్ సంఘటన మంత్రి పృథ్వీరాజ్, కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, అంబాల కిరణ్ ఇతర నేతలు, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేసి పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

కాజీపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట 47వ డివిజన్‌లో బుధవారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈకార్యక్రమంలో పసునూరి మనోహర్, అజ్గర్, ఇప్ప శ్రీకాంత్, యమడాల హనుకాంత్, మానస మధు, యాదగిరి, నాగమహేశ్‌తోపాటు స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బీఎంఎస్ వార్షికోత్సవ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న ఎం.ధర్మారావు

కాజీపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట నిట్ క్యాంపస్ ఎదుట బుధవారం భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మార్తనేని ధర్మారావు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రసిడెంట్ కుణాకర్, ప్రధాన కార్యదర్శి మల్లేశంతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన మాజీ ఎంపీ సీతారాంనాయక్



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సీతారాంనాయక్

రాంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడిని బుధవారం మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ ఢిల్లీలో కలిసి మామునూరు, కొత్తగూడెం విమానాశ్రయాల నిర్మాణం విషయంలో వినతిపత్రం అందజేశారు. కాగా, విమానాశ్రయాలు నిర్మించే విషయంలో చిత్తశుద్ధితో ఉన్నామని, మామునూరు విమానాశ్రయ నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంలేదని,డీపీఆర్‌లో ఉన్న విధంగా 800 ఎకరాలు కేటాయించాలి కానీ 600 ఎకరాలు మాత్రమే కేటాయించిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి చెప్పారని మాజీ ఎంపీ తెలిపారు. మిగతా 200 ఎకరాల భూమి కేటాయిస్తే నిర్మించడానికి కేంద్ర మంత్రిత్వ శాఖ సిద్ధం ఉందని తెలిపినట్లు పేర్కొన్నారు.

కేయూ జర్నలిజం విభాగంలో విచారణ

కేయూ క్యాంపస్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో బుధవారం ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, సోషియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కె.అయిలయ్యల నేతృత్వంలో నియమించిన కమిటీ విచారణ చేపట్టింది. జర్నలిజం విభాగంలో పార్టుటైమ్ అధ్యాపకులకు నియామక ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో చాలా ఏళ్లుగా తరగతులు బోధించిన అధ్యాపకులకు జీతాలు చెల్లించడం లేదని, వర్క్‌లోడ్ విషయంలోనూ అస్తవ్యస్తంగా మారిందని కుప్టా నేతలు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంకు ఫిర్యాదు చేశారు. దీంతో రిజిస్ట్రార్ విచారణ కమిటీని నియమించగా కమిటీ మొదటి దఫాగా బుధవారం జర్నలిజం విచారణ చేపట్టింది. గత వీసీ కాలంలో పార్టుటైమ్ అధ్యాపకులకు అనేక కారణాలు చూపి ఉత్తర్వులు ఇవ్వకపోవడం, ఇన్‌చార్జి వీసీ కరుణ కాలంలో ఉత్తర్వులు వెలువటం, జర్నలిజం విభాగంలో పాఠాలు బోధించిన పార్ట్‌టైమ్ అధ్యాపకులకు జీతాలు చెల్లించకపోవడం, డిపార్టుమెంట్ కమిటీలో అనుమతి లేకుండా గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలపై కమిటీ సమాచారం సేకరించింది. 1, 2 రోజుల్లో సమగ్రమైన వివరాలను సేకరించి రిపోర్టును అందచేయనున్నారు.

ప్రతీ సభ్యుడికి న్యాయం చేస్తాం

- ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు గట్టు మహేశ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న గట్టు మహేశ్‌బాబు

మట్టెవాడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సంఘంలో ఉన్న ప్రతీ సభ్యుడికి న్యాయం చేస్తామని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు గట్టు మహేశ్‌బాబు అన్నారు. బుధవారం వరంగల్‌లోని సంఘం భవనంలో ఆయన మాట్లాడుతూ.. సంఘం సభ్యుల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని, అందరి సలహాలు తీసుకొని సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు రాజేశ్వర్‌రావు, కల్వ నాగరాజు, తోట శివాజీ, కార్యవర్గ సభ్యులు చక్రం నరసింహమూర్తి, మాదారపు సురేశ్, వేముల శ్రీరాములు, కొండూరు శివప్రసాద్, పొట్టి శ్రీనివాస్, పి.సుధాకర్, తిరుమల రమేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వర్షపాతం సమాచారం వీఎండీలపై ప్రదర్శించాలి

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
- వివిధ విభాగాల అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వర్షపాతం సంబంధిత సమాచారం వేరియబుల్ మెస్సేజ్ డిస్‌ప్లే(వీఎండీ)లపై ప్రదర్శించాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. బుధవారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో మాన్‌సూన్ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తోపాటు వివిధ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వర్షాలకు సంబంధించిన సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్‌లకు 18004251980 9701999645, 9701999676 సమాచారం అందించాలన్నారు. వీఎండీ డిస్‌ప్లేలు హనుమకొండ బస్‌స్టేషన్ సర్కిల్, గ్రేటర్ మునిసిపల్ ప్రధాన కార్యాలయం, పబ్లిక్ గార్డెన్, వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్‌లలో ఏర్పాటు చేయాలని అన్నారు. వీటిపై ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు తెలుపాలన్నారు. ఐసీసీసీ ద్వారా వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తామన్నారు. భారీ వర్షాలు, వరదలు కురిస్తే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈలు రవికుమార్, శ్రీనివాస్, సంతోష్‌బాబు, మాధవిలత, డీఈలు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రంగసముద్రం అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

వరంగల్ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి) : వరంగల్ రంగసముద్రం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి రంగసముద్రం పనులు, అక్కడి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రంగసముద్రం వద్ద జరుగుతున్న పనులు గణపతి నిమజ్జనం కంటే 15రోజుల ముందే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఈఈలు రవికుమార్, శ్రీనివాస్‌తో పాటు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

విచారణ ఐపాయే.. నివేదిక ఏమాయే..?!

(5వ పేజీ తరువాయి)

తీసుకోవాలని కేఎస్ రెడ్డి ఆ ఫిర్యాదులో కోరారు. దీనిపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం కేయూ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్‌కు ఉత్తర్వులు (నెం.1457/యూఈ/ఏ2/2024 జారీ చేసింది. దీనిపై అప్పటి ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ విచారణ చేపట్టకుండానే రాజకీయ ఒత్తిళ్లతో తప్పుదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మల్లారెడ్డి వీసీ రేసులో ఉండటంతో తనపై తప్పుడు ఫిర్యాదులు చేశారని ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ నేత ద్వారా అప్పటి ఇన్‌చార్జి వీసీపై ఒత్తిడి తీసుకురావటంతో ఆ విచారణ సైతం అటకెక్కిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.

మరికొన్ని సమస్యలు..

కేయూలో పేరుకుపోయిన సమస్యలపై స్పందించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, నాణ్యమైన భోజనం అందించాలని అధికారులు, పాలకమండలిని కోరుతున్నారు. హాస్టళ్ల స్లాబ్‌పై నుంచి ఫ్యాన్ ఊడిపడటం, బెచ్చలు విరిగిపడటంతో విద్యార్థినులకు గాయాలైన సంఘటనలు ఉన్నాయి. హాస్టల్ రూమ్‌ల్లోకి పాములు వస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు. అలాగే ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా యూనివర్సిటీ పరిధిలో కొత్త కోర్సులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులపై అధ్యయనం చేయాలని, దూరవిద్యలో కూడా అన్నిరకాల కోర్సులు అందించేలా కొత్త వైస్‌చాన్స్‌లర్ ప్రణాళిక రూపొందించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాలిటెక్నిక్ డిప్లొమా ప్రవేశాల తుది విడత వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పాలిటెక్నిక్ 2025 డిప్లొమా కోర్సుల తుది విడత వెబ్ కౌన్సెలింగ్ ఈనెల 24 నుంచి ప్రారంభం అవుతోంది. ఈ కౌన్సెలింగ్‌లో మొదటి విడతలో సీటు పొందిన అభ్యర్థులు అవసరమైతే తిరిగి ఆప్షన్లు ఇవ్వవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలిపారు. మొదటి విడతలో కౌన్సెలింగ్‌కు హాజరు కాకపోయినా, కొత్తగా స్లాట్‌బుక్ చేసుకొని ధృవపత్రాలు పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సమ్మయ్యనగర్‌లో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి

వడ్డెపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేయూసీ - కాజీపేట వంద ఫీట్ల రోడ్డును ఆనుకొని ఉన్న సమ్మయ్యనగర్‌లో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల దశరథం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌ను కోరారు. బుధవారం హనుమకొండ 56వ డివిజన్ వివేక్‌నగర్ కాలనీలో బొప్ప శివశంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హనుమకొండ మండలంలోని లష్కర్‌సింగారం ప్రభుత్వ భూమి ఉందని పేర్కొన్నారు. 53, 54, 56, 57, 58 డివిజన్లలో కూరగాయల మార్కెట్ లేకపోవడంతో వివిధకాలనీల వాసులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కూరగాయలను పండించే కోమటిపల్లి, దేవన్నపేట, పలివేల్పుల, చింతగట్టు, ముచ్చర్ల నాగారం, పెంబర్తి రైతులు తమ ఉత్పత్తులను నగరంలో రోడ్లపై క్రయ విక్రయాలు జరుపుతున్నారని తెలిపారు. రోడ్ల వెంట కూరగాయల అమ్మకాలు చేపట్టడం వలన ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. జిల్లా యంత్రాంగం స్పందించి సమ్మయ్య నగర్‌లోని ప్రభుత్వ భూమిలో సీఎం ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ప్రజాతంత్ర ఆలోచన వేదిక జిల్లా కన్వీనర్ పింగిళి అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతలఫణి వేణుగోపాల్‌రెడ్డి, ప్రతినిధులు మీసాల రమేష్, ఎల్.పాపారావు, దేవేందర్‌రెడ్డి, ఎర్రోజు భిక్షపతి పాల్గొన్నారు.

మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్
- వరంగల్-1 డిపోలో ఆర్టీసీ మహాలక్ష్మి ఉత్సవాలు



కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ రాథోడ్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్, డీఎం అర్పిత

హనుమకొండటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించారని హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్ తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో 200 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారని, రూ.66.80 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు బుధవారం డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ ఆధ్వర్యంలో సంబరాలు సంబరాలు ఘనంగా నిర్వహించారు. హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం నిర్వహించినకార్యక్రమంలో ఆర్డీవో రమేష్‌రాథోడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలకు అన్ని విభాగాల్లో పెద్ద పీట వేస్తూ రేషన్ కార్డులు, గ్యాస్, ఇతర పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి ఆర్థికంగా లాభం చేకూరిందని తెలిపారు. డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ మాట్లాడుతూ.. వరంగల్ రీజియన్‌లో 15 కోట్ల 43 లక్షల మహిళా ప్రయాణికులు పథకాన్ని ఉపయోగించుకున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి సంబరాల్లో భాగంగా ఆర్టీసీ కార్మికుల పిల్లలకు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ -1 డిపో డీఎం పి. అర్పిత, అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్. సంతోష్‌కుమార్, అధికారులు అమల, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కీర్తి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్మీకంపోస్టు యూనిట్‌పై అవగాహన

ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ



వర్మీకంపోస్టు యూనిట్ నిర్వహణపై అవగాహన కలిగిస్తున్న ప్రేరణ ఫౌండేషన్

హనుమకొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని వర్మీకంపోస్టు యూనిట్ నిర్వహణ పద్ధతులపై బుధవారం విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి అవగాహన కలిగించారు. రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల పర్యావరణ సుస్థిరత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ సిబ్బంది, సామాజిక కార్యకర్తలు, మేధావులు హాజరయ్యారు. బయోగ్యాస్ ప్లాంటులో సేంద్రియ వ్యర్థాలను ఉపయోగించి బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసుకునే అవకాశాలను ఉపేందర్‌రెడ్డి వివరించారు.

బాలసముద్రం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలకు సంబంధించిన చెత్తను ఈ కేంద్రానికి తరలించడం ద్వారా ఈ ప్లాంట్ నుంచి బయోగ్యాస్, విద్యుత్ ఉత్పత్తితో ప్రయోజనాలు పొందవచ్చునన్నారు.

గ్రేటర్ కార్యాలయం.. చినుకు పడితే చిత్తడే..

- మరమ్మతుకు కేటాయించిన నిధులు నీటిపాలు
- జీడబ్ల్యూఎంసీ పై అంతస్థులో కురుస్తున్న వర్షపు నీరు



మునిసిపల్ ప్రధాన కార్యాలయం పై అంతస్థులో కురిసిన వర్షం నీరు

వరంగల్ కార్పొరేషన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో రాజుల సైన రాళ్లపాటు అన్నట్టు ఉంది. ప్రజల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేసిన పన్నులతో అభివృద్ధి చేస్తున్నామని నడిస్తున్న అధికారులు, పాలక వర్గం డొల్లతనం వర్షం కురిసిన సమయంలో బయటకు పొక్కుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం పై అంతస్థు వర్షపు నీటితో ఇబ్బందిగా మారింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని పరిపాలనా విభాగం భవనం నిర్మించి సుమారు 55 సంవత్సరాలు పూర్తి అయ్యింది. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొద్ది రోజుల క్రితం మునిపల్ కార్యాలయాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సందర్శించి కూల్చివేయాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ ఇక్కడి పాలక వర్గం పెద్దలు మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్ల వద్ద నుంచి పర్సంటేజీలు పుచ్చుకుని అదే భవనం తరుచుగా రిపేర్లు చేస్తున్నారు. ఇటీవల రూ.2కోట్లు ఖర్చు చేసి కూలిపోయే భవనం కౌన్సిల్ హాల్ మాడిఫికేషన్ చేసి నాలుగు రాళ్ల వెనకేసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. కాగా పరిపాలనా విభాగం పై అంతస్థులో వర్షం నీటికి సీలింగ్ పూర్తిగా ఊడి పోయింది. పై అంతస్థు కూడా కూలడానికి సిద్ధంగా ఉన్నా ఇటీవల రూ.5 లక్షలతో మరమ్మతు పనులు చేశారు. కానీ సదరు కాంట్రాక్టర్ నాసీరకం పనులు చేయడంతో ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు సీలింగ్ నుంచి నేలపై వర్షం నీటి వరద చేసుకుంది. పై అంతస్థులో పని చేసే సిబ్బంది ప్రమాదాన్ని పసిగట్టి ఇక్కడ విధులు నిర్వహించలేం బాబోయ్.. అంటూ పరుగులు పెడుతున్నారు. పై అంతస్థు వరండా, గదుల్లోకి నీరు చేరడాన్ని గుర్తించిన సిబ్బంది వర్షం నీటిని బయటకు పంపించేందుకు ముప్పుతిప్పలు పడ్డారు. సమస్యలు విన్నవించేందుకు పై అంతస్థుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు వర్షం నీటిలో జారి పడిపోయినట్టు తెలిపారు. వర్షం కురిసిన ప్రతీసారి ఈసమస్య ఎదుర్కోవలసి వస్తుందని, అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూడాలని ఉద్యోగులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులు విద్యుత్ మరమ్మతులు చేయొద్దు

రాంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ భూముల దగ్గర స్వతహాగా మరమ్మతుల చేయొద్దని హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు సూచించారు. ప్రమాదకర సమస్యలు ఉంటే వెంటనే టీజీ ఎన్పీడీసీఎల్ టోల్ ఫ్రీ నెంబర్ 1912కు సమాచారం ఇవ్వాలన్నారు. తెగిపడిన, లూజ్‌గా ఉన్న వైర్లు కనిపిస్తే వెంటనే గ్రామీణ విద్యుత్ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయిలో ఉండే లైన్‌మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్, ఎస్ఈలను సంప్రదించాలన్నారు.

అమ్మ అనుగ్రహం సకల శ్రేయస్కరం

- వేదాంత పండిత సభలో కేవీ జానకి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జానకి

హనుమకొండ కల్చరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : సమస్త జగత్తును తన కనుసన్నల్లో పరీక్షించే జగన్మాత క్షీర సాగర మథనంలో ఉద్భవించిన మహాలక్ష్మీదేవి అనుగ్రహం అందరిపై ఉండాలని బెంగుళూరుకు చెందిన ఆధ్యాత్మిక ప్రవచకురాలు, విదుషీమణి కేవీ జానకి అన్నారు. మహామహోపాధ్యాయ, డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్య స్వామి శతజయంతి ఉత్సవాలు, వారి ధర్మపత్ని సీతమ్మ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ అదాలత్ సమీపంలోని శ్రీ భూనీళా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉభయ వేదాంత పండిత సభల ముగింపు వేడుకల్లో జానకి పాల్గొని లక్ష్మీదేవి వైభవంపై ప్రవచం చేశారు. రూపాలు వేరైనా అమ్మ ఒక్కరే అని, అమ్మ అనుగ్రహంతో దేనినైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు నరసింహదేశికన్, కె.శ్రీనివాసాచార్య, యాదా శ్రీనివాస్, టి.యాదగిరి, రమా జయంత్, ఉషారాణి, శోభ పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దానయ్య

రాంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్పీడీసీఎల్ హనుమకొండ రూరల్ ఏడీఈ బక్క దానయ్య ఎన్నికయ్యారు. మంగళవారం హైద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర జనరల్ బాడీ మీటింగ్‌లో గతంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ జనరల్ సెక్రటరీగా ఉన్న తనను రాష్ట్ర జనరల్ సెక్రటరీగా అసోసియేషన్ సభ్యులు ఎన్నుకున్నట్లు దానయ్య తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాసంస్థల బంద్ సక్సెస్

(5వ పేజీ తరువాయి)

స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ల బకాయిలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల స్కూళ్లకు భవనాల్లేవని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. ఫుడ్ పాయిజన్‌తో 48 మంది విద్యార్థులు మృతి చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల్లేవని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలను పెంచాలని, ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తే కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ నేతలు నరసింహరావు, మర్రి మహేశ్, రాచకొండ రంజిత్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర నాయకురాలు మాస్ సావిత్రి, స్టాలిన్, సాయికుమార్, గణేశ్, పవన్, ఆదిత్య, సందీప్, చరణ్, ప్రణీత్, అరుణ్, భరత్, సాయికుమార్, అజయ్, సందీప్, ప్రతిమ, ప్రవళిక, అంజలి తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై గణపతి హోమం



మెట్టుగుట్టపై హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మడికొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని పవిత్ర క్షేత్రం మెట్టుగుట్టపై వెలసిన మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం సీతారామచంద్ర స్వామి వారికి ప్రాతఃకాల మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి లక్షపుష్పార్చన నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థమైయాగశాలలో గణపతిహోమం, రుద్రహోమంచేశారు. రామాలయ ఈవో సత్యనారాయణ, శివాలయం ఈవో శేషభారతి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది రణధీర్, అనిల్, సురేష్, కుమార్, రాజమణి, వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 24 జూలై 2025

విజేత



వింత చూపులు వెంటాడేవి. చులకన మాటలు నిద్ర లేని రాత్రుల్ని మిగిల్చేవి. అన్నిటినీ దిగమింగుకొని... స్వశక్తితో ఎదిగి... నేడు పిల్లల దుస్తుల బ్రాండ్‌కు అధిపతులయ్యారు. చేనేతపై కవిత్వాన్ని పేర్చి... కళాకారులకు చేయూతనందించి... పర్యావరణహితమైన దుస్తులు ఉత్పత్తి చేస్తూ... మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు... **శ్వేత, అంకిత ధరివాల్.** ఈ అక్కాచెల్లెళ్ల స్ఫూర్తిదాయక కథ... శ్వేత మాటల్లోనే...

నవ్విన నోళ్లే మెచ్చేలా!

"మా కథ చెప్పాలంటే... పద్దెనిమిదేళ్ల వెనక్కి వెళ్లాలి. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్... ఎండలు మాడిపోతున్నాయి. నా పిల్లలు ఏ డ్రెస్ వేసినా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మార్కెట్‌లో ఎంత వెతికినా సరైన గాలి జొరబడేవి, సున్నితమైన శరీరానికి హాని కలిగించని దుస్తులు లభించలేదు. ఇది టెక్స్‌టైల్ డిజైనర్‌గా కార్పొరేటు సంస్థల్లో పని చేసిన అనుభవం ఉన్న నన్ను ఆలోచనలో పడేసింది. దీనికి పరిష్కారం ఏంటి? తీవ్రంగా పరిశోధించాను. ఎక్కడ వస్త్ర ప్రదర్శనలు జరిగితే అక్కడకు వెళ్లాను. ఎంతోమంది నేత కళాకారులతో మాట్లాడాను. వాళ్లు చెప్పింది విన్నాను. నా అభిప్రాయాలు, ఆలోచనలు వారితో పంచుకున్నాను. పదేళ్లు విస్తృతంగా అధ్యయనం చేశాక ఒక అభిప్రాయానికి వచ్చాను. అదేంటంటే... 'సేంద్రియ పద్ధతిలో పండిన పత్తి'. రసాయనాలు లేని పత్తితో, సహజసిద్ధమైన పద్ధతిలో తయారైన దుస్తులు చంటి పిల్లలకు చాలా సౌకర్యంగా ఉంటాయి. ఎన్నో ఎగ్జిబిషన్లను సందర్శించిన నాకు అలాంటి వస్త్రాలు ఎక్కడ కనిపించలేదు. దాంతో నేనే ఒక అడుగు ముందుకు వేశాను. మా సోదరి అంకిత సహ వ్యవస్థాపకురాలిగా 2017లో 'వైట్‌వాటర్ కిడ్స్' పేరుతో కంపెనీ నెలకొల్పాను.

దానికీ ఒక అర్థం ఉంది...

మా బ్రాండ్‌కు 'వైట్ వాటర్' అని పెట్టడానికి ఒక కారణం ఉంది. పేరు చూడగానే ఉత్పత్తుల ఉద్దేశం అర్థమవ్వాలనేది మా ఆలోచన. తెలుపు స్వచ్ఛతకు, నీరు పారదర్శకతకు, ప్రవాహానికీ ప్రతీకలు. అంకితకు కూడా డిజైనింగ్, స్టోరీ టెల్లింగ్‌లో అనుభవం ఉంది. తను 'లండన్ కాలేజీ ఆఫ్ కమ్యూనికేషన్' నుంచి డిగ్రీ పూర్తి చేసింది. డిజిటల్ మార్కెటింగ్‌కు తన నైపుణ్యం బాగా కలిసివచ్చింది. నేను కోరుకున్నది కేవలం డ్రెస్‌ల డిజైన్ మాత్రమే కాదు... అవి కమ్మని కథలు కూడా చెప్పేలా రూపొందించాలని. స్వతహాగా కవిత్వంపై నాకు ఆసక్తి. తీరిక దొరికినప్పుడల్లా ఏదోఒకటి రాస్తుంటాను. అలా కాగితం మీద పెట్టిన అక్షరాలను దుస్తులపైకి తెచ్చాను. మా చేనేత కళాకారులు నా కవితాత్మక పంక్తులకు చక్కని రూపం ఇస్తున్నారు. అవన్నీ చిన్నారుల్లో స్ఫూర్తి నింపేవిగానే ఉంటాయి.

కళాకారుల సంగమం...

మా బ్రాండ్ సంప్రదాయ వస్త్ర శ్రేణుల మేలి కలయిక. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు పేరుపొందిన చేనేత కళలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నాం. అందుకోసం సాధ్యమైనంతమంది స్థానిక కళాకారులను సంప్రతిస్తున్నాం. వారితో కలిసి పని చేస్తున్నాం. తద్వారా వారికీ ఒక ఆదాయ మార్గం లభిస్తోంది. ప్రధానంగా మహిళా కళాకారులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. వారికి ఇంటి దగ్గర నుంచే పని చేసే వెసులుబాటు కల్పిస్తున్నాం. ఏదిఏమైనా మా అంతిమ లక్ష్యం... చిన్నారులకు సౌకర్యవంతమైన వస్త్ర శ్రేణులను అందించడం. అందులో రాజీ లేదు. సేంద్రియ పత్తితో తయారైన వస్త్రం, సహజసిద్ధ రంగులు మాత్రమే ఉపయోగిస్తాం. కుర్తా సెట్ నుంచి దిండు గలీబు వరకు చిన్నారులకు సంబంధించిన అన్ని వస్త్ర శ్రేణులను తీసుకువచ్చాం. అదే సమయంలో ప్రయోగాత్మకంగా, వేటికవే భిన్నంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకొంటున్నాం.

వైకల్యాన్ని దాటి...

అంకితకు, నాకు... ఇద్దరికీ వైకల్యం. నా ఒంటి నిండా తెల్ల మచ్చలు. అంకితకు పోలియో. సరిగ్గా నడవలేదు. బాల్యంలోనే కాదు... కాలేజీకి వెళ్లే రోజుల్లోనూ మేం ఎన్నో అవహేళనలు, అవమానాలు ఎదుర్కొన్నాం. మాలోని లోపాలను చూసి కొందరు చులకనగా మాట్లాడేవారు. అవి మమ్మల్ని విపరీతంగా బాధించేవి. కానీ వాటివల్ల మా కెరీర్ దెబ్బతినకుండా చూసుకోవాలని ఇద్దరం అనుకున్నాం. కష్టపడి చదివాం. ఇవాళ నవ్విన నోళ్లే మమ్మల్ని పొగిడేలా... వింతగా చూసిన కళ్లే మెచ్చుకొనేలా... స్వశక్తితో ఎదిగి ఒక సంస్థకు అధిపతులం అయ్యాం. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నాం. 'ఇదీ మేం సాధించిన విజయం' అని గర్వంగా చెప్పుకోగలుగుతున్నాం."



> **దృక్పథం మారాలి...**
>
> మాలాంటి వారి పట్ల ఈ సమాజం దృక్పథం మారాలి. మేమూ ఈ సంఘంలో మనుషులమే. వైకల్యం ఉన్నంతమాత్రాన దూరం నెట్టడం, చులకన చేయడం దారుణం. ఎటు వెళుతున్నాం మనం? ప్రపంచం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుంటే... మనిషిలోని ప్రతిభ, సామర్థ్యాలను వదిలేసి లోపాల గురించి మాట్లాడేవారు ఇంకా ఉన్నారంటే ఆశ్చర్యంగా ఉంది. మా అబ్బాయిని తన స్నేహితుడు అడిగాడు... 'ఆంటీ ముఖానికి ఏమైంది' అని! అందుకు నేను కోపగించుకోకుండా... ఆ పిల్లాడిని కూర్చోబెట్టి, అర్థమయ్యేట్టు చెప్పాను. ఆ తరువాత ఎప్పుడూ తను ఆ ప్రస్తావన తేలేదు. నేను కోరేది ఏంటంటే... వైకల్యం ఉన్నవారిపై జాలి, దయ చూపక్కర్లేదు. ఆ చిన్నారిలా అర్థం చేసుకొని... ఒక మనిషిలా చూడండి చాలు.



మహాసంకల్పం

'మహాలక్ష్మి'... పద్దెనిమిది నెలల కాలం... రెండు వందల కోట్లమంది ప్రయాణం... మహిళల కోసం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉచిత బస్సు పథకం ఇది.
ఈ ప్రతిష్ఠాత్మక పథకం మహిళలను సాధికారత వైపు నడిపించిందంటున్నారు టీజీఎస్ఆర్టీసీ ఆర్ఎంలు... **జె.శ్రీలత**, **ఎన్.సుచరిత.**
దీనివల్ల ఆర్థిక స్థోమత లేనివారు సుదూర ప్రాంతాల్లో ఉన్న పెద్దాసుపత్రులకు కూడా వెళ్లి వైద్యం చేయించుకొనే అవకాశం లభించిందని...
ఇది శుభపరిణామమని చెబుతున్న అధికారులను 'నవ్య' పలుకరించింది.

మన 'మహాలక్ష్మి' పెద్ద హిట్

'మహాలక్ష్మి' పథకం అమల్లోకి వచ్చిన తర్వాత చికిత్సకోసం ఆస్పత్రులకు వెళ్తున్న మహిళల సంఖ్య పెరిగింది. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు ఉచిత బస్సు సౌకర్యంతో ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. ఆలయాలకు వెళ్లే వారి సంఖ్య కూడా పెరిగింది. దీంతో మహాలక్ష్మి... ఆరోగ్య లక్ష్మి... ఆనంద లక్ష్మిగా మారింది.

ఆరోగ్య లక్ష్మి.. ఆనంద లక్ష్మి..

గతంలో బస్సు చార్జీలు భరించే స్థోమత లేకపోవడంతో జిల్లా కేంద్రాలు, పట్టణాలతోపాటు హైదరాబాద్‌లో ఉండే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకునేందుకు మహిళలు వెనకాడేవారు. కానీ ఇప్పుడు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో... ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా జిల్లా కేంద్రాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పెద్దాసుపత్రులకు వెళుతున్నారు. ఇటీవల ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన సర్వేలో గతంతో పోలిస్తే ఈ ఏడాది, ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న మహిళా రోగుల సంఖ్య 31% పెరిగినట్లు తేలింది. దీనికి ప్రధాన కారణం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం. పెరిగిన మహిళా ప్రయాణికుల రద్దీకి తగ్గట్లు బస్టాండ్లలో మరుగుదొడ్లు, తాగునీరు వసతి కల్పిస్తున్నాం. భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ, సీసీ కెమెరాల ఏర్పాటు చేశాం. మహిళా భద్రతా సిబ్బందిని నియమించాం.

అరవై శాతానికి...

గతంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గరిష్టంగా 35% వరకు ఉండేది. కానీ మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య 60 శాతానికి పెరిగింది. ప్రయాణికుల రద్దీని కంట్రోల్ చేసేందుకు రద్దీ ఉన్న మార్గాల్లో బస్సు సర్వీస్‌లను పెంచాం. ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లలో బస్టాండ్ బయట ఉండేవారిని బస్టాండ్లలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. పెద్ద పెద్ద బస్టాండ్లలో మహిళా భద్రతా సిబ్బందిని పెంచాం. ఇమ్లిబన్‌లో 140 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. గతంలో సీసీ కెమెరాలు లేని పరిగి, వికారాబాద్ బస్టాండ్లలోనూ కొత్తగా సీసీ కెమెరాలు పెట్టాం. పండగలు, సెలవులు, రద్దీ సమయాల్లో జిల్లాల నుంచి బస్సులు సిటీలోకి రాకుండా వరంగల్, హన్మకొండ నుంచి వచ్చే బస్సుల్ని ఉప్పల్ నుంచి ఆపరేట్ చేస్తుంటాం. నల్లగొండ వాళ్లు ఎల్బీనగర్ నుంచి ఆపరేట్ చేస్తుంటారు. ఎల్బీనగర్, ఆరాంఘర్ ప్రాంతాల్లో మహిళా ప్రయాణికులకు సరిపడా వాష్‌రూమ్స్ సదుపాయాలు లేవు. ఏర్పాటు కోసం సంబంధిత విభాగాల అధికారులకు లేఖలు రాయడం జరిగింది. బస్టాండ్లలో మహాలక్ష్మి టాయ్‌లెట్‌లను ఏర్పాటు చేశాం. ఆర్టీసీలో సివిల్ ఇంజనీరింగ్ బడ్జెట్‌ను పెంచడం జరిగింది. బడ్జెట్ పెంపుతో అన్ని అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. దానికి అనుగుణంగా అన్ని బస్టాండ్లలో వసతులు మెరుగుపరుస్తాం.

మహిళా ప్రయాణికులు మార్గమధ్యంలో కాకుండా... సమీపంలోని బస్టాండ్ వరకు వచ్చి బస్సులు ఎక్కాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ విషయంలో జిల్లాల్లో ప్రయాణికులకు, ముఖ్యంగా మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం. కొందరు ఊర్లో బస్టాండులో బస్సు ఎక్కి... ఊరి చివర పొలాల వరకు ప్రయాణిస్తున్న విషయాల పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అలాంటి వారికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం.

పోలీస్‌లతో సమన్వయం...

పండగలు, సెలవులు, ప్రత్యేక సందర్భాల్లో బస్టాండ్లల్లో రద్దీ మరీ ఎక్కుగా ఉంటోంది. ఇలాంటి సందర్భాల్లో ఆర్టీసీతో పాటు పోలీస్ విభాగంతో సమన్వయం చేసుకుని పని చేస్తాం. ఫలితంగా బస్టాండ్లలో అనవసర ట్రాఫిక్ జామ్‌లతోపాటు ప్రయాణికుల భద్రతకు భరోసా ఉంటుంది. ఎక్కడెక్కడ రద్దీ ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని పోలీస్‌లకు వివరించి అదనపు భద్రత కోరుతున్నాం. కో-ఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లపై చర్చిస్తున్నాం. రద్దీ మార్గాల్లో బస్సుల సంఖ్యను పెంచి నడుపుతున్నాం. భవిష్యత్తులో డిమాండ్ మేరకు ఆయా మార్గాల్లో బస్సు సర్వీస్‌ల్ని మరింత పెంచుతాం. విద్యుత్ బస్సుల్ని ఎంపిక చేసిన మార్గాల్లో ఎక్కువగా తిప్పుతున్నాం.

- జె.శ్రీలత
రంగారెడ్డి జిల్లా రీజినల్ మేనేజర్ (ఆర్ఎం)

ఒకప్పుడు ప్రయాణికుల కోసం ఆర్టీసీ సిబ్బంది బస్టాండ్లలో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆర్టీసీ బస్సు కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్లుగా కొత్త బస్సులు, రద్దీ మార్గాల్లో సర్వీస్‌లను పెంచడం జరిగింది. బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో గతంలో అత్యధికంగా 68% వరకు ఉండగా ప్రస్తుతం 105%కిపైగా పెరిగింది. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా సాధికారత పెరిగింది. మహిళా చిరుద్యోగులకు ఉచిత బస్సు సదుపాయం ఎంతో ఉపయోగకరంగా ఉంది. మహిళా ప్రయాణికులతో మాట్లాడిన సమయంలో వారు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ప్రయాణికులు లేకపోవడంతో ట్రిప్పులు రద్దు చేసేవాళ్లం. ఇప్పుడు అదనపు ట్రిప్పులు వేస్తున్నాం. షటిల్ బస్సుల నిర్వహణ, స్పేర్‌లో ఉన్న బస్సుల్ని నడుపుతున్నాం. మహిళా ప్రయాణికుల రద్దీ పెరిగిన నేపథ్యంలో రద్దీ సమయాల్లో పురుష ప్రయాణికుల కోసం మెట్రోడీలక్స్ సర్వీస్‌ల్ని పెంచాం. ఈ సర్వీస్‌ల్లో మహిళలు సైతం ప్రయాణిస్తున్నారు.

ఆర్థిక పురోగతి...



రోజుకు 20 లక్షలు...

గతంతో పోలిస్తే ఇప్పుడు హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో రోజుకు 20 లక్షల మంది ప్రయాణికులు పెరిగారు. గతంలో ఆటోలు, మెట్రోలు, ఇతర రవాణా మార్గాల్లో ప్రయాణించే వారు ఇప్పుడు ఆర్టీసీ ప్రయాణానికే ఆసక్తి చూపిస్తున్నారు. బస్సు ప్రయాణం సురక్షితం కావడంతో ఇటువైపు ప్రయాణికులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కేవలం అక్కడి వరకే పరిమితం చేసి చూడాల్సిన అంశం కాదు. దీనివల్ల ఆర్థిక పురోగతి ఏర్పడింది. మహిళలు ముఖ్యంగా గృహిణులు ఆలయాల సందర్శనకు వెళ్తున్నారు. దాంతో స్థానికంగా ఉండే చిరు వ్యాపారులకు ఆదాయం పెరిగింది. కొందరు ఉచిత బస్సు సౌకర్యం ఉండటంతో కొత్తగా చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించారు. ఇలా అనేక రకాలుగా ఉచిత బస్సు ప్రయాణం నిరుపేద, పేద కుటుంబాలకు ఆర్థికంగా ఆసరాగా మారింది. సమాజాభివృద్ధిలో మహాలక్ష్మి పథకం ఎంతో కీలకంగా మారింది.

టాయ్‌లెట్ బ్లాక్స్...

ఏడాదిన్నర కాలంలో మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. దీంతో అప్పుడు మహిళా ప్రయాణికుల్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించిన టాయ్‌లెట్స్ ఇప్పుడు ఏ మాత్రం సరిపోని పరిస్థితి. దీంతో అన్ని బస్టాండ్లలో మహాలక్ష్మి టాయ్‌లెట్ బ్లాక్స్ ఏర్పాటు చేస్తున్నాం. పనులు ముగించుకుని ఇంటికి తిరిగివెళ్లే సమయాల్లో రాత్రివేళ బస్టాండ్లలో మహిళా ప్రయాణికుల కోసం... విద్యుత్ దీపాల సదుపాయం మెరుగుపర్చడంతో పాటు సీసీ కెమెరాల సంఖ్య పెంచాం.

- ఎన్.సుచరిత,
సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్

• యస్.సోమేశ్వర్

ఊబకాయానికి ఇది కూడా కారణమే!

ప్రతి రోజూ పంచుకునే భోజన పద్ధతులు, దినచర్యలూ... ఆరోగ్యాన్నీ, శరీర బరువునూ ప్రభావితం చేస్తున్నట్టు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) తాజా అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనంలోనే ఊబకాయ పరిష్కార మార్గాలను కూడా ఐసీఎంఆర్ సూచించింది. ఆ వివరాలు తెలుసుకుందాం!



సాధారణంగా మన ఇళ్లలో ఇంటి మొత్తానికీ కలిపి వంట చేస్తారు. కుటుంబసభ్యుల్లో ఎవరికి వారికంటూ ప్రత్యేకమైన వంట నియమాలేవీ ఉండవు. పోషకాల అవసరతల ఆధారంగా వంటలు వండే విధానాలు అంతకంటే ఉండవు. ప్రధానంగా అన్నం, నూనెలో వేయించిన వేపుళ్లు, కూరలు, తీపి పదార్థాలతోనే మన భోజనం పూర్తవుతూ ఉంటుంది. ఇలా అందరికీ ఒకే భోజనం అలవాటు వల్ల, కుటుంబసభ్యుల్లో ఎవరికి వారికి వాళ్ల వయసుకూ, శారీరక శ్రమలకూ అవసరమైన పోషకాలు అందకపోవచ్చు. ప్రత్యేకించి మహిళలు కుటుంబంలో ఎక్కువ పోషకలోపానికి లోనవుతూ ఉంటారు. కుటుంబం తిన్న తర్వాత భోంచేసే అలవాటుతో పోషకాల లోపానికి గురయ్యే ఇలాంటి మహిళలతో పాటు, దేన్నీ మిగల్చకూడదనే ఉద్దేశంతో మిగిలినవన్నీ తినేయడం వల్ల తేలికగా ఊబకాయం బారిన పడే మహిళలూ ఉంటారు.

వంటపని పంచుకుంటూ...

కలిసి పంచుకునే భోజన అలవాట్లతో, ఒబేసిటీ, హైపర్ టెన్షన్, టైప్2 మధుమేహం, గుండెజబ్బులతో పాటు పునరుత్పత్తి సమస్యలను కూడా కలిసి పంచుకునే ముప్పు పొంచి ఉంటుందంటున్నారు వైద్యులు. తెలియకుండానే పోషకలోపాలతో కూడిన అనారోగ్యకరమైన ఆహారపుటలవాట్లనూ, ఎక్కువ సమయాల పాటు కదలకుండా కూర్చునే సెడెంటరీ జీవనవిధానాన్నీ దంపతులు కలిసి పంచుకుంటూ ఉంటారు. దాంతో జీవనశైలి సంబంధిత రుగ్మతలు ఇద్దర్నీ ఏకకాలంలో వెంటాడుతూ ఉంటాయి. నిజానికి ఆరోగ్యకరమైన వంటకాలను వండుకోవడం శ్రమతో కూడుకున్న వ్యవహారం కానే కాదు. భార్యలు తామొక్కరే వంటగదిలో శ్రమపడుతున్నట్టు చెప్తూ ఉంటారే తప్ప, వంటపనిలో భర్త, పిల్లల సహాయాన్ని తీసుకోడానికి మాత్రం ముందుకు రారు. వంట తన సొత్తే అన్నట్టు, వంటగది తన సామ్రాజ్యం అన్నట్టు వ్యవహరించకుండా వంటపనిలో భర్త, పిల్లల సహాయం తీసుకోగలిగితే పని తేలికవడంతో పాటు, పోషక ప్రాధాన్యతలతో వంటలను వండుకునే వెసులుబాటు చిక్కుతుంది. అలాగే దంపతులిద్దరూ భోజనాలను వండుకుంటున్న విధానం మీద కూడా దృష్టి పెట్టాలి. తోచింది వండుకుని తినేయడం కాకుండా, అదనపు క్యాలరీలు దరి చేరకుండా తక్కువ నూనెతో, పోషకాలు నష్టపోకుండా వండుకునే విధానాలను నేర్చుకోవాలి. తక్కువ క్యాలరీలను అందించే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి. అన్నం బదులు మిల్లెట్స్ తినడం, వేపుళ్లకు బదులు ఆవిరి మీద మగ్గించిన కూరగాయ ముక్కలు తినడం లాంటి అలవాట్లు అలవరుచుకోవాలి. అలాగే పప్పు, కూరగాయలను విడిగా ఉడికించుకుని ఎవరి అవసరతలకు తగ్గట్టుగా కారం, ఉప్పు, నూనెలను జోడించుకోవచ్చు.

నియమనిబద్ధతలతో...

సగం కంచం కూరగాయలతో, పావు కంచం పొట్టుతీయని ధాన్యాలు, మిగతా పావు కంచం ప్రొటీన్‌తో నింపుకోవడం మొదలుపెట్టాలి. ఆకుకూరలు, పులిసిన పదార్థాలు, స్థానిక ధాన్యాలతో కూడిన సంప్రదాయ వంటకాలకు పెద్ద పీట వేయగలిగితే దంపతులిద్దరితో పాటు వారి పిల్లల ఆరోగ్యం కూడా భేషుగ్గా ఉంటుంది. అలాగే కుటుంబమంతా కలిసి బయటి ఆహారానికి బదులుగా ఇంటి భోజనానికే కట్టుబడి ఉండాలనే నియమాలు కూడా ఆచరించాలి. రాత్రివేళ ఆలస్యంగా భోజనం చేయడం, టివి ముందు కూర్చుని చిరుతిళ్లు తినడం లాంటి అలవాట్లకు స్వస్తి చెప్పాలి. అలాగే దైనందిన జీవితంలో వ్యాయామానికి తప్పనిసరిగా చోటు కల్పించాలి.

• గోగుమళ్ల కవిత

> **కుటుంబ సమస్య**
>
> ముందు రెండు టైర్లూ ఒకే వైపు ప్రయాణిస్తేనే కారు క్షేమంగా గమ్యానికి చేరుకోగలుగుతుంది. ఒక టైరు ఒక దిక్కుకూ, మరో టైరు మరో దిక్కుకూ ప్రయాణిస్తే గమ్యం చేరుకోలేకపోగా, ప్రమాదానికి గురయ్యే అవకాశాలుంటాయి. ఇదే సూత్రం కుటుంబానికీ వర్తిస్తుంది. ఒబేసిటీ వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు. ఇది కుటుంబ సమస్య. కుటుంబంలో ఒకరు ఒబేసిటీతో బాధపడుతున్నారంటే ఆ కుటుంబమంతా ఆ సమస్య ప్రభావానికి లోనవుతుందని అర్థం. మునుపు దంపతుల్లో ఒకరు ఒబేసిటీతో ఆస్పత్రులకు వస్తూ ఉండేవారు. కానీ ఇప్పుడు అదే సమస్యతో దంపతులిద్దరూ ఆస్పత్రులకు వస్తున్న సందర్భాలు పెరిగిపోయాయి. అందరూ ఒకే రకమైన అనారోగ్యకరమైన ఆహారశైలిని అనుసరించడమే ఇందుకు కారణం. ఇంటి భోజనంలో నూనెల వాడకం పెరగడంతో పాటు, ప్రతి ఇంట్లో అస్తవ్యస్థ ఆహారపుటలవాట్లు పెరిగిపోయాయి. స్విగ్గీలు, జొమాటోలతో కోరుకున్న ఆహారం ఇంటికే చేరుతోంది. దీనికి తోడు వ్యాయామ లోపం. వెరసి ప్రతి ఇంట్లో స్థూలకాయం కనిపిస్తోంది. దంపతులే కాదు పిల్లలు కూడా స్థూలకాయులవుతున్నారు. ఆహార నియమాలు, వ్యాయామాలతో ఈ సమస్యను చాలావరకూ అదుపులోకి తెచ్చుకోవచ్చు. పోషక లక్ష్యాలకు తగ్గట్టుగా ఇంటి భోజనంలో మార్పులు చేసుకోవడం, దైనందిన జీవితంలో వ్యాయామానికి చోటు కల్పించడం ద్వారా ఊబకాయాన్ని అదుపులో పెట్టుకోవచ్చు. అయినప్పటికీ స్థూలకాయాన్ని తగ్గించుకోలేని వారు మాత్రమే అంతిమంగా బేరియాట్రిక్ సర్జరీని ఆశ్రయించాల్సి ఉంటుంది. ఊబకాయంతో పాటు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సంబంధిత రుగ్మతలన్నీ అదుపులోకి తీసుకురావడమే తాజా బేరియాట్రిక్ అండ్ మెటబాలిక్ సర్జరీ లక్ష్యం. సర్జరీ తదనంతర ఫలితాలు మరింత మెరుగ్గా ఉండడం కోసం, ఆహార, వ్యాయామ నియమాలూ తప్పక అనుసరించాల్సి ఉంటుంది.
>
> 
>
> **డాక్టర్ ఎన్. సుబ్రహ్మణ్యేశ్వర బాబు,**
> సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, అపోలో హాస్పిటల్స్, సికింద్రాబాద్.


ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
వరంగల్ ● గురువారం 24 జూలై 2025

మూడో షెడ్యూల్ ముగించారు




చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రం ('మెగా 157' వర్కింగ్ టైటిల్) షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ సినిమా షూట్ గురించి అప్‌డేట్ ఇచ్చారు అనిల్ రావిపూడి. 'మన శంకరవరప్రసాద్ గారు' కేరళ షెడ్యూల్‌ను పూర్తి చేశారు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అలాగే, విమానాశ్రయంలో చిరంజీవితో కలసి తీసుకున్న వీడియోను షేర్ చేశారు. చిరంజీవి సినిమాల్లోకి రాకముందు ఉన్న ఈ పేరును అనిల్ రావిపూడి వాడడంతో సినిమా టైటిల్ ఇదే అయ్యుండొచ్చని అంతా అనుకుంటున్నారు. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతారపై డ్యూయెట్‌తో పాటు కొంత టాకీపార్ట్ చిత్రీకరించారు. వచ్చే ఏడాది సంక్రాంతికి 'మెగా 157' ప్రేక్షకుల ముందుకు రానుంది. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు.

మాస్ లుక్‌తో మెప్పించేందుకు



వాణిజ్య హంగులతో పాటు తనలోని నటనా కౌశలాన్ని వెలికితెచ్చే పాత్రలతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు హీరో సూర్య. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'కరుప్పు'. ఆర్జే బాలాజీ దర్శకుడు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్. ప్రభు నిర్మిస్తున్నారు. త్రిష కథానాయిక. బుధవారం సూర్య పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. పవర్‌ఫుల్ లుక్, పవర్‌ప్యాక్డ్ యాక్షన్‌తో సూర్యను పరిచయం చేసిన తీరు ఆకట్టుకుంది. ఈ ప్రచార చిత్రాన్ని తీర్చిదిద్దిన తీరును బట్టి ఇదొక భిన్నమైన యాక్షన్ థ్రిల్లర్ అని అర్థమవుతోంది. ఈ చిత్రానికి సంగీతం: సాయి అభ్యంకర్, సినిమాటోగ్రఫీ: జీకే విష్ణు

రానాకు మరోసారి ఈడీ నోటీసులు



బెట్టింగ్ యాప్‌ల కేసులో నటుడు దగ్గుబాటి రానాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇదివరకు నోటీసు జారీ చేసిన సమయంలో వేరే ప్రాంతంలో సినిమా షూటింగ్‌లో ఉన్నందున విచారణకు రాలేనంటూ ఆయన ఈడీ అధికారులకు తెలిపారు. వచ్చే నెల 11న ఈడీ కార్యాలయంలో విచారణకు తప్పకుండా హాజరుకావాలని తాజా నోటీసులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి నటులు ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మికి సైతం ఈడీ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ అధికారులు.. 28 మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, యూట్యూబర్లు, సినీ నటులు, కొన్ని బెట్టింగ్ కంపెనీలపై ఈసీఐఆర్ నమోదు చేశారు. మనీ లాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు విచారణ జరుపుతున్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌కు సంబంధించిన డబ్బు ఏ విధంగా అందిందనే విషయంపై ఆరా తీస్తున్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)



గబ్బర్‌సింగ్ వంటి హిట్ ఇవ్వండి

పవన్ కల్యాణ్

'ప్రతిసారి అన్నా... ఒక్క హిట్ అంటూ అడుగుతుంటారు. తొలిసారి అభిమానుల కోసం 'హరిహర వీరమల్లు' సినిమాకు గబ్బర్‌సింగ్ లాంటి హిట్ అవ్వాలని కోరుకుంటున్నా. నటనలో ఓనమాలు దిద్దిన విశాఖ నేల నుంచి భగవంతుడిని, సరస్వతీదేవిని మీరంతా ఆనందించే హిట్ ఇవ్వాలని కోరుకుంటున్నా' అని చిత్ర హీరో, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. 'హరిహర వీరమల్లు' సినిమా గురువారం విడుదల కాబోతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సాధారణంగా తన సినిమాలు ఎప్పుడూ రికార్డులు సృష్టిస్తాయని, బ్లాక్ బ్లస్టర్ అవుతుందని చెప్పనన్నారు. అయితే, అభిమానుల కోసం ఈ సినిమా హిట్ కావాలని సరస్వతీదేవిని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. కృష్ణుడిని తాను నమ్ముతానని, కర్మ చెయ్ ఫలితం భగవంతుడికి వదిలేయ్ అన్న సిద్ధాంతాన్ని బలంగా విశ్వసిస్తానన్నారు. సత్ఫలితాన్ని ఇవ్వాలని భగవంతుడిని కోరుకుంటున్నట్టు వెల్లడించారు. అందరి హీరోల సినిమాలకు మాదిరిగానే తన సినిమాకు టికెట్ రేటు పెంచుకునేందుకు అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడుకు ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. సినిమా హిట్ కావాలని ఆకాంక్షిస్తూ ట్వీట్ చేసిన మంత్రి నారా లోకేశ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రెండేళ్ల కిందట నోవాటెల్ హోటల్ నుంచి బయటకు రాకుండా ఇబ్బందులకు గురిచేశారని, పోలీసు అధికారులు కాలిబూట్లతో తన్ని అరెస్టు చేయాలని చూస్తే నగరవాసులంతా హోటల్ ముందుకువచ్చి కూర్చున్న విషయాన్ని ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. అంత బలమైన జ్ఞాపకాన్ని విశాఖ తనకు ఇచ్చిందని, అందుకే ఈ ప్రోగ్రామ్‌ను ప్రత్యేకించి ఇక్కడే పెట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు. విశాఖలో సత్యానంద్ మాస్టారు వద్ద నటన నేర్చుకునేందుకు చేరానని, అలా నగరంతో తనకు అనుబంధం ఏర్పడిందన్నారు. సత్యానంద్ మాస్టారు తనకు ఉత్తరాంధ్ర ఆట, పాటను గుండెల్లో అణువణువూ నింపేశారన్నారు. చిన్నప్పటి నుంచి తనకు పెద్దగా ఏమీ లక్ష్యాలు లేవని, తాను ఏమైపోతానన్న భయంతో అన్నయ్య చిరంజీవి సినిమాల వైపు పంపించారన్నారు. అన్యాయం జరిగితే ఎదురుదాడి చేయడం, సహాయం చేయాలన్న లక్షణాలే చిన్నప్పటి నుంచి తనకు అలవాటయ్యాయన్నారు. విశాఖతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తన గురించి మాట్లాడే వాళ్లంతా బావిలో కప్పలని విమర్శించారు.



1996లో తన తొలి చిత్రం వచ్చిందని, వచ్చే ఏడాదికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నానని పవన్ వెల్లడించారు. నియంత పోకడలు ఉన్న ప్రభుత్వాన్ని ఎదుర్కొనే శక్తిని సినిమాలు, అభిమానులే తనకు ఇచ్చాయన్నారు. సినిమాకు కులం, మతం, ప్రాంతం భేదాలు ఉండవన్నారు. ఈ సినిమాలో దేశంలోని అనేక రాష్ట్రాలు, మతాలకు చెందిన నటీనటులు నటించారన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి లేకపోతే ఈ సినిమా లేదన్నారు. సాధారణంగా సినిమాలు ఎంటర్‌టైన్‌మెంట్ కోసం చూస్తుంటారని, తన సినిమాలు ఎంటర్‌టైన్‌మెంట్‌తోపాటు ఎడ్యుకేట్ చేయాలని భావిస్తుంటానన్నారు. సనాతన ధర్మం అంటే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని, అందరినీ కలుపుకునిపోయేదన్నారు. కార్యక్రమంలో హీరోయిన్ నిధి అగర్వాల్, సంగీత దర్శకుడు కీరవాణి, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానంద్ మాస్టారు, సంగీత దర్శకుడు కీరవాణిలను పవన్ కల్యాణ్ సత్కరించారు.

ఇంట్లో వాళ్లు వేధిస్తున్నారు



తనుశ్రీ దత్తా


మీ టూ అంటూ ఏడేళ్ల క్రితం బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన హీరోయిన్ తనుశ్రీ దత్తా, మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఏడుస్తూ పోస్ట్ చేసిన వీడియో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అందులో తనను ఇంట్లో వాళ్లే వేధిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. "నా ఇంట్లోనే నేను వేధింపులకు గురవుతున్నాను. ఈ విషయంపై పోలీసులను సంప్రదించా. స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయమన్నారు. కానీ నా ఆరోగ్యం సహకరించట్లేదు. రేపో, ఎల్లుండో కుదుటపడ్డాక వెళ్తా. ఇంట్లో పని మనుషులు నా మాట వినరు. ఇంట్లోని వస్తువులను దొంగలిస్తుంటారు కూడా. నా పనులన్నీ నేనే చేసుకోవాల్సి వస్తోంది. నేను ఈ వేధింపులను తట్టుకోలేకున్నా.. ఇది 2018 మీ టూ సమయం నుంచి జరుగుతున్నాయి. వీటి వల్ల నా ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. పరిస్థితి చేయిదాటక ముందే ఎవరో ఒకరు నన్ను రక్షించండి" అని పేర్కొన్నారు. కాగా, 2018లో మీ టూ ఉద్యమం సమయంలో నటుడు నానా పటేకర్ తనతో అసభ్యంగా ప్రవర్తించారని, అలాగే దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి తనను ఓ సందర్భంలో వేధించారంటూ తనుశ్రీ దత్తా ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన 'వీరభద్ర' సినిమాలో తనుశ్రీ దత్తా నటించారు.

3 నెలలు.. 8 సినిమాలు.. రూ.1100 కోట్లు!





బాలీవుడ్ బాక్సాఫీసు ఇప్పుడు కలెక్షన్లతో కళకళలాడుతోంది. సరైన హిట్ లేకపోవడం, దక్షిణాది సినిమా తొడ కొట్టి వరుస విజయాలు సాధించడం, అగ్ర హీరోలు సైతం తమ ఉనికి చాటుకోవడానికి ఇబ్బంది పడుతుండడం.. ఇత్యాది కారణాల వల్ల నీరసించి పోయిన హిందీ సినిమా ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటోంది. ముఖ్యంగా మూడు నెలల నుంచి వస్తున్న వరుస విజయాలు బాలీవుడ్‌కి కొత్త జోష్ నిచ్చాయి. ఈ తొంభై రోజుల్లో విడుదలైన ఏడు సినిమాలు ప్రజాదరణతో దూసుకుపోతుండడం, తాజాగా 'సైయారా' చిత్రం విడుదలైన ఐదు రోజుల్లో రూ. 150 కోట్లు వసూలు చేయడం.. బాలీవుడ్ శుభ సూచకంగా భావిస్తోంది. 'కొవిడ్'కు పూర్వం ఉన్న పరిస్థితులు మళ్లీ తిరిగొచ్చాయని సంబరపడుతోంది. 'జాట్', 'కేసరి 2', 'రైడ్ 2', 'హౌస్‌ఫుల్ 5', 'సితారే జమీన్ పర్', 'మా', 'మెట్రో ఇన్ డినో', 'సైయారా'... ఈ ఎనిమిది సినిమాలు ఇప్పటి వరకూ వసూలు చేసిన మొత్తం ఎంతో తెలుసా?.. రూ. 1150 కోట్లు. వీటిల్లో 'హౌస్‌ఫుల్ 5', 'సితారే జమీన్ పర్, రైడ్ 2' చిత్రాలు ఒక్కొక్కటీ రూ. 165 కోట్లు వసూలు చేశాయి. ఇక తెలుగు నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీస్, పీపుల్ మీడియా సంయుక్తంగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో నిర్మించిన 'జాట్' చిత్రం, జలియన్‌వాలా బాగ్ హత్యాకాండకు వ్యతిరేకంగా పోరాటం చేసిన న్యాయవాది శంకరన్ నాయర్ జీవిత కథ ఆధారంగా రూపొందిన 'కేసరి 2' చిత్రం రూ. 90 కోట్ల చొప్పున వసూలు చేసి పరవాలేదనిపించుకున్నాయి. అనురాగ్ బసు రూపొందించిన 'మెట్రో ఇన్ డినో' రూ. 52 కోట్లు, తన భార్య కాజోల్ ప్రధాన పాత్రధారణిగా అజయ్ దేవగణ్ నిర్మించిన 'మా' చిత్రం రూ. 35 కోట్లు వసూలు చేసి సరిపెట్టుకున్నాయి.



దూసుకుపోతున్న 'సైయారా'

ఈ చిత్రాలన్నీ ఒక ఎత్తయితే 'సైయారా' సినిమా విజయం మరో ఎత్తు అని సినీ పండితులు పేర్కొంటున్నారు. ఇప్పుడున్న హారర్, యాక్షన్ ట్రెండ్‌లో ఈ రొమాంటిక్ సెన్సిబుల్ లవ్‌స్టోరీని ఎవరు చూస్తారని హేళనగా మాట్లాడిన వారే 'సైయారా' చిత్రం కలెక్షన్లు చూసి నివ్వెర పోతున్నారు. కుర్రకారుతో థియేటర్లు నిండిపోతున్నాయి. సినిమా చూసి యువతరం ఎంజాయ్ చేస్తోంది. చిత్రంలో నటించిన కొత్త జంట అహాన్ పాండే, అనీత్ పడ్డా మధ్య కెమిస్ట్రీ కుదిరిందని ఆడియన్స్ కితాబు ఇచ్చేస్తున్నారు. నిజంగా 'సైయారా' చిత్ర విజయం ఓ అద్భుతం అనే చెప్పాలి. ఎందుకంటే దర్శకుడు మోహిత్ సూరి ఈ కథను పట్టుకుని చాలా మంది నిర్మాతల చుట్టూ తిరిగారు. ఎవరూ ముందుకు రాలేదు. చివరకు అక్షయ్ విధాని అనే నిర్మాత సినిమా తీయడానికి అంగీకరించారు. అయితే అతను వర్ధమాన నిర్మాత. ఆర్థిక వనరులు అంతంత మాత్రమే. పైగా డిస్ట్రిబ్యూటర్స్ సపోర్ట్ లేదు. అవి రెండూ లేకుండా సినిమా తీయడం కష్టమని భావించిన దర్శకుడు మోహిత్ సూరి యశ్ రాజ్ ఫిల్మ్ అధినేత ఆదిత్య చోప్రాను కలిశారు. సాయం చేయమని అభ్యర్థించారు. 'ఆషికి 2' చిత్రం ఛాయలు కొన్ని కనిపించినప్పటికీ ఇప్పటి యూత్ ఆడియన్స్ మిస్ అవుతున్న మ్యూజిక్, సెన్సిబుల్ లవ్ 'సైయారా'లో ఉన్నాయని, బాగా తీస్తే ఆడియన్స్ కనెక్ట్ అవుతారని ఆదిత్య చోప్రాకు అనిపించింది. అందుకే తను అండగా ఉంటానని మాట ఇవ్వడంతో మోహిత్ సూరి పంట పండినట్లయింది. చివరకు ఆదిత్య చోప్రా నమ్మకమే నిజమైంది. 'సైయారా' చిత్రం చూసి థియేటర్లలో యువతరం ఊగిపోతోంది. వారం తిరగకుండానే ఓ చిన్న సినిమా రూ. 150 కోట్లు వసూలు చేసిందంటే ఫుల్ రన్‌లో రూ. 500 కోట్లు వసూలు చేయడం ఖాయం అంటున్నారు ట్రేడ్ పండితులు. 'సైయారా' కు వస్తున్న రెస్పాన్స్ చూసి ఖుష్ అయిన ఆదిత్య చోప్రా 'వార్ 2' చిత్రం వచ్చే వరకూ ఈ సినిమాను కంటిన్యూ చేయమని తన పంపిణీదారులకు ఆదేశాలు జారీ చేయడం విశేషం.

మింత్రాపై ఫెమా కేసు నమోదు చేసిన ఈడీ

న్యూఢిల్లీ: ఫ్లిప్‌కార్ట్ అనుబంధ సంస్థ మింత్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసింది. ఈ సంస్థ విదేశీమారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనలకు విరుద్ధంగా విదేశాల నుంచి రూ.1,654 కోట్లకు పైగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సమీకరించిందని అభియోగం మోపింది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా మింత్రాపై ఈ కేసు నమోదు చేసినట్టు ఈడీ తెలిపింది. హోల్‌సేల్ కాష్ అండ్ కారీ' ముసుగులో మింత్రా, దాని అనుబంధ సంస్థలు మల్టీ బ్రాండ్ రిటైల్ వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించింది. ఇలా చేయడం ఎఫ్‌డీఐ నిబంధనలతో పాటు,ఫెమా నిబంధనలకూ వ్యతిరేకమని తెలిపింది. ఎఫ్‌డీఐ, ఫెమా నిబంధనలను తుంగలో తొక్కేందుకు మింత్రా తన వస్తువుల్లో ఎక్కువ భాగాన్ని, తనకే చెందిన విక్టర్ ఇ-కామర్స్ అనే కంపెనీకి విక్రయించి, దాని ద్వారా రిటైల్ అమ్మకాలు జరుపుతోందని అభియోగ పత్రంలో ఈడీ పేర్కొంది. ఈ కేసు దర్యాప్తులో ఈడీకి పూర్తిగా సహకరిస్తామని మింత్రా ఒక ప్రకటనలో తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	475
వరంగల్	452	గోదావరి	475
చిత్తూరు	523	విశాఖపట్నం	485
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్


హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	109
కర్నూలు	115	నెల్లూరు	114
విశాఖపట్నం	97	అనంతపురం	114
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,330 ▲	93,800 ▲	1,29,000 ▲
విజయవాడ	1,03,750 ▲	97,000 ▲	1,19,400 ▲
విశాఖపట్నం	1,02,650 ▼	93,800 ▲	1,29,000 ▲
రాజమండ్రి	1,02,330 ▲	93,800 ▲	1,19,000 ▲
ప్రొద్దుటూరు	99,750 ▲	91,770 ▲	1,11,780 ▲
ముంబై	1,00,530 ▲	92,090 ▲	1,15,850 ▲

డాక్టర్ రెడ్డీస్ లాభం
రూ.1,410 కోట్లు

11% వృద్ధితో రూ.8,545 కోట్లకు ఆదాయం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ త్రైమాసికానికి హైదరాబాద్‌కు చెందిన ఔషధాల తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ రూ.1,410 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.1,392 కోట్ల లాభంతో పోలిస్తే కేవలం 1.4 శాతం వృద్ధిని కనబరిచింది. ఐరోపా, భారత మార్కెట్లలో మెరుగైన వ్యాపార వృద్ధి ఇందుకు దోహదపడింది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఏకీకృత ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11.3 శాతం పెరిగి రూ.8,545 కోట్లకు చేరింది. 2024-25లో ఇదే త్రైమాసికానికి ఆదాయం రూ.7,673 కోట్లుగా నమోదైంది.

"జూన్ త్రైమాసికంలో కంపెనీ రెండంకెల వృద్ధిని కనబరిచింది. బ్రాండెడ్ మార్కెట్లో మా బలాన్ని, నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ పోర్ట్‌ఫోలియో సానుకూల వృద్ధిని ఇది ప్రతిబింబిస్తోంది" అని డాక్టర్ రెడ్డీస్ కోచైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ అన్నారు. అయితే, అమెరికా జనరిక్ మార్కెట్లో మల్టిపుల్ మైలోమా చికిత్స కోసం ఉపయోగించే లెనాలిడోమైడ్ ఔషధ ధరలపై ఒత్తిడి తీవ్రతరం కానుందన్నారు. ప్రస్తుతం పైప్‌లైన్‌లో ఉన్న ఉత్పత్తులను అందించడం, ఉత్పాదకత పెంపు, వ్యాపారాభివృద్ధి ద్వారా కంపెనీకి మూలాధారమైన వ్యాపారాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించామని ప్రసాద్ పేర్కొన్నారు. మరిన్ని విషయాలు..

- క్యూ1లో కంపెనీ గ్లోబల్ జనరిక్స్ వ్యాపారం వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగి రూ.7,560 కోట్లుగా నమోదైంది.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ అమెరికా మార్కెట్లో 5 కొత్త ఔషధాలను విడుదల చేసింది. అలాగే, మరో కొత్త ఔషధం విడుదల కోసం యూఎస్ఎఫ్‌డీఏకు దరఖాస్తు చేసుకుంది.
- బీఎస్ఈలో బుధవారం ట్రేడింగ్ ముగిసేసరికి డాక్టర్ రెడ్డీస్ షేరు 0.58 శాతం పెరిగి రూ.1,247.55 వద్ద స్థిరపడింది.

దక్షిణాఫ్రికా కంపెనీపై నాట్కో ఆసక్తి

36 శాతం వాటా కొనుగోలుకు ఆఫర్

రూ.2,100 కోట్లు చెల్లించేందుకు రెడీ

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే నాట్కో ఫార్మా వ్యాపార విస్తరణ చేపట్టింది. ఇందులో భాగంగా దక్షిణాఫ్రికాకు చెందిన ఫార్మా కంపెనీ యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ హోల్డింగ్స్ ఈక్విటీలో 36 శాతం మైనారిటీ వాటా కొనుగోలు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందుకోసం యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ వాటాదారులకు ఒక్కో షేరుకు 4.27 డాలర్ల చొప్పున 22.6 కోట్ల డాలర్లు (సుమారు రూ.2,100 కోట్లు) చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది. వాటాదారులు ఇందుకు అంగీకరిస్తే యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ ఈక్విటీలో నాట్కో ఫార్మాకు 35.75 వాటా లభిస్తుంది. నాట్కో ఫార్మాకు ఇప్పటికే ఈ కంపెనీ ఈక్విటీలో 0.8 శాతం వాటా ఉంది. అన్ని అనుమతులు లభిస్తే నాలుగు నెలల్లో ఈ లావాదేవీ పూర్తవుతుందని భావిస్తున్నారు.

దక్షిణాఫ్రికా మార్కెట్‌లోకి ఎంట్రీ: ఫార్మా మార్కెట్ పరంగా చూస్తే ఆఫ్రికా ఖండంలో దక్షిణాఫ్రికా అతి పెద్ద మార్కెట్. ఈ మార్కెట్‌లో యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ కంపెనీకి మంచి పట్టుంది. యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ ఈక్విటీలో 36 శాతం కొనుగోలు చేయడం ద్వారా దక్షిణాఫ్రికాతో పాటు మిగతా ఆఫ్రికా దేశాల్లోనూ పట్టు పెంచుకునే అవకాశం ఉంటుందని నాట్కో ఫార్మా సీఈఓ, వైస్ చైర్మన్ రాజీవ్ నన్నపనేని చెప్పారు. నాట్కో ఫార్మా వంటి దిగ్గజంతో జట్టు కట్టడం తమకూ మేలు చేస్తుందని భావిస్తున్నట్టు యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ సీఈఓ ఆండ్రూ హాల్ తెలిపారు. దీని వల్ల మరింత చౌకగా తమ ఔషధాలు అందించగలుగుతామన్నారు. పైగా నాట్కో కంపెనీ 36 శాతం వాటా కోసం ఆఫర్ చేస్తున్న ధర, మార్కెట్ ధర కంటే ఎక్కువగా ఉన్నందున మైనారిటీ వాటాదారులకూ మేలు జరుగుతుందన్నారు.

బీమా సంస్థలకు అంతర్గత అంబుడ్స్‌మన్

ఐఆర్‌డీఏఐ ప్రతిపాదన

న్యూఢిల్లీ: రూ.50 లక్షల వరకు క్లెయిమ్‌లకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు బీమా సంస్థలకు అంతర్గత అంబుడ్స్‌మన్‌ను నియమించాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ప్రతిపాదించింది. రీఇన్సూరెన్స్ సంస్థలు మినహాయించి, మూడేళ్లకు పైగా కార్యకలాపాలు సాగిస్తున్న అన్ని బీమా కంపెనీలకు ఇది వర్తిస్తుందని ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది. బీమా సంస్థలు ఒకరికి పైగా అంతర్గత అంబుడ్స్‌మన్‌లను నియమించుకోవచ్చని కూడా తెలిపింది. తాజా ప్రతిపాదనలపై ఆగస్టు 17లోగా ప్రజాభిప్రాయాలను కోరింది.

హెరిటేజ్ ఫుడ్స్ నుంచి లివో యోగర్ట్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డెయిరీ దిగ్గజం హెరిటేజ్ ఫుడ్స్ ఆరోగ్య చైతన్యం అధికంగా గల యువతనుద్దేశించి లివో యోగర్ట్‌ను మార్కెట్లోకి తెచ్చింది. నిరంతరం ఎక్కడో అక్కడికి తిరుగుతూ మెరుగైన స్నాకింగ్ ప్రత్యామ్నాయం కావాలనుకునే యువతకు ఇది చక్కని, రుచికరమైన ఆహారమని కంపెనీ తెలిపింది. మంచి ఫ్లేవర్, పోషకాహార విలువలు, సౌకర్యవంతం అయిన ఈ యోగర్ట్ రిటైలింగ్ దిగ్గజాలైన విజేత, రత్నదీప్‌లలో అందుబాటులో ఉంటుంది. 90 గ్రాముల కప్పు విలువ రూ.30గా నిర్ణయించారు. క్లాసిక్ వేరియెంట్ ధర రూ.40. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, మామిడి ఫ్లేవర్లలో ఇది లభిస్తుంది.

అపోలో హాస్పిటల్స్‌తో సీమెన్స్ జట్టు

న్యూఢిల్లీ: కాలేయ సంరక్షణలో ఆధునిక ఆవిష్కరణల కోసం అపోలో హాస్పిటల్స్‌తో సీమెన్స్ హెల్తినీర్స్ జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యంలో భాగంగా క్వాంటిటేటివ్ అల్ట్రాసౌండ్ ఇమేజింగ్ నుంచి ఏఐ ఆధారిత క్లినికల్ సొల్యూషన్స్ వరకు పలు అంశాల్లో పరిశోధనలు చేపట్టనున్నట్లు ఇరు కంపెనీలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి.

సానుకూల సంకేతాలతో
మార్కెట్ దూకుడు

540 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: అమెరికా, జపాన్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం వార్తలతో ఆసియా మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాల నడుమ బుధవారం మన ఈక్విటీ మార్కెట్ దూకుడు ప్రదర్శించింది. బ్యాంకింగ్, ఆయిల్ రంగాల షేర్లలో విలువ ఆధారిత కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ 539.83 పాయింట్లు లాభపడి 82,726.64 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 599.62 పాయింట్ల లాభంతో 82,786.43ని తాకింది. నిఫ్టీ 159 పాయింట్ల లాభంతో 25,219.90 వద్ద క్లోజయింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు ఒక దశలో 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకినా చివరికి 1 శాతం లాభంతో ముగిశాయి.

- లక్ష్మీ ఇండియా ఫైనాన్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 29న ప్రారంభమై 31న ముగుస్తుంది. షేరు ధర శ్రేణిని రూ.150-158గా కంపెనీ ప్రకటించింది.

ఎస్‌బీఐ క్యూఐపీ సూపర్ హిట్

ముంబై: ఎస్‌బీఐ జారీ చేసిన క్యూఐపీ సూపర్ డూపర్ హిట్టయింది. ఇష్యూ ప్రారంభమైన తొలి రోజే నాలుగింతలకుపైగా సబ్‌స్క్రైబ్ అయింది. ఈ క్యూఐపీ ద్వారా రూ.25,000 కోట్లు సమీకరించాలని ఎస్‌బీఐ భావించగా, ఇష్యూ ప్రారంభమైన కొద్ది సేపటికే రూ.1.12 లక్షల కోట్లకు బిడ్స్ అందాయి. ఇందులో మూడింట రెండు వంతుల బిడ్స్ విదేశాల నుంచి వచ్చినట్టు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. ఎస్‌బీఐ ఆర్థిక పునాదులపై మదుపరులకు ఉన్న నమ్మకానికి ఈ క్యూఐపీ సబ్‌స్క్రిప్షన్ ఒక ఉదాహరణ అన్నారు. ఎల్ఐసీతో సహా అనేక సంస్థలు ఈ ఇష్యూ కోసం బారులు తీరాయి.

ఇన్ఫీ భళా

- అంచనాలను మించిన త్రైమాసిక ఫలితాలు
- క్యూ1 లాభం రూ.6,921 కోట్లు
- రెవెన్యూ వృద్ధి అంచనా 1-3 శాతానికి పెంపు



బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ ఇన్ఫోసిస్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను మించాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం రూ.6,921 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.6,368 కోట్ల లాభంతో పోలిస్తే 8.7 శాతం వృద్ధి కనబరిచింది. ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7.53% పెరిగి రూ.42,279 కోట్లుగా నమోదైంది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సేవల్లో బలమైన పనితీరుతో పాటు కొత్త డీల్స్ ఇందుకు దోహదపడ్డాయని కంపెనీ పేర్కొంది. కాగా, ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే నికర లాభం 1.5% తగ్గగా.. ఆదాయం మాత్రం 3.3% పెరిగింది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 0-3 శాతం నుంచి 1-3 శాతానికి మెరుగుపరిచింది. మార్జిన్ అంచనాను మాత్రం 20-22 శాతంగా కొనసాగించింది.
- గత త్రైమాసికంలో 380 కోట్ల డాలర్ల విలువైన బడా డీల్స్‌ను దక్కించుకున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ జూన్ చివరి నాటికి మొత్తం యాక్టివ్ క్లయింట్ల సంఖ్య మాత్రం 1,861కు తగ్గింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఈ సంఖ్య 1,869గా ఉంది.
- క్యూ1లో కంపెనీ మొత్తం సిబ్బంది సంఖ్య కేవలం 210 పెరుగుదలతో 3,23,788కి చేరింది. ఉద్యోగుల వలసల రేటు 14.4 శాతానికి పెరిగింది.
- ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 20,000 మందిని ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.
- విభాగాలవారీగా చూస్తే, ఈ క్యూ1లో కంపెనీ మొత్తం ఆదాయంలో 27.9 శాతం ఆర్థిక సేవల రంగం నుంచి సమకూరింది. తయారీ రంగం వాటా 16.1 శాతం, రిటైల్ రంగం వాటా 13.4 శాతంగా ఉంది.
- మార్కెట్ల వారీగా, మొత్తం ఆదాయంలో ఉత్తర అమెరికా వాటా 56.5 శాతానికి తగ్గింది. అయినప్పటికీ, కంపెనీకి అత్యధిక ఆదాయం ఈ మార్కెట్ నుంచే సమకూరుతోంది. యూరప్ మార్కెట్ వాటా 31.5 శాతానికి పెరిగింది. గడిచిన కొన్ని త్రైమాసికాలుగా కంపెనీ యూరప్ మార్కెట్లో బలమైన పనితీరు కనబరుస్తూ వస్తోందని ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా అన్నారు. ఇది కొన్నేళ్లక్రితం యూరప్‌లో కంపెనీ పెట్టిన పెట్టుబడుల ప్రతిఫలమని ఆయన పేర్కొన్నారు.
- బీఎస్ఈలో బుధవారం ట్రేడింగ్ ముగిసేసరికి, ఇన్ఫోసిస్ షేరు ధర 0.27 శాతం పెరిగి రూ.1,574.40 వద్ద స్థిరపడింది.

తొలిరోజు మనదే

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్

- సుదర్శన్, జైస్వాల్ అర్ధ శతకాలు
- టీమిండియా 264/4



సాయి సుదర్శన్ (61)

పంత్‌కు గాయం

68వ ఓవర్‌లో వోక్స్ యార్కర్‌ను రివర్స్‌స్వీప్ ఆడే క్రమంలో పంత్ కుడికాలికి బంతి బలంగా తగిలింది. దీంతో నొప్పితో అతడు విలవిల్లాడాడు. కాలు వాయడంతో పాటు రక్తం రావడంతో పంత్ రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు.

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్ తొలిరోజును భారత్ మెరుగ్గా ముగించింది. బుధవారం మొదలైన ఈ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 264/4 స్కోరు చేసింది. జట్టులో తనకు తిరిగి లభించిన అవకాశాన్ని సాయి సుదర్శన్ (61) తొలి అర్ధ శతకంతో సద్వినియోగం చేసుకోగా.. యశస్వి జైస్వాల్ (58) రాణించాడు. జడేజా (19), శార్దూల్ ఠాకూర్ (19) క్రీజులో ఉన్నారు. రాహుల్ (46) శుభారంభాన్ని చేజార్చుకోగా.. రిషబ్ పంత్ (37 రిటైర్డ్ హర్ట్) గాయం జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. స్టోక్స్ 2 వికెట్లు తీశాడు. టీమిండియా తరఫున పేసర్ అన్షుల్ కాంబోజ్ అరంగేట్రం చేయగా.. కరుణ్ నాయర్, నితీశ్ స్థానాల్లో సుదర్శన్, శార్దూల్ జట్టులోకొచ్చారు.

జైస్వాల్, రాహుల్ ఓర్పుగా..: ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో టాస్ గెలిచి ప్రత్యర్థికి బ్యాటింగ్ అప్పగించిన జట్టు ఇంతవరకు మ్యాచ్ గెలిచింది లేదు. కానీ, ఆకాశం మేఘావృతమై ఉండడంతో.. ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకొన్నాడు. అయితే, ఓపెనర్లు జైస్వాల్, రాహుల్ ఓర్పుగా ఆడుతూ.. భారత్‌కు చక్కని ఆరంభాన్ని అందించారు. ముఖ్యంగా జైస్వాల్ ఎంతో క్రమశిక్షణతో బ్యాటింగ్ చేశాడు. మరో ఎండ్‌లో మాత్రం రాహుల్ తన దైన శైలిలో ఆడుతూ స్కోరు బోర్డును నడిపించడంతో.. భారత్ 78/0తో లంచ్‌కు వెళ్లింది.

1 గత 35 ఏళ్లలో ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో అరంగేట్రం చేసిన తొలి భారత క్రికెటర్‌గా అన్షుల్ కాంబోజ్. 1990లో అనిల్ కుంబ్లే తన తొలి టెస్ట్ ఇక్కడే ఆడాడు.

14 అన్ని ఫార్మాట్లలో కలిపి టీమిండియా టాస్ ఓడడం ఇది 14వసారి.

దెబ్బకొట్టిన ఇంగ్లండ్: రెండో సెషన్‌లో భారత్ 71 రన్స్ చేసినా 3 కీలక వికెట్లు చేజార్చుకొంది. నిలకడగా ఆడుతున్న రాహుల్, జైస్వాల్‌తోపాటు గిల్‌ను అవుట్ చేసి ఇంగ్లండ్ పైచేయి సాధించింది. ఫిఫ్టీకి చేరువవుతున్న రాహుల్‌ను వోక్స్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బౌండ్రీలతో వేగంగా ఆడే ప్రయత్నం చేస్తున్న జైస్వాల్.. సింగిల్‌తో ఫిఫ్టీ మార్క్‌ను అందుకొన్నాడు. ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చిన స్పిన్నర్ డాసన్ బౌలింగ్‌లో డిఫెన్స్ ఆడే క్రమంలో ఫస్ట్ స్లిప్‌లో ఉన్న బ్రూక్‌కు జైస్వాల్ క్యాచిచ్చాడు. కెప్టెన్ గిల్ (12)ను స్టోక్స్ ఎల్బీ చేశాడు. కానీ, వన్‌డౌన్ బ్యాటర్ సుదర్శన్, పంత్ రక్షణాత్మకంగా ఆడడంతో భారత్ 149/3తో టీ బ్రేక్‌కు వెళ్లింది.

ఆఖరి సెషన్‌లో 115/1: సుదర్శన్, పంత్ ఎదురుదాడితో.. మూడో సెషన్‌లో భారత్ 115 పరుగులు రాబట్టింది. క్రీజులో కుదురుకున్నాక సాయి సుదర్శన్ వీలుచిక్కినప్పుడల్లా బౌండ్రీలు బాదాడు. క్రమంగా పంత్ తన సహజశైలిలో షాట్లు ఆడుతూ ఇంగ్లండ్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించే ప్రయత్నం చేశాడు. 61వ ఓవర్‌లో కార్స్ బౌలింగ్‌లో ఫ్రంట్ ఫుట్‌పై సిక్స్‌తో వావ్ అనిపించాడు. ఈ క్రమంలో జట్టు స్కోరు కూడా డబుల్ సెంచరీ మార్క్ దాటింది. అయితే, 72 పరుగుల భాగస్వామ్యంతో వీరిద్దరు జట్టును బలమైన స్థితికి చేర్చేలా కనిపించారు. కానీ, పంత్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. జడేజా క్రీజులోకి వచ్చాడు. మరోవైపు ఫోర్‌తో కెరీర్‌లో తొలి అర్ధ శతకం నమోదు చేసిన సాయిని స్టోక్స్ వెనక్కి పంపాడు. జడేజా, శార్దూల్ మరో వికెట్ కోల్పోకుండా రోజును ముగించారు.

ఇంజనీర్, లాయిడ్ పేరిట స్టాండ్

భారత మాజీ ఆటగాడు ఫరూక్ ఇంజనీర్ (87), వెస్టిండీస్ లెజెండ్ క్లైవ్ లాయిడ్ (80) అరుదైన గౌరవం దక్కింది. ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలోని ఓ స్టాండ్‌కు వీరిద్దరి పేర్లు పెట్టారు. బి-స్టాండ్‌కు సర్ క్లైవ్ లాయిడ్ అండ్ ఫరూక్ ఇంజనీర్ స్టాండ్‌గా నామకరణం చేశారు. టాస్‌కు ముందు స్టాండ్ ఆవిష్కరణ కార్యక్రమం జరగ్గా.. ఇంజనీర్, లాయిడ్ హాజరయ్యారు. ఇంగ్లండ్‌లో స్టాండ్‌కు ఓ భారత ఆటగాడి పేరు పెట్టడం ఇదే తొలిసారి.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బ్రూక్ (బి) డాసన్ 58, రాహుల్ (సి) క్రాలే (బి) వోక్స్ 46, సుదర్శన్ (సి) కార్స్ (బి) స్టోక్స్ 61, గిల్ (ఎల్బీ) స్టోక్స్ 12, పంత్ (రిటైర్డ్ హర్ట్) 37, జడేజా (బ్యాటింగ్) 19, శార్దూల్ (బ్యాటింగ్) 19; ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 83 ఓవర్లలో 264/4; వికెట్ల పతనం: 1-94, 2-120, 3-140, 3-212 (పంత్ రిటైర్డ్ హర్ట్), 4-235; బౌలింగ్: వోక్స్ 17-4-43-1, ఆర్చర్ 16-2-44-0, కార్స్ 16-1-60-0, స్టోక్స్ 14-2-47-2, డాసన్ 15-1-45-1, రూట్ 5-0-19-0.

భళా..దివ్య

- చెస్ ప్రపంచ కప్‌లో ఫైనల్‌కు
- ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా రికార్డు
- క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత
- హంపి సెమీస్ ఫలితం టైబ్రేకర్‌కు



బటూమి (జార్జియా): భారత చిచ్చర పిడుగు దివ్యా దేశ్‌ముఖ్ చరిత్ర సృష్టించింది. మహిళల చెస్ వరల్డ్ కప్‌లో 19 ఏళ్ల దివ్య ఫైనల్లో అడుగు పెట్టింది. తద్వారా ఈ మెగా టోర్నమెంట్ టైటిల్ ఫైట్‌కు చేరిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. చైనా జీఎం, ప్రపంచ మాజీ చాంపియన్ టోన్ జోంగ్‌యితో బుధవారం జరిగిన సెమీఫైనల్ రెండో గేమ్‌లో తెల్లపావులతో ఆడిన దివ్య విజయం సాధించింది. దాంతో 1.5-0.5 పాయింట్ల తేడాతో ఆమె టైటిల్ ఫైట్‌లో ప్రవేశించింది. సెమీస్ తొలి గేమ్‌ను దివ్య డ్రా చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ కప్ ఫైనల్ ప్రవేశం దరిమిలా..2026లో జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి దివ్య క్వాలిఫై అయ్యింది. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ ఝు జినెర్‌తో తలపడే చాలెంజర్‌ను క్యాండిడేట్స్ టోర్నమెంట్ ద్వారా నిర్ధారిస్తారు. అంతేకాదు..సెమీఫైనల్ గెలుపుతో దివ్య తొలి గ్రాండ్‌మాస్టర్ (జీఎం) నార్మ్‌నూ సొంతం చేసుకుంది. మరో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి సెమీఫైనల్ ఫలితం టైబ్రేకర్‌లో తేలనుంది. చైనా గ్రాండ్ మాస్టర్ లి టింగ్జీతో సెమీఫైనల్ రెండో గేమ్‌ను హంపి డ్రా చేసుకుంది. హంపి-టింగ్జీ మొదటి గేమ్‌లో కూడా ఫలితం తేలని విషయం తెలిసిందే. ఫలితంగా రెండు క్లాసికల్ గేమ్‌ల అనంతరం హంపి, టింగ్జీ చెరో పాయింట్‌తో సమంగా నిలిచారు. దాంతో గురువారం జరిగే టైబ్రేకర్‌లో హంపి-లి టింగ్జీ అమీతుమీ తేల్చుకోనున్నారు.

స్పోర్ట్స్

సింధు ముందంజ

- సాత్విక్ జోడీ బోణీ
- చైనా ఓపెన్

చాంగ్జౌ: భారత షట్లర్లు పీవీ సింధు, ఉన్నతి హుడా, డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి చైనా ఓపెన్‌లో శుభారంభం చేశారు. సింగిల్స్ మొదటి రౌండ్లో సింధు 21-15, 8-21, 21-17తో మియాజకి (జపాన్)పై, ఉన్నతి 21-11, 21-16తో గిల్మోర్ (స్కాట్లాండ్)పై గెలిచారు. రెండో రౌండ్లో సింధుతో ఉన్నతి అమీతుమీ తేల్చుకోనుంది. సాత్విక్/చిరాగ్ ద్వయం 21-13, 21-9తో జపాన్ జోడీ మిత్సుహషి/ఒకమురను అర గంటలోనే ఇంటిబాట పట్టించింది.

జాతీయ క్రీడా పాలన బిల్లు..



- విస్తృత అధికారాలతో ఎన్‌ఎస్‌బీ
- వివాదాల పరిష్కారానికి జాతీయ స్పోర్ట్స్ ట్రైబ్యునల్
- లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం

న్యూఢిల్లీ: దేశ క్రీడా రంగాన్ని సమూలంగా మార్చే దిశగా కీలక ముందడుగు పడింది. 'జాతీయ క్రీడా పాలన బిల్లు'ను కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ మేరకు దేశ క్రీడా రంగంలో మరింత జవాబుదారీతనం ఉండేలా నేషనల్ స్పోర్ట్స్ బోర్డు (ఎన్‌ఎస్‌బీ) ఏర్పాటు కానుంది. జాతీయ క్రీడా పాలన బిల్లు చట్టంగా మారాక.. అన్ని జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎఫ్)లు ఎన్‌ఎస్‌బీ నుంచి గుర్తింపు పొందాల్సి ఉంటుంది.

నేషనల్ స్పోర్ట్స్ ట్రైబ్యునల్..

నేషనల్ స్పోర్ట్స్ ట్రైబ్యునల్ (ఎన్‌ఎస్‌టీ) ఏర్పాటుకు కూడా ప్రతిపాదన చేశారు. ఈ ట్రైబ్యునల్‌కు సివిల్ కోర్టు అధికారాలుంటాయి. సమాఖ్యల ఎన్నికలు, అథ్లెట్ల ఎంపికల్లో వివాదాలను ఈ బోర్డు పరిష్కరిస్తుంది. ట్రైబ్యునల్ నిర్ణయాలను సుప్రీంకోర్టులోనే సవాలు చేయాల్సి ఉంటుంది.

70 ఏళ్లు దాటినా కొనసాగొచ్చు..

క్రీడా సమాఖ్యల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వయస్సు పరిమితిలో సడలింపులకు కొత్త బిల్లు వీలు కల్పించింది. ఎన్నికల్లో పోటీ చేసే సమయానికి వయసు 70 దాటకూడదు. అయితే, ఆయా సమాఖ్యల అంతర్జాతీయ కమిటీల నిబంధనలు అనుమతిస్తే 70 నుంచి 75 సంవత్సరాలు కలిగిన వ్యక్తులు పదవిలో కొనసాగొచ్చు.

ఆర్టీఐ పరిధిలోకి బీసీసీఐ..

భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) తోపాటు గుర్తింపు పొందిన అన్ని క్రీడా సమాఖ్యలు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పరిధిలోకి రానున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకోనందున తమకు ఆర్టీఐ వర్తించదని బీసీసీఐ ఎంతో కాలంగా వాదిస్తూ వస్తోంది. 2028 లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఒలింపిక్ ఉద్యమంలోకి బీసీసీఐ వచ్చినట్టేనని, అందువల్ల కొత్త బిల్లు నిబంధనలను పాటించాల్సిందేనని క్రీడా శాఖ స్పష్టంజేసింది. నేషనల్ స్పోర్ట్స్ ఎలక్షన్ ప్యానెల్ ఏర్పాటుకూ బిల్లులో ప్రతిపాదించారు. జాతీయ లేదా రాష్ట్ర ఎన్నికల కమిషన్ మాజీ సభ్యులు, లేదా రాష్ట్రాల మాజీ చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, మాజీ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లను ప్యానెల్‌లో నియమిస్తారు.

ఎన్నికల్లేకుంటే గుర్తింపు రద్దే..

ఎన్నికలు నిర్వహించని క్రీడా సమాఖ్యల గుర్తింపును రద్దు చేసే అధికారం ఎన్‌ఎస్‌బీ కలిగి ఉంటుంది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగినా గుర్తింపును రద్దు చేస్తారు. వార్షిక లెక్కలు సమర్పించకపోయినా, నిధుల దుర్వినియోగం చేసినా ఎన్‌ఎస్‌బీ చర్యలు తీసుకుంటుంది.

ఏర్పాటు ఇలా..

చైర్మన్ ఆధ్వర్యంలో నేషనల్ స్పోర్ట్స్ బోర్డు (ఎన్‌ఎస్‌బీ)ను ఏర్పాటు చేయనున్నారు. చైర్మన్‌తోపాటు, సభ్యులను కేంద్ర ప్రభుత్వం నియమించనుంది. ప్రజా పాలన, క్రీడా పాలన, క్రీడా చట్టాలలో పరిజ్ఞానం కలిగిన వారు, ఈ మూడు రంగాలలో ఆచరణాత్మక అనుభవం ఉన్న వారిని ఎన్‌ఎస్‌బీలో నియమిస్తారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి లేదా క్రీడా కార్యదర్శి ఎంపిక కమిటీ చైర్మన్‌గా ఉంటారు. భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) డైరెక్టర్ జనరల్, ఏదైనా జాతీయ క్రీడా సమాఖ్యలో అధ్యక్షుడు లేదా సెక్రెటరీ జనరల్ లేదా కోశాధికారిగా పని చేసిన ఇద్దరు, ద్రోణాచార్య లేదా ఖేల్‌రత్న లేదా అర్జున అవార్డీలలో ఒకరితో కలిపి మొత్తం నలుగురు సభ్యులతో ఎంపిక కమిటీని ఏర్పాటు చేస్తారు.

నాడా చట్టానికి సవరణ..

జాతీయ డోపింగ్ నిరోధక (నాడా) చట్టం సవరణ బిల్లును కూడా ప్రవేశపెట్టారు. అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ సూచనల మేరకు నాడా చట్టానికి సవరణలు చేశారు.



ఆ విద్యార్థులను అనుమతించండి

వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదవకున్నా వారిని దరఖాస్తు చేసుకోనివ్వండి: హైకోర్టు

హైదరాబాద్ జూలై 23 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షకు ముందు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలన్న నిబంధన పై తాజా విద్యా సంవత్సరం 2025కు సంబంధించిన అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో.. కోర్టుకు వచ్చిన అభ్యర్థులను ఎంబీబీఎస్ బీడీఎస్ వంటి కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించాలని హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గత విద్యా సంవత్సరం సైతం.. ఈ నిబంధనను సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలైన విషయం తెలిసిందే. అప్పట్లో హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వం విధించిన నాలుగేళ్ల నిబంధనను కొట్టేసి, నివాస ధ్రువీకరణ పత్రం ఉన్న అభ్యర్థులందర్నీ స్థానికులుగానే గుర్తించి అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే.. హైకోర్టు తీర్పు మేరకు.. నివాస ధ్రువీకరణ పత్రం ఉన్న 134 మంది అభ్యర్థుల దరఖాస్తులను (వరుసగా నాలుగేళ్లు చదవకపోయినా) స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ క్రమంలోనే.. తాజా విద్యా సంవత్సరానికి సంబంధించి సైతం హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై.. చీఫ్ జస్టిస్ ఏకేసింగ్, జస్టిస్ షాంకోసితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. సుప్రీంకోర్టులో కేసు పరిస్థితి ఏ దశలో ఉందో చెప్పాలని కోరింది. ఆగస్టు మొదటి వారంలో సుప్రీంకోర్టు ఎదుట ఈ పిటిషన్లు విచారణకు వచ్చే అవకాశం ఉందని న్యాయవాదులు పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. కోర్టుకు వచ్చిన అభ్యర్థుల దరఖాస్తులు స్వీకరించాలంటూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. నివాస ధ్రువీకరణ పత్రం ఉన్న అభ్యర్థులందరూ స్థానికులే అని హైకోర్టు ఇచ్చిన తీర్పునే పాటించాలని పేర్కొంది. నీట్ పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదవలేదనే కారణంతో దరఖాస్తులు తిరస్కరించరాదని స్పష్టం చేసింది. అయితే ఈ మధ్యంతర ఉత్తర్వులు, అడ్మిషన్ల ప్రక్రియ తుదితీర్పునకు లోబడి ఉంటాయని పేర్కొంది.

స్థానికతపై ఓ పరిష్కారంతో రండి

లేని పక్షంలో పిటిషన్‌ను డిస్మిస్ చేస్తాం

వైద్య విద్య సీట్ల వ్యవహారంపై తెలంగాణ సర్కారుకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సీట్ల వ్యవహారంలో స్థానికత అంశంపై పరిష్కారంతో రావాలని.. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. లేనిపక్షంలో ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని జస్టిస్ కె వినోద్ చంద్రన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం హెచ్చరించింది. ఈ నిబంధన వల్ల.. తెలంగాణలో పుట్టి పదో తరగతి వరకు చదివినా స్థానిక కోటా దక్కడం లేదని ప్రతివాదుల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కొన్నిసందర్భాల్లో తెలంగాణవాసులు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, పారామిలటరీ, ఇతర ప్రైవేట్ ఉద్యోగాల రీత్యా ఇతర రాష్ట్రాల్లో పనిచేయాల్సి వస్తోందని, దానివల్ల స్థానికత వర్తించక విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఒకసారి మినహాయింపు కింద హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అంగీకరించినట్టు తెలిపారు. దీనికి సీజేఐ జస్టిస్ గవాయి.. ఈ విషయంలో మరింత స్పష్టత అవసరమని వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించి ఎటువంటి సూచనలతో ముందుకు వస్తారో.. తదుపరి విచారణలో తెలియజేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను ఆగస్టు 5కు వాయిదా వేశారు.

పీఎం కుసుమ్ అమలులో రాష్ట్రప్రభుత్వం విఫలం

» కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పీఎం-కుసుమ్ పథకం కింద రైతులకు నిరంతరం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నప్పటికీ.. తెలంగాణలో ఈ పథకాన్ని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. వ్యవసాయ రంగంలో సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులపై భారం పడకుండా ఉంటుందనే ఉద్దేశంతో కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. అందులో భాగంగా రాష్ట్రంలో డి-సెంట్రలైజ్‌డ్ గ్రిడ్ అనుసంధానిత సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి అదనంగా 450 మెగావాట్ల సామర్థ్యంతో ఆమోదించామని తెలిపారు. దాంతో పాటుగా రాష్ట్రానికి 20 వేల సోలార్ అగ్రికల్చర్ పంప్‌సెట్లను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి కేటాయించారని చెప్పారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని తెలంగాణ రైతులకు పీఎం-కుసుమ్ పథకం ప్రయోజనాలను అందేలా చూడాలని కిషన్‌రెడ్డి తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.

గ్రంథాలయాల్లో ఆంక్షలు.. దుర్మార్గం: హరీశ్



హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల్లోనూ నిషేధాజ్ఞల బోర్డులు పెట్టి.. విద్యార్థులు, నిరుద్యోగ యువతపై ఆంక్షలు విధించడం కాంగ్రెస్ దుర్మార్గానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రశ్నించిన వారిపై ప్రభుత్వం పగబట్టినట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మొన్న యూనివర్సిటీల్లో ఆందోళనలు నిషేధిస్తూ మెమో ఇచ్చారని, ఇప్పుడు లైబ్రరీల్లో విద్యార్థులపై ఆంక్షలు పెట్టి ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో గ్రంథాలయాల చుట్టూ తిరిగి.. వాటిని రాజకీయ వేదికలుగా మార్చిన దుర్మార్గ చరిత్ర కాంగ్రెస్‌దేనన్నారు. రాహుల్‌గాంధీని సైతం లైబ్రరీకి తీసుకొచ్చి, బూటకపు హామీలిచ్చిన సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే అవి రాజకీయ వేదికలు కావని గుర్తొచ్చిందా? అని గురువారం 'ఎక్స్' వేదికగా నిలదీశారు. విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే.. రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీయడం తగదని అభిప్రాయపడ్డారు.

రిజర్వేషన్లపై రేవంత్‌ది పనికిమాలిన రాజకీయం

» రాజాసింగ్‌ను బహిష్కరించలేదు

» ఆయనే రాజీనామా చేశారు: అర్వింద్

» ఆయన మిస్డ్ కాల్ ఇస్తే మళ్లీ పార్టీ సభ్యుడేనని వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై పనికిమాలిన రాజకీయాలు చేయవద్దని సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ సూచించారు. బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే గత సుప్రీంకోర్టు తీర్పులను అధిగమించి రిజర్వేషన్లు అమలు చేసేలా ప్రభుత్వ వ్యూహం ఏంటో చెప్పాలన్నారు. ఓసీలకు బీసీ ప్రధాని మోదీ 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినట్టే, బీసీలకు సీఎం రేవంత్ రిజర్వేషన్లు సాధించి పెట్టాలన్నారు. ఈటల రాజేందర్, బండి సంజయ్ పరస్పర వ్యాఖ్యల గురించి విలేకరులు ప్రశ్నించగా.. రాజకీయ పార్టీలలో నేతల మధ్య గొడవలు సాధారణమేనని, కాంగ్రెస్‌లో రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి, బీఆర్‌ఎస్‌లో కవిత, కేటీఆర్ ఉదంతాలను ప్రస్తావించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మాజీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పార్టీలో నేతల మధ్య సమస్యలను పరిష్కరించాలన్నారు. రాజాసింగ్ ఎక్కడున్నా ఆయనను గౌరవిస్తామని, రాజాసింగ్ రాజకీయ నాయకుడిని మించిన ఐడియాలాజికల్ మ్యాన్ అంటూ పొగడ్తలు కురిపించారు. రాజాసింగ్‌ను బీజేపీ బహిష్కరించలేదని, ఆయనే రాజీనామా చేశారని అన్నారు. తమ పార్టీ సభ్యత్వం కోసం ఒక మిస్డ్ కాల్ ఇస్తే ఆయన తిరిగి పార్టీలో సభ్యుడు అవుతారని చెప్పారు.

రేషన్ కార్డులకూ సభలు పెట్టి గప్పాలు: కేటీఆర్

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చీకటి చూస్తేనే వెలుగు విలువ తెలుస్తుందని, కాంగ్రెస్ అసమర్థ పాలనను చూశాక.. రాష్ట్రంలో గుర్రాలెవరో.. గాడిదలెవరో.. ప్రజలకు తెలిసిపోయిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మీ సేవా కేంద్రాల్లో ఇచ్చేసే రేషన్‌కార్డుల గురించి పెద్ద పెద్ద సభలుపెట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గప్పాలు కొడుతున్నాడని విమర్శించారు. ఆడబిడ్డలకు రూ.300కోట్ల మేర వడ్డీలేని రుణాలిచ్చి ఘనకార్యంలాగా కాంగ్రెస్ సంబరాలు చేసుకుంటోందని, కేసీఆర్ హయాంలో రూ.3000 కోట్ల దాకా వడ్డీలేని రుణాలిచ్చినా.. గొప్పగా చెప్పుకోలేదన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం వికారాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు పలువురు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరిట అడ్డగోలు హామీల్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. కొందరు పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలా పని చేస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవడం ఖాయమని, అప్పుడు అధికారులందరూ సెట్ రైట్ అవుతారని, పార్టీ శ్రేణులను వేధించే పరిస్థితి ఉండదని అన్నారు.

స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ దుర్వినియోగం

» విజిలెన్స్ డీజీతో విచారణ జరిపించాలి: ఎఫ్‌జీజీ

హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద గత ఏడాది జనవరి 30న ప్రభుత్వం విడుదల చేసిన రూ.1,190 కోట్లు దుర్వినియోగమవుతున్నాయని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆరోపించింది. దీనిపై విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌తో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫోరం అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి ముఖ్యమంత్రికి లేఖ రాశారు. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున విడుదల చేసిన మొత్తంలో రూ.2 కోట్లు పాఠశాలల అవసరాలకు, తాగునీటికి రూ.కోటి, కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల మరమ్మతులకు రూ.50 లక్షలు, మిగతా రూ.6.5. కోట్లను ఇతర అభివృద్ధి పనులకు వినియోగించాలన్న మార్గదర్శకాలున్నాయని ఫోరం గుర్తు చేసింది. అయితే నిధులు దుర్వినియోగమవుతున్నాయని ఫోరం వివరించింది. దేవరకొండ ఎమ్మెల్యే తన నివాసం మరమ్మతులు, రెనొవేషన్, ఫర్నిచర్, ఏసీలు, టీవీల కోసం రూ.1.14 కోట్ల ప్రతిపాదనలు పంపగా ఇన్‌చార్జి మంత్రి మంజూరు చేశారని తెలిపింది. నిబంధనల ప్రకారం రూ.5 లక్షలకు మించిన పనులకు టెండర్లు పిలవాల్సి ఉండగా పనులను చిన్నవాటిగా విడగొట్టి, నామినేషన్ పద్ధతిన తమ అనుయాయులకు కట్టబెడుతున్నారని ఆరోపించింది. కరీంనగర్ నియోజకవర్గంలో ప్రధానమైన పనులను వదిలేసి 50 హైమాస్ట్ లైట్లకు రూ.60 లక్షలను మంజూరు చేశారని, 25 గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లకు రూ.1.25 కోట్లు ఇచ్చారని ఫోరం ఆరోపించింది.

ఆర్టీసీకి మహాలక్ష్మి

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణాల ద్వారా మహిళలు ఆదా చేసుకున్న రూ.6,680 కోట్ల చెక్‌ను ప్రభుత్వం తరఫున ఆర్టీసీ ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ పథకానికి సంబంధించి.. జీరో టికెట్ల రీయింబర్స్‌మెంట్ సొమ్మును ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి అందజేస్తోందని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక.. ఆర్టీసీ 2400 కొత్త బస్సులను కొనుగోలు చేసిందని చెప్పారు. అలాగే.. హైదరాబాద్‌ను కాలుష్యరహిత నగరంగా మార్చేందుకు నగరంలో ఉన్న 2800 బస్సుల స్థానంలో విద్యుత్తు బస్సులు తెచ్చే దిశగా ఆర్టీసీ కసరత్తు చేస్తున్నట్టు భట్టి తెలిపారు. ఈమేరకు 3000 ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్టీసీ ఆర్డర్ పెట్టిందని.. వాటిలో 11 శాతం బస్సులు ఇప్పటికే వచ్చాయని వెల్లడించారు. ఆ బస్సుల సంఖ్యను ఇంకా పెంచుతామన్నారు.

యజమానుల్ని చేసింది..

కోటి మంది మహిళలను కోటీశ్వరులనే చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని.. అందులో భాగంగా మహిళా సంఘాలతో ఆర్టీసీ బస్సులను కొనిపించి వారిని యాజమానులను చేసిందని భట్టి తెలిపారు. ఈమేరకు 150 మహిళా సంఘాలకు రూ.కోటి విలువైన చెక్కులు అందించినట్టు చెప్పారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల మేర.. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారు. ఇక.. మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోన్న ఆర్టీసీ సిబ్బందిని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. మహిళల దైనందిన జీవితంలో మహాలక్ష్మి పథకం భాగమైందన్నారు. మహిళలు 200 కోట్ల ప్రయాణాలు చేసిన సందర్భంగా రాష్ట్రంలోని 97 డిపోలు, 324 బస్ స్టేషన్లలో ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను కొనుగోలుతో పాటు నియామకాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రతి గ్రామం నుంచి మండలానికి, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి కొత్త రహదారుల నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, రవాణా శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్ రాజ్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కాగా.. బస్సుల్లో ఉచిత ప్రయాణాలతో ప్రతి నెలా రూ.3-4 వేలు ఆదా అవుతున్నాయంటూ పలువురు మహిళా ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.



ఆర్టీసీ బస్సులో టికెట్ తీసుకొని ప్రయాణం చేస్తున్న మంత్రి తుమ్మల

'మహాలక్ష్మి'ని ఇతర రాష్ట్రాలూ అనుసరిస్తున్నాయి

తెలంగాణ సర్కారు అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం: తుమ్మల

ఖమ్మం/కొత్తగూడెం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని.. ముఖ్యంగా 'మహాలక్ష్మి' పథకాన్ని ఇతర రాష్ట్రాలూ అనుసరిస్తున్నాయని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గడిచిన 18నెలల కాలంలో మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాల సంఖ్య 200 కోట్ల మార్కు దాటిన నేపథ్యంలో బుధవారం ఖమ్మం ఆర్టీసీ బస్టాండ్, కొత్తగూడెం బస్టాండ్‌లో నిర్వహించిన సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ పథకంకింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా రూ.6700 కోట్లు ఖర్చుచేసిందన్నారు. ఈపథకం ద్వారా నిరుపేద, మధ్యతరగతి మహిళలకు ఆర్థిక స్వావలంబన ఏర్పడిందన్నారు. మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఖమ్మం బస్టాండ్ నుంచి రఘునాథపాలెం మండలం మూలగూడెం వరకూ బస్సులో వెళ్లారు. గతంలో ఆ గ్రామానికి బస్సు నడిపిస్తానని ఇచ్చిన హామీ మేరకు... ఆ సర్వీసును ప్రారంభించి, కండక్టర్‌కు రూ.30 చెల్లించి టికెట్ తీసుకుని గ్రామస్థులతో కలిసి ఆ గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కర్ణాటకలో సెప్టెంబరు 22 నుంచి కులగణన

» సామాజిక విద్య సమీక్ష పేరిట నిర్వహణ

» సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయం

» తెలంగాణలో కులగణన అధ్యయనానికి కమిటీ

బెంగళూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 7వరకు 15 రోజులపాటు సామాజిక విద్య సమీక్ష పేరిట కులగణన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీసీ కమిషన్ వినతికి అనుగుణంగా సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన కుల గణనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అక్టోబరు చివరినాటికి కులగణన పూర్తి చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. కులగణనకు సంబంధించి శిక్షణ, ముందస్తు ఏర్పాట్లను వెంటనే ప్రారంభించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈసారి మొబైల్ యాప్ వినియోగించుకుని సర్వే చేయాలని నిర్ణయించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక విద్య గణాంకాలపై అధ్యయనం చేసేందుకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కుల గణన ద్వారా రాష్ట్రంలో 7 కోట్ల మంది ప్రజల వివరాలు తెలుసుకుంటామని సీఎం తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు.. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వీపీ గౌతమ్

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతుందని గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ స్పష్టం చేశారు. ఇళ్ల మంజూరు కోసం మధ్యవర్తులను ఆశ్రయించవద్దని ఆయన ప్రజలకు సూచించారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కార్యాలయంలో పనిచేసిన ఓ వ్యక్తి ఇళ్లు ఇప్పిస్తానని పేదల నుంచి డబ్బులు వసూలు చేశాడన్న ఆరోపణల నేపథ్యంలో బుధవారం ఈ ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా ఇళ్లు ఇప్పిస్తామని ప్రలోభపెడితే అలాంటి వారిపై ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అనర్హులకు ఇల్లు మంజూరైనట్లు తేలితే, ఇంటి నిర్మాణం ఏ దశలో ఉన్నా రద్దు చేస్తామని గౌతమ్ తేల్చి చెప్పారు.

యూరియా బ్లాక్ మార్కెటింగ్ నియంత్రణలో సర్కారు విఫలం

ఫర్టిలైజర్ షాపులతో కాంగ్రెస్ నేతల కుమ్మక్కు

అవసరానికి మించి కేంద్రం యూరియా సరఫరా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): యూరియా బ్లాక్ మార్కెటింగ్‌ను అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. ఎరువుల డీలర్లపై సరైన పర్యవేక్షణ లేదన్నారు. యూరియా సరఫరా వ్యవస్థపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం, ఫర్టిలైజర్ షాపులతో కొంత మంది కాంగ్రెస్ నేతలు కుమ్మక్కు కావడం వల్లే యూరియా కృత్రిమ కొరత తలెత్తుతుందని ఆయన చెప్పారు. మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పలు పార్టీల నుంచి కీలక నేతలు బుధవారం పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ జెండాలు కప్పి రాంచందర్ రావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వ హయాంలో యూరియా కోసం రైతులు బారులు తీరి, లైన్లలో గొడవలు, లాఠీచార్జీలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. కానీ, మోదీ సర్కారు వచ్చిన తర్వాత కొరత లేకుండా యూరియా పంపిణీ చేస్తోందన్నారు. ప్రస్తుతం 9.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 12.02 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసిందని ఆయన చెప్పారు. అంటే అవసరానికి మించి యూరియా సరఫరా చేసిందన్నారు. కానీ, రాష్ట్రంలోని కొన్ని ఫెర్టిలైజర్ షాపుల ముందు రైతులు బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు డిమాండ్ చేస్తున్న బీజేపీపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. రానున్న రోజుల్లో బీజేపీకి బలం చేకూరుతుందని, అందుకే కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారంతో ప్రజలను మభ్య పెడుతున్నదని రాంచందర్ రావు ఆరోపించారు. త్వరలో జరిగే తన మహబూబ్ నగర్ జిల్లా పర్యటనలో నేతలు ఐక్యత ప్రదర్శించి ప్రజల్లో విశ్వాసం పెంచాలని కోరారు. పాత, కొత్త తేడా లేకుండా పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేసి, బీజేపీని అధికారంలోకి తేవాలని ఆయన చెప్పారు.

26, 27 తేదీల్లో పాలమూరులో పర్యటన

ఈ నెల 26, 27 తేదీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రాంచందర్ రావు పర్యటిస్తారు. 26న మహబూబ్‌నగర్, నారాయణ పేట జిల్లాలు, 27న గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో పర్యటించనున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు.

బీఆర్‌ఎస్, బీజేపీ.. బీసీ వ్యతిరేక పార్టీలు

వాటిల్లోని బీసీ నేతలు కాంగ్రెస్‌తో జతకట్టాలి.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పిలుపు

» బీజేపీ ఎంపీలందరూ బీసీల వైపుంటే రిజర్వేషన్లు ఎందుకు పెరగవు: బల్మూరి

» బీఆర్‌ఎస్.. బిజినెస్ రాష్ట్ర సమితి: అద్దంకి



హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్‌ఎస్ బీసీ వ్యతిరేక పార్టీలుగా మారిపోయాయని, వాటిల్లోని బీసీ నేతలు ఆ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్‌తో జత కట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. అగ్ర కులాల పార్టీల ఆధిపత్యాన్ని ఎదిరించి కాంగ్రెస్ పార్టీ తో జతకట్టాలని మహేశ్‌కుమార్ గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు ఆర్డినెన్స్‌కు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మోకాలడ్డుతుండగా, అసెంబ్లీ ఆమోదంతో పంపిన బిల్లులను ఆమోదించేందుకు కేంద్రంలోని బీజేపీకి మనసొప్పడం లేదని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లంటే బీజేపీకి రుచించడం లేదని ఆరోపించారు. 9వ షెడ్యూల్‌లో చేర్చడం సాధ్యం కాదనుకుంటే అసెంబ్లీలో బీసీ బిల్లులకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎలా మద్దతిచ్చారు? బిల్లు ఢిల్లీకి వెళ్లాక ఎందుకు మాట మార్చారు? అని నిలదీశారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తామని స్పష్టం చేశారు. అమల్లో ఉన్న రిజర్వేషన్లను తగ్గించి, అసెంబ్లీలో వాకౌట్లు చేసిన చరిత్ర బీఆర్‌ఎస్‌దని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. కవిత అయోమయానికి గురవుతూ, సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం కోసమే ప్రభుత్వం బిల్లు తీసుకువచ్చిందని స్పష్టం చేశారు. బీజేపీ తరఫున రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది ఎంపీలు బీసీల పక్షాన నిలబడితే.. రిజర్వేషన్ల పెంపు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. పదవుల కోసం టీఆర్‌ఎస్‌ను, వ్యాపారం కోసం బీఆర్‌ఎస్‌ను కేసీఆర్ పెట్టుకున్నారని ప్రస్తుతం బీఆర్‌ఎస్ బిజినెస్ రాష్ట్ర సమితిగా మారిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. పదేళ్ల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల సొమ్ము తిన్న కేసీఆర్ కుటుంబం ఎందుకు జైలుకు పోవద్దు? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో నలుగురు జైలు పక్షులు ఉన్నారని, వారు ఎప్పుడైనా జైలుకు వెళ్లక తప్పదన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు ఎత్తులు జిత్తులు మానుకుని బీసీ రిజర్వేషన్ల పెంపునకు మద్దతు ఇవ్వాలని పీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం సూచించారు.

యూత్ కాంగ్రెస్‌కు 20 శాతం సీట్లు ఇవ్వాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు 20 శాతం సీట్లు ఇవ్వాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన మహేశ్‌గౌడ్.. అర్హత కలిగిన నేతలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారని శివచరణ్‌రెడ్డి తెలిపారు.

అనిల్ అనుచరుల ఖాతాల్లో వందల కోట్ల లావాదేవీలు!

» వారి ద్వారానే ఏపీ మాజీ మంత్రి దందా

» ఆయనపై క్వార్ట్జ్‌తో పాటు మనీలాండరింగ్ కేసు?

నెల్లూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ క్వార్ట్జ్ అక్రమ తవ్వకం, అమ్మకాల కథంతా తన అనుచరుల ద్వారా నడిపినట్లు పోలీసులు గుర్తించారు. ఆయన ముఖ్య అనుచరుడు శ్రీకాంత్‌రెడ్డిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపిన సంగతి తెలిసిందే. శ్రీకాంత్‌రెడ్డిది సాధారణ కుటుంబం. కానీ, అతడితోపాటు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో రూ.వందల కోట్ల లావాదేవీలు జరిగినట్లు తెలిసింది. ఆ డబ్బు మొత్తం క్వార్ట్జ్ వ్యాపారుల నుంచి వచ్చినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. శ్రీకాంత్‌రెడ్డి ఖాతాల నుంచి ఎవరెవరికి డబ్బులు వెళ్లాయనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. అలాగే సైదాపురం మండలంలో అనిల్ మరో అనుచరుడి ఖాతాలో రూ.17 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఈ మండలంలో అనిల్ బాధితులైన క్వారీల మాజీ యజమానులు అతడి బ్యాంక్ స్టేట్‌మెంట్లను బుధవారం పోలీసులకు అందజేసినట్లు విశ్వసనీయ సమాచారం. పదుల సంఖ్యలో అనిల్ అనుచరులు అప్పట్లో క్వార్ట్జ్ అక్రమ రవాణా వ్యవహారాలను పర్యవేక్షించారని తేలింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లాలో విస్తారంగా ఉన్న క్వార్ట్జ్ నిక్షేపాలపై కన్నేశారు. లీజులో ఉన్న గనులను, ప్రభుత్వ భూముల్లో ఉన్నవాటిని అనధికారికంగా వేలం పెట్టారు. తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతో జగన్ ప్రియభక్తుడైన అనిల్ వాటిని దక్కించుకున్నారని అప్పట్లోనే విస్తృతంగా ప్రచారం జరిగింది. శ్రీకాంత్‌రెడ్డి విచారణలో దీన్ని ధ్రువీకరించాడు. నెలకు రూ.40 కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు కప్పంగా కట్టాలన్న ఒప్పందంతో మొత్తం క్వార్ట్జ్ క్వారీలన్నింటినీ అనిల్ పరం చేశారు. లీజుదారులు విక్రయించే క్వార్ట్జ్‌పై టన్నుకు రూ.10 వేల చొప్పున అనిల్‌కు కప్పం కట్టేలా హుకుం జారీ చేశారు. ఈ దందాల్లో అనిల్, కాకాణి తమ చేతికి మట్టి అంటకుండా ఎక్కడిక్కడ ఏజెంట్లను పెట్టుకుని, వారి ద్వారా డబ్బు వసూలు చేశారనే ప్రచారం ఉంది. అనధికారిక క్వారీల్లో తవ్వి విక్రయించిన మొత్తాన్ని హవాలా మార్గంలో విదేశాలకు తరలించి.. అక్కడి నుంచి వైట్‌రూపంలో వెనక్కి తెచ్చుకున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. లీజుదారుల నుంచి టన్నుకు రూ.10 వేల చొప్పున వసూలు చేసిన మొత్తాన్ని సన్నిహితుల ఖాతాల్లో జమ చేసి.. తర్వాత సొంత ఖాతాలకు బదిలీ చేసుకున్నారని.. తాడేపల్లి ప్యాలెస్ వాటాను కూడా వైట్ రూపంలోనే అందజేశారని భావిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో అనిల్‌పై పటిష్ఠంగా కేసు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈడీని రంగంలోకి దించి, మనీలాండరింగ్ కేసు నమోదు చేయిస్తారన్న ప్రచారమూ జరుగుతోంది. మరోవైపు.. అనిల్ ప్రధాన అనుచరుడొకరు పోలీసులకు చిక్కకుండా బుధవారం విదేశాలకు వెళ్లిపోవడం గమనార్హం.

సంజాయిషీకి గడువు కోరిన కాళేశ్వరం ఇంజనీర్లు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో షోకాజు నోటీసులు అందుకున్న అధికారులు, సంజాయిషీ ఇవ్వడానికి ప్రభుత్వాన్ని గడువు కోరారు. షోకాజ్ నోటీసులకు మూడు వారాల్లో స్పందించాలని ప్రభుత్వం పేర్కొనగా.. కొందరు మరో రెండు వారాలు, మరి కొందరు నెలరోజుల పాటు గడువు కోరారు. బ్యారేజీల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు వ్యక్తిగత కారణాలపై అమెరికాకు వెళ్లిపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి కారకులుగా భావించే 17 మందిపై నేరపూరిత కేసులో విచారణ చేపట్టాలని, 33 మందిపై శాఖ పరమైన చర్యలు, పదవీ విరమణ చేసిన ఏడుగురికి నిబంధనలు అనుసరించి, పెన్షన్‌లో కోత విధిస్తూ జరిమానాలు వేయాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయం విదితమే. అయితే నోటీసులు అందుకున్న 38 మందిలో 25 మంది సర్వీసులో ఉండగా... వీరికి పదోన్నతులు ఇవ్వరాదని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. ఆపై అధికారులిచ్చే వివరణ ఆధారంగా, వీరిపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించాలనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఇక ప్రాణహిత-చేవెళ్ల రీ డిజైన్ సమయం నుంచి మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిపోయే దాకా నీటి పారుదల, ఆర్థిక శాఖల్లో ముఖ్య కార్యదర్శులుగా పనిచేసిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయం విదితమే. వీరిపై ఇప్పటిదాకా ఏ చర్యలు తీసుకోలేదు.

ఆ ఐదు గ్రామాల్లో త్వరలో భూధార్ కార్డులు

- ప్రయోగాత్మక సర్వే చేపట్టిన గ్రామాల నక్షలు ఖరారు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): సర్వే రికార్డుల్లేని ఐదు గ్రామాలకు త్వరలో మ్యాపులతోపాటు భూధార్ కార్డులు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన సర్వే పూర్తయిందని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్, జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం కొమ్మనాపల్లి, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడు, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్‌నగర్ గ్రామాల్లో ప్రయోగాత్మకంగా సర్వే చేపట్టామన్నారు. ఆ గ్రామాల మ్యాపులు ఖరారయ్యాయని, ఆ గ్రామాలకు సర్వే మ్యాప్, భూధార్ కార్డులు అందించాలనే యోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. సర్వే పూర్తి చేసిన ఐదు గ్రామాల్లో రెవెన్యూ, అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూములు ఉంటే ఆ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ఐదు గ్రామాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన గ్రామాల్లో రీసర్వే నిర్వహించాలని సూచించారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపు ఆపండి

- కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాలు నిండే దాకా పోతిరెడ్డిపాడు నుంచి నీటిని తరలింపును అడ్డుకోవాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ)ను తెలంగాణ కోరింది. ఈ మేరకు తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్ ఈనెల 22న కేఆర్‌ఎంబీకి లేఖ రాశారు. కృష్ణా బేసిన్‌లోని సాగర్, పులిచింతల నిండటానికి 99.40 టీఎంసీల జలాలు అవసరమని ఆ లేఖలో పేర్కొన్నారు. సాగర్ ఆయకట్టుతోపాటు కృష్ణా డెల్టా అవసరాలు సాగర్ ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. జూలై 6 నుంచి 18వ తేదీ వరకు పోతిరెడ్డిపాడు నుంచి 20.66 టీఎంసీల నీటిని తరలించారని తెలిపారు. నీటి విడుదల ఉత్తర్వులు లేకుండా జరుగుతున్న ఈ తరలింపును అడ్డుకోవాలని కోరారు.

మురికివాడల చిన్నారుల కోసం ఉద్భవ్ పాఠశాల

- ప్రారంభించిన సీఎస్, డీజీపీ

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మురికివాడల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఫతేనగర్‌లో ఏర్పాటు చేసిన ఉద్భవ్ పాఠశాలను సీఎస్ కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ బుధవారం ప్రారంభించారు. ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థుల సంఘం, హైదరాబాద్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం ఆధునిక వసతులతో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. పాఠశాల బోర్డు ట్రస్టీలుగా ఐఐఎం పూర్వ విద్యార్థులైన మాజీ ఐపీఎస్ అధికారి ఎస్వీ రమణమూర్తి, షణ్ముఖ, హరీశ్‌కుమార్, సీతారాం, శ్రీహర్ష ఈ పాఠశాలను ప్రారంభించారు. పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నెలకొల్పిన ఈ పాఠశాల విజయవంతంగా కొనసాగాలని సీఎస్ రామకృష్ణారావు అభిలషించారు. పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ హైటెక్ పాఠశాల మరింత మంది స్వచ్ఛంద సేవకులకు ప్రేరణ కావాలని డీజీపీ జితేందర్ అన్నారు. ఉద్భవ్ పాఠశాలల్లో ప్రస్తుతం 1,086 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఉద్భవ్ పాఠశాలల నిర్వాహకుడు మురళీధరన్ తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలో స్టీల్ పాత్రల్లోనే వండాలి

- అల్యూమినియం పాత్రలు వాడొద్దు: మంత్రి అడ్లూరి

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో అల్యూమినియం పాత్రలకు బదులు స్టీల్ పాత్రల్లో వంటలు వండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు హాస్టళ్లను తనిఖీ చేస్తానని చెప్పారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ.. వరల్డ్ వైడ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఇండియాతో కలిసి పర్యావరణ పరిరక్షణకు 'మిషన్ ప్రకృతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడారు. పీహెచ్‌సీ వైద్య బృందం 15 రోజులకో సారి ప్రతి హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేసీ కెనాల్‌కు 18.51 టీఎంసీలు చాలు

- కృష్ణా ట్రైబ్యునల్-2 ఎదుట తెలంగాణ వాదనలు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కర్నూలు-కడప(కేసీ)కెనాల్‌కు 45.1 టీఎంసీల నీటి లభ్యత ఉండగా.. ఆ ప్రాజెక్టు ఆయకట్టుకు 18.51 టీఎంసీలు సరిపోతాయని, మిగిలిన 26.59 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. ఈ మేరకు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీ అంశంలో విచారణ చేపడుతున్న జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రైబ్యునల్-2 ఎదుట తన వాదనలు వినిపించింది. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన ట్రైబ్యునల్ విచారణలో తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు. కృష్ణా ట్రైబ్యునల్-1 తీర్పుకి విరుద్ధంగా కేసీ కెనాల్‌కు సుంకేసుల బ్యారేజీతో పాటు ముచ్చుమర్రి, మల్యాల, ఎస్కేప్ చానల్ నాలుగు చోట్ల నుంచి నీళ్లను తరలించుకుంటున్నారని తెలిపారు. ఇది ట్రైబ్యునల్ కేటాయింపునకు విరుద్ధమని వివరించారు. కేసీ కెనాల్ కింద పంటల సాగుకి శాస్త్రీయ పద్ధతిలో 18.51 టీఎంసీల జలాలు సరిపోతాయని పేర్కొన్నారు. కాగా, గురు, శుక్రవారాల్లో కూడా ట్రైబ్యునల్ ఎదుట తెలంగాణ వాదనలు వినిపించనుంది.

సర్వే విభాగం పునర్ వ్యవస్థీకరణకు గ్రీన్ సిగ్నల్

- మంత్రి ఆమోదంతో సీఎంవోకు ఫైల్.. టీజీవో హర్షం

హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): సర్వే విభాగం పునర్ వ్యవస్థీకరణకుప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) పేర్కొంది. క్యాడర్ స్ట్రెంథ్‌ను 2,200 నుంచి 3,200కు పెంచడంతోపాటు పదోన్నతులు కోరుతూ సర్వే అధికారుల సంఘం చేసిన ప్రతిపాదనలకు సంబంధించిన ఫైలుపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంతకం చేశారని, ఆ ఫైలు ప్రస్తుతం సీఎంవోకు వెళ్లిందని తెలిపింది. ఈ నేపథ్యంలో టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు నేతృత్వంలోని బృందం మంత్రి పొంగులేటిని బుధవారం కలిసి ధన్యవాదాలు తెలియజేసింది. దీనిపై వచ్చే క్యాబినెట్‌లో నిర్ణయం ఉంటుందని మంత్రి తమకు హామీ ఇచ్చారని టీజీవో పేర్కొంది.

రాష్ట్రంలో ముగ్గురు ఐఏఎస్‌ల బదిలీ

- ఆరుగురు ట్రైనీ ఐఏఎస్‌లకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ముగ్గురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేయడంతో పాటు రాష్ట్ర కేడర్‌కు చెందిన 2023 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌లకు సబ్ కలెక్టర్లుగా ప్రభుత్వం పోస్టింగులు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పౌర సరఫరాల శాఖ సంయుక్త కార్యదర్శిగా ఐషా మస్రత్ ఖానమ్‌కు బాధ్యతలు అప్పగించారు. హనుమంత్ కె.జెండగేను సివిల్ సప్లై డైరెక్టర్‌గా నియమించి, చీఫ్ రేషనింగ్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో ఉన్న ముజామిల్ ఖాన్‌ను జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్ర కేడర్‌కు చెందిన 2023 బ్యాచ్ ట్రెయినీ ఐఏఎస్‌లకు ప్రభుత్వం సబ్ కలెక్టర్లుగా బాధ్యతలు అప్పగించింది. ఉమా హారతిని సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్‌కు, అజ్మీరా సంకేత్ కుమార్‌ను నిర్మల్ జిల్లా భైంసాకు, అభిజ్ఞాన్ మాల్వియాను నిజామాబాద్ ఆర్మూర్‌కు, అజయ్ యాదవ్‌ను ఖమ్మం జిల్లా కల్లూరుకు, మృణాల్ శ్రేష్ఠను భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి, మనోజ్‌ను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి సబ్ కలెక్టర్లుగా నియమించింది.

సొంత ఫ్యామిలీ ఫోన్లు వినడమేంటి?

దాని కన్నా ఆత్మహత్య చేసుకోవడం మేలు.. ఇంతచేసి సాధించిందేంటి? ఉద్యోగమే ఊడింది

కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టలేదు.. మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో సొంత ఫ్యామిలీ ఫోన్లను కూడా ట్యాపింగ్ చేయించుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా వినాల్సినంత ఖర్మ ఏం పట్టిందని ప్రశ్నించారు. దాని కన్నా ఆత్మహత్య చేసుకోవడం మేలు అని అన్నారు. బుధవారం ఢిల్లీలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో మీడియా సమావేశం తర్వాత పాత్రికేయులతో కొద్దిసేపు సీఎం ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ సాగుతోంది. విచారణకు నన్ను పిలవలేదు కాబట్టి.. ఫోన్ ట్యాపింగ్ లిస్టులో నా నంబర్ లేదని అనుకుంటున్నా. ఒకవేళ నన్ను పిలిస్తే విచారణకు తప్పకుండా వెళతా. మా ఫోన్లు ఏమైనా ట్యాప్ చేశారా? అంటూ ఎంతో మంది సినిమా వాళ్లు ఆందోళనతో అడుగుతున్నారు. ఏం చేసినా చివరికి ఏం సాధించిండు. ఉద్యోగం ఊడింది కదా? ఇవన్నీ ఎందుకు? ప్రశాంతంగా మన పని మనం చేస్తే సరిపోదా?" అని రేవంత్ వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్‌పై తన వల్లే దర్యాప్తు ప్రారంభమైందనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదుతో ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి వచ్చిందని తెలిపారు. అంతే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పెట్టిన కేసేమీ కాదన్నారు. ప్రవీణ్‌కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే.. దీనిపై రాష్ట్ర డీజీపీని ఈసీ వివరణ కోరిందని చెప్పారు. ఆ తర్వాత ప్రభుత్వం మారగానే ఎస్‌ఐబీలో కొన్ని పరికరాలు కనిపించడం లేదంటూ కేసు నమోదైందని, ఆ తీగను లాగితే చివరకు ఈ కేసు బయటకు వచ్చిందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమేనని, అయితే దానిని నిబంధనలకు లోబడి, అన్ని అనుమతులు తీసుకుని చేయాలని పేర్కొన్నారు.

బహిరంగ టెండర్‌లోనే బీజేపీ నేతకు పనులు

బీజేపీ ఎంపీకి టెండర్ ఇవ్వడంపై వస్తున్న ఆరోపణలను సీఎం రేవంత్ కొట్టిపారేశారు. టెండర్ వేసిన వ్యక్తి సమర్థత, నిబంధనల ప్రకారమే టెండర్ కేటాయింపు ఉంటుందని, అందులో రహస్యమేమీ లేదని అన్నారు. అంతా ఓపెన్ టెండర్ ప్రక్రియ ద్వారా బహిరంగంగానే జరిగిందని, ఎల్‌అండ్‌టీ సంస్థ కూడా ఇందులో పోటీకి వచ్చిందని తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములను ప్రభుత్వం తాకట్టు పెట్టలేదని సీఎం స్పష్టం చేశారు. కేవలం బాండ్లు మాత్రమే ఇచ్చామన్నారు. కంచ గచ్చిబౌలిలో 3,500 ఎకరాలకు సంబంధించి ఒకే సర్వే నంబర్ ఉందని, అది ప్రభుత్వ భూమి అని స్పష్టంగా ఉందని వెల్లడించారు. ఓ ప్రైవేట్ కంపెనీకి లీజుకు ఇస్తే.. సుదీర్ఘకాలం న్యాయస్థానాల్లో పోరాడిన తర్వాత అది ప్రభుత్వ భూమిగా తేలిందని పేర్కొన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు దీనిపై స్పష్టమైన తీర్పులు ఇచ్చాయని గుర్తు చేశారు. ఏపీ మంత్రి లోకేశ్‌ను కలిస్తే తప్పేంటని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారని, తప్పు అని తానూ అనలేదని రేవంత్ తెలిపారు. తాను చంద్రబాబును పగటిపూట కలిస్తేనే తప్పు అన్నప్పుడు.. కేటీఆర్ రాత్రిపూట లోకేశ్‌ను ఎందుకు కలిశారని మాత్రమే అడిగానని చెప్పారు. ఆర్డినెన్స్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తారా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. అందుకు పతిపక్ష నేత రావాలి కదా? అని రేవంత్ వ్యాఖ్యానించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో సమావేశం జరిగినప్పుడు ప్రతిపక్ష నేతను పిలిచినా రాలేదని గుర్తు చేశారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌ను సుప్రీంకోర్టు అడ్వైజ్ మాత్రమే చేయొచ్చని, ఆర్డర్ ఇవ్వలేదని అభిప్రాయపడ్డారు.

42 శాతం సాధిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పడుతూ వస్తున్న బీసీ రిజర్వేషన్లు, కులగణనను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా పూర్తిచేసిందని తెలిపారు. దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని, దానిని బీజేపీ, బీఆర్‌ఎస్ ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే ఎన్నికలకు..

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే కృతనిశ్చయంతో తమ ప్రభుత్వం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైకోర్టు సైతం 90 రోజుల్లో (సెప్టెంబరు నెలాఖరులోగా) ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో (జూలై నెలాఖరులోగా) రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించిందని గుర్తు చేశారు. బీసీలకు విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ శాసనసభ పూర్తిస్థాయిలో చర్చించి ఆమోదించిన రెండు బిల్లులను ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. ఈ రెండు బిల్లుల ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేలను గురువారం కలవనున్నట్లు సీఎం చెప్పారు. సాయంత్రం కాంగ్రెస్ ఎంపీలకు ఈ అంశాన్ని వివరిస్తామన్నారు.

అమిత్ షాను సస్పెండ్ చేస్తారా?

బీసీల రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్.. ముస్లింలను సాకుగా చూపుతున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న మహారాష్ట్రలో ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని తెలిపారు. బీజేపీ నేతలకు దమ్ముంటే ఆ రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించాలన్నారు. గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని, ఇకపై కూడా అమలు చేస్తామని అమిత్ షా ఒక ఇంటర్వ్యూలో చెప్పిన విషయాన్ని రేవంత్ ప్రస్తావించారు. ఇందుకు బీజేపీ నేతలు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా? అని ప్రశ్నించారు. తెలంగాణలో తాము చేపట్టిన కుల సర్వేలో 56.4 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందని, 17.45 శాతం ఎస్సీలు, 10.08 శాతం ఎస్టీలు, 10.09 శాతం అగ్ర వర్గాలవారు ఉన్నట్లు వెల్లడైందన్నారు. కాగా, 3.09 శాతం మంది తాము ఏ కులానికీ చెందినవాళ్లం కాదని చెప్పారని, ఇదో కొత్త పరిణామమని అన్నారు.



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఓబీసీ రిజర్వేషన్లకు లోక్‌సభ ఎన్నికలు లిట్మస్ టెస్ట్

కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిందని సీఎం రేవంత్ అన్నారు. కులగణన చేపట్టబోమని సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించిన కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణలో తాము కులగణన చేపట్టాక తమను అనుసరిస్తూ గెజిట్ విడుదల చేసిందని పేర్కొన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు ఓబీసీ రిజర్వేషన్లకు లిట్మస్ టెస్టుగా నిలుస్తాయన్నారు. ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంతోనే 50 శాతం రిజర్వేషన్ల పరిమితి అంశం పక్కకు పోయిందన్నారు. అలాగే, స్థానిక సంస్థల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసే విషయాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నామని మరో ప్రశ్నకు సమాధానంగా సీఎం చెప్పారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు నాయకుడు లేడని రేవంత్ అన్నారు. కేసీఆర్ ఇంట్లోనే కోతుల కొట్లాట ఉందని వ్యాఖ్యానించారు. కుల పెద్దనో, కుటుంబంలోని వ్యక్తో కూర్చుని మాట్లాడితే వారి సమస్య పరిష్కారమవుతుందని, కానీ.. ఇంట్లో పంచాయితీ కేవలం ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకేనని అన్నారు. 2008లో హరీశ్‌రావు ఆనాటి సీఎం రాజశేఖర్‌రెడ్డిని కలిశారని, తర్వాత కులపెద్దలతో చర్చల్లో అంతా సవ్యంగా మారిందని గుర్తు చేశారు. ఆర్డినెన్స్‌ను గవర్నర్ తిప్పిపంపారన్న బీఆర్‌ఎస్ నేతల విమర్శలను రేవంత్‌రెడ్డి ఖండించారు. 'వాళ్లు పిచ్చోళ్లు.. వాళ్లకు ఏ అవగాహన లేదని చెప్పడానికి ఇది సరిపోదా?' అని వ్యాఖ్యానించారు. ఏ బిల్లును రాష్ట్రపతి, గవర్నర్‌కు పంపినా క్లారిఫికేషన్ కోరతారని, ఇది సర్వసాధారణమని అన్నారు. ఈ విషయంలో గవర్నర్ ఆఫీసు అడిగితే వెంటనే సమాధానం ఇచ్చామని తెలిపారు.

రేపు క్యాబినెట్ భేటీ

- బీసీల 42శాతం రిజర్వేషన్ల ఆర్డినెన్స్, స్థానిక ఎన్నికలపై చర్చించే అవకాశం

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శుక్రవారం (25న) జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలోని ఆరో అంతస్తు క్యాబినెట్ హాల్‌లో సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. ఈ మేరకు తమ శాఖలకు సంబంధించిన ఎజెండా అంశాలను పంపించాల్సిందిగా అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఆదేశించారు. కాగా, బీసీల 42 శాతం రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిర్వహించనున్న ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు మహిళలకు మరో పథకాన్ని ప్రారంభించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. మహాలక్ష్మి పథకంలో భాగంగా 18 ఏళ్లు దాటిన యువతులు, మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున భృతిని అందించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. దీనిపై క్యాబినెట్ సమావేశంలో చర్చించే అవకాశముంది. ఇక బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉంది. బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ఆమోదింపజేసుకోవడానికి ప్రభుత్వం పలు రకాలుగా ప్రయత్నిస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబరు 30లోపు నిర్వహించాల్సి ఉంది. బీసీ రిజర్వేషన్ల అంశం తేలితే తప్ప.. ఎన్నికల వ్యవహారం తేలేటట్లు లేదు. దీనిపైనా క్యాబినెట్ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలి: ముఖ్యమంత్రి రేవంత్

ఉపరాష్ట్రపతి పదవిని తెలంగాణ నేత బండారు దత్తాత్రేయకు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడం దురదృష్టకర పరిణామమన్నారు. గతంలో ఏపీకి చెందిన వెంకయ్యనాయుడుకు ఉపరాష్ట్రపతి పదవి లభించిందని, ఇప్పుడు తెలంగాణకు చెందిన నేతను ఆ పదవిలో నియమించాలని అన్నారు. బీజేపీలో బీసీలకు అన్యాయం చేస్తున్నారని రేవంత్ ఆరోపించారు. బీసీ వర్గానికి చెందిన దత్తాత్రేయను గవర్నర్ పదవి నుంచి తొలగించారని, బీసీ అయిన బండి సంజయ్‌ను రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తొలగించి.. రాంచందర్‌రావుకు కట్టబెట్టారని విమర్శించారు. తమ ప్రాంత నాయకుల తల్లిని ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా కోసేసిందని వ్యాఖ్యానించారు. అక్కడి నుంచి అసలు నాయకత్వమే లేకుండా చేయడమనే కుట్ర దీని వెనుక ఉందని ఆరోపించారు. దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వడం ద్వారా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. అయితే తాను ఈ డిమాండ్‌ను తెలంగాణ ప్రజల తరఫున చేస్తున్నానని, ఇండియా కూటమి తరఫున కాదనితెలిపారు. అది ఏఐసీసీ స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయమన్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ నాయకత్వంతో తెలంగాణ పక్షాన మాట్లాడతానన్నారు. దత్తాత్రేయ పేరు మోదీ ప్రకటిస్తే తాను ఇండియా కూటమి నేతలతో కూడా మాట్లాడతానని చెప్పారు. దత్తాత్రేయకు పదవి ఇస్తే తెలంగాణలో బీసీలకు న్యాయం జరిగినట్లు కూడా అవుతుందని అన్నారు. మోదీ బీసీ కాదని, కన్వర్టెడ్ బీసీ అని రేవంత్ వ్యాఖ్యానించారు.

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ సంకల్పం

- పెట్టుబడులతో వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం
- పరిశ్రమలు వెళ్లిపోతున్నాయనేది బీజేపీ, బీఆర్‌ఎస్ దుష్ప్రచారం
- మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కొత్త పరిశ్రమలు వచ్చి, స్థానిక యువతకు ఉపాధి దక్కాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ పురోగతిలో భాగస్వాములయ్యే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. పెట్టుబడులతో రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని, నిబంధనల పేరిట ఇబ్బంది పెట్టమని స్పష్టం చేశారు. సీఐఐ, ఫిక్కీ, ఎఫ్‌టీసీసీఐ, ఎలీప్, టిఫ్, టాప్మా, టీఎస్ టీఎంఏ తదితర పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు ఈ మేరకు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమను కాపాడుకుంటామని, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈ రంగానికి అండగా ఉంటామని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం మాదిరిగా ఏకపక్షంగా వ్యవహరించమని, పారిశ్రామికాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకొచ్చామని, ప్రైవేటు రంగంలో లక్ష మందికి పైగా ఉపాధి కల్పించామని వివరించారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ బీఆర్‌ఎస్, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయా సంఘాల ప్రతినిధులకు వివరించిన మంత్రి శ్రీధర్‌బాబు.. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ కనీస వేతనాల సలహా బోర్డు అధ్యక్షుడు బీ జనక్ ప్రసాద్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డినెన్స్‌ను ఆమోదిస్తారా?

- గవర్నర్ నిర్ణయం కోసం నిరీక్షణ
- హైకోర్టు ఆదేశాల మేరకు రేపటిలోగా రిజర్వేషన్లను ఖరారు చేయాలి
- ఏమీ తేల్చకపోతే..క్యాబినెట్‌లో నిర్ణయం?

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పించేందుకు చేసిన ఆర్డినెన్స్ దస్త్రం ఇంకా రాజ్‌భవన్‌లోనే ఉంది. ఈ ఆర్డినెన్స్‌పై గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదు. ఆయన ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎదురు చూస్తోంది. మరోవైపు ఈ నెల 25కల్లా రాష్ట్రంలో స్థానిక సంస్థలకు రిజర్వేషన్లను ఖరారు చేయాలని, సెప్టెంబరు 30లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పించేందుకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం- 2018లోని సెక్షన్ 285(ఏ) సవరణ కోసం గవర్నర్‌కు పంపిన ఆర్డినెన్స్ దస్త్రం ముందుకు కదలకపోవడంతో రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ కూడా నిలిచిపోయింది. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలంటూ పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వారు పోలింగ్ బూత్‌ల వారీగా వివరాలను సిద్ధం చేస్తున్నారు. కానీ, ఆర్డినెన్స్‌పై గవర్నర్ స్పందించకపోవడం, హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారంతో రిజర్వేషన్ల ఖరారుకు గడువు ముగియనున్న నేపథ్యంలో.. మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని సర్కారు ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. శుక్రవారం సాయంత్రం క్యాబినెట్ భేటీ జరగనుంది. ఆలోపు ఆర్డినెన్స్ వస్తే రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను చేపట్టనున్నారు. మంత్రివర్గ సమావేశం లోపు ఆర్డినెన్స్‌కు ఆమోదం లభించకపోతే స్థానిక ఎన్నికల నిర్వహణ, బీసీలకు 42% రిజర్వేషన్లపై ఎలా ముందుకెళ్లాలనేదానిపై భేటీలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అన్ని సామాజిక వర్గాల రిజర్వేషన్లు కలిపి 50 శాతం మించరాదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రిజర్వేషన్లను పెంచుకునేందుకూ అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 285(ఏ)ను సవరించాలని గత క్యాబినెట్‌లో నిర్ణయించడంతో పాటు రిజర్వేషన్లకు ఇప్పటివరకు ఉన్న గరిష్ఠ పరిమితిని ఎత్తివేయాలని నిర్ణయించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకూడదంటూ సెక్షన్ 285(ఏ)లో ఉన్న నిబంధనను సవరించనున్నారు. దీనికి గవర్నర్ ఆమోదం ఉండాలి. సవరణకు గల కారణాలన్నింటినీ వివరిస్తూ ఆర్డినెన్స్‌ను రూపొందించిన సర్కారు.. గవర్నర్‌కు పంపింది. ఆయన ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ఉత్కంఠ నెలకొంది.

వైద్య కళాశాలల్లో 309 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతి

- త్వరలో అసిస్టెంట్ నుంచి అసోసియేట్ పదోన్నతులు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య సంచాలకుల పరిధిలోని వైద్య కళాశాలల అధ్యాపకులకు రికార్డు స్థాయిలో పదోన్నతులు కల్పించారు. 33 విభాగాల్లో 309 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతినిస్తూ వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ బుధవారం 3 వేర్వేరు జీవోలు జారీ చేశారు. పదోన్నతులు పొందిన అధ్యాపకులంతా 15 రోజుల్లో పోస్టింగ్స్ ఇచ్చిన కాలేజీల్లో చేరాలని ఆ జీవోలో పేర్కొన్నారు. జనరల్ మెడిసిన్ విభాగంలో 32 మంది, జనరల్ సర్జరీలో 31, గైనకాలజీలో 22, అనస్థీషియాలో 10, ఆప్తమాలజీ, రేడియాలజీ విభాగాల్లో 17 చొప్పున, డెర్మటాలజీలో 16, పిడియాట్రిక్స్‌లో 14, ఈఎన్‌టీలో 12, ఆర్థోపెడిక్‌లో 11, మైక్రో బయాలజీలో 10, బయో కెమిస్ట్రీ, ఎస్పీఎం విభాగాల్లో 9, టీబీసీడీ, ఫిజియాలజీల్లో 8, సైకియాట్రీలో 6, అనాటమీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఫార్మ కాలజీల్లో 5, పాథాలజీలో 4, డెంటల్ సర్జరీలో ఇద్దరు, రేడియోపతి, పిడోడోంటిక్స్, పెరీడోంటిక్స్‌ల్లో ఒక్కొక్కరికి అసోసియేట్ నుంచి ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించారు. ఇక, సూపర్ స్పెషాలిటీ విభాగంలో న్యూరో సర్జరీలో 6, ప్లాస్టిక్ సర్జరీలో 5, కార్డియాలజీలో 4, యూరాలజీలో ముగ్గురు, న్యూరాలజీ, నెఫ్రాలజీల్లో ఇద్దరు, సర్జికల్ ఆంకాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, పిడియాట్రిక్ సర్జరీల్లో ఒక్కొక్కరికి పదోన్నతి కల్పించారు. ఇటీవల అదనపు వైద్య విద్యా సంచాలకులుగా (ఏడీఎంఈ)గా పదోన్నతులు పొందిన 44 మంది ప్రొఫెసర్లను ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లుగా, బోధనాస్పత్రుల సూపరింటిండెంట్లుగా పోస్టింగ్స్ ఇవ్వగా, 10 మంది మినహా మిగిలిన వారంతా తమకు కేటాయించిన ప్లేసుల్లో జాయినింగ్ రిపోర్టు ఇచ్చినట్లు వైద్యవిద్య సంచాలకులు నరేంద్రకుమార్ తెలిపారు. త్వరలో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇవ్వనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించి.. పారదర్శకంగా పోస్టింగ్‌లు ఇచ్చినందుకు ప్రభుత్వానికి తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బొల్లెపాక కిరణ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ మాదాల కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

సీఎస్‌ఈలో సీటొచ్చినా చేరలే!

- ఇలా చేరని విద్యార్థులు 12,244 మంది
- అనుబంధ బ్రాంచిల్లో ఐదో వంతు సీట్లు ఖాళీ
- ఇది తొలి విడత కౌన్సెలింగ్ తర్వాత లెక్క

హైదరాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్‌ఈ), దాని అనుబంధ బ్రాంచిల్లో మొదటి విడతలోనే సీటు వచ్చినా 12,244 మంది విద్యార్థులు చేరలేదు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), డేటా సైన్స్ (డీఎస్) తదితర సీఎస్‌ఈ అనుబంధ కోర్సుల్లో మొదటి విడతలో 57,042 మందికి సీట్లు కేటాయించారు. సీటు పొందినవారు ఈ నెల 22లోపు ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంది. లేనిపక్షంలో సీటు రద్దవుతుంది. అయితే గడువు ముగిసేనాటికి 57,042 మందిలో 44,798 (78.53 శాతం) మంది మాత్రమే చేరారు. అలాగే ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అనుబంధ బ్రాంచిల్లో మొత్తం 14,054 మందికి సీట్లు ఖరారు కాగా 10,594 మంది (75.38 శాతం), సివిల్, మెకానికల్ అనుబంధ బ్రాంచిల్లో 5,632 మందికి 3,943 (70.01 శాతం) మంది మాత్రమే చేరారు. మొత్తం 47 బ్రాంచిలు కలిపి... సీటొచ్చినా చేరని విద్యార్థుల సంఖ్య 17,581గా ఉంది. ఈ సీట్లను రెండో విడతలో భర్తీ చేయనున్నారు. సాంకేతిక కారణాలతో కొన్ని కాలేజీలను మొదటి విడత కౌన్సెలింగ్‌లో చేర్చలేదు. వాటిని కలుపుకుంటే రెండో విడతలో దాదాపు 25 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉంటాయి. అదనపు సీట్ల విషయం ప్రభుత్వం వద్ద పెండింగులో ఉంది. అవి ఖరారైతే సీట్ల సంఖ్య మరింత పెరుగుతుంది. రెండో విడత ముగిసి.. 'ఇంటర్నల్ స్లైడింగ్' ప్రక్రియ పూర్తయిన తర్వాత.. ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు. రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యా శాఖ బుధవారం విడుదల చేసింది. 26న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. 26, 27న ఆప్షన్లకు అవకాశం ఇచ్చారు. ఈ నెల 30న రెండో విడత జాబితా ప్రకటిస్తారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు..
విచారణ పేరుతో వేధింపులు

» సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న ప్రభాకర్‌రావు

» మధ్యంతర ఉపశమనం రద్దు దిశలో సిట్ అడుగులు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ కేసులో విచారణ పేరుతో సిట్ అధికారులు తనను వేధిస్తున్నారని పేర్కొంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించే దిశలో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. తనను పలుమార్లు విచారణ పేరుతో సిట్ కార్యాలయానికి పిలిపించారని, గంటల కొద్దీ కూర్చోబెట్టి, మానసికంగా వేధించారని ఆయన కోర్టుకు తెలియజేయనున్నట్లు సమాచారం. అదే సమయంలో.. సిట్ కూడా ప్రభాకర్‌రావు విచారణలో తమకు ఏమాత్రం సహకరించడం లేదని, ఆయనకు ఇచ్చిన మధ్యంతర ఉపశమనాన్ని రద్దుచేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే సిట్ డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీ వెళ్లి.. న్యాయవాదులను కలిసి, వచ్చారు. వచ్చేనెల 5న సుప్రీంకోర్టులో ప్రభాకర్‌రావు పిటిషన్‌పై తదుపరి విచారణ జరగనుంది. అప్పటి వరకు ఆయనను అరెస్టు చేయవద్దని కోర్టు పోలీసులను ఆదేశించింది. దీంతో.. సిట్ తమ విచారణకు సంబంధించిన వీడియో ఫుటేజీని కోర్టుకు సమర్పించి.. ప్రభాకర్‌రావు ఏమాత్రం సహకరించడం లేదంటూ ఆధారాలను చూపేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు.. ఈ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని ఈ నెల 24న విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే..! అయితే.. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో తాను రాలేనని, ఈనెల 28న విచారణకు హాజరు కాగలనని పేర్కొంటూ ఆయన సిట్‌కు ఓ లేఖ రాశారు.

దేమీకలాన్ గ్రామంలో డయేరియా కలకలం

» తండ్రీ కొడుకుల మృతి, పలువురికి అస్వస్థత

తాడ్వాయి/ కామారెడ్డి టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని దేమీకలాన్ గ్రామంలో డయేరియా వ్యాప్తి కలకలం రేపుతోంది. తీవ్ర వాంతులు, విరోచనాలతో గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందగా 30 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన మెట్టు సాయిలు (70) తీవ్ర వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ఈనెల 14న మృతి చెందగా అతడి కుమారుడు మెట్టు స్వామి (34) కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 22న మృతి చెందాడు. మరో ఎనిమిది మంది కామారెడ్డి జనరల్ ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. అప్రమత్తమైన వైద్యాధికారులు గ్రామంలో బుధవారం మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి, ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నారు. డయేరియాగా ప్రజలు అనుమానిస్తున్నప్పటికీ వైద్యాధికారులు ఇంకా ధ్రువీకరించలేదు. డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులకు, అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఆర్టీసీ బస్సుకు నిప్పు... 20 లక్షల నష్టం

» పోలీసుల అదుపులో అయిదుగురు అనుమానితులు

మిర్యాలగూడ అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలో బుధవారం తెల్లవారుజామున నిలిపి ఉంచిన ఆర్టీసీ బస్సు అగ్నికి ఆహుతైంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో బస్సు లోపలి భాగం పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఆర్టీసీకి సుమారు రూ.20 లక్షల నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. మిర్యాలగూడ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సును రోజూవారీగా మంగళవారం రాత్రి తడకమళ్ల గ్రామంలో నిలిపి (నైట్‌హాల్ట్) ఉంచారు. వర్షం కురుస్తుండడంతో డ్రైవర్ శంకరయ్య, కండక్టర్ బాలకృష్ణ పక్కనే ఉన్న పాఠశాల భవనంలో నిద్రించడానికి వెళ్లారు. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బస్సులో మంటలు చెలరేగడాన్ని గుర్తించిన వారు వెంటనే గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. బస్సు డ్రైవర్ క్యాబిన్ డోర్ తెరిచి చూడగా, లోపల మద్యం సీసాలు కనిపించాయి. గుర్తుతెలియని వ్యక్తులు బస్సులో మద్యం తాగి, ఆ తర్వాత నిప్పుపెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురాగా, అప్పటికే బస్సు లోపలి భాగం, వెనుక టైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. తడకమళ్లకు చెందిన ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

కిడ్నీ మార్పిడి కేసులో మరో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన కిడ్నీ రాకెట్ కేసుకు సంబంధించి తాజాగా ఇద్దరు కీలక నిందితులను బుధవారం సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. నిందితులు ప్రదీప్ కుమార్ గుప్తా, పవన్ కుమార్‌ను మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామని సీఐడీ అదనపు డీజీ చారు సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు 19 మందిని అరెస్టు చేశామని ఆమె చెప్పారు. హర్యానాలోని గుర్గావ్‌లో నివసించే ప్రదీప్ కుమార్ గుప్తా.. చండీగఢ్, గుజరాత్, మహారాష్ట్రల్లో కిడ్నీ రోగులను గుర్తించేవాడన్నారు. వారికి తక్కువ ధరకే ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయిస్తామని నమ్మించి, హైదరాబాద్‌కు తీసుకుని వచ్చేవాడని చెప్పారు. ఇక పవన్ కుమార్ తమిళనాడు నుంచి కిడ్నీ దాతలను రప్పించి.. వారికి ఇక్కడి వివిధ ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేయించేవారని ఆమె వివరించారు. కిడ్నీ గ్రహీతల నుంచి నిందితులు రూ. 30 లక్షలు వసూలు చేసి.. చెరో రూ. 10 లక్షలు తీసుకునేవారని చారు సిన్హా తెలిపారు. ఇప్పటి వరకు ప్రదీప్ పది మందికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించాడని, వచ్చిన డబ్బుతో విలాసవంతమైన జీవితం గడిపేవాడని ఆమె అన్నారు.

'సిగాచి' ప్రమాద మృతుల కుటుంబాలకు
రూ.10 లక్షల చొప్పున మధ్యంతర పరిహారం

» మొదటి విడతలో 15 కుటుంబాలకు అందజేత

» సిగాచి పరిశ్రమ సీఈవో, ఎండీ అమిత్‌రాజ్ సిన్హా

పటాన్‌చెరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు యాజమాన్యం మధ్యంతర పరిహారంగా రూ.10 లక్షల చొప్పున అందజేస్తోంది. బుధవారం తొలి విడతలో 15 కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సమక్షంలో నగదును బదిలీ చేసింది. ఈ ప్రమాదంలో మరణించిన 46 మంది కార్మికుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని పరిశ్రమ సీఈవో, ఎండీ అమిత్‌రాజ్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా మృతుల కుటుంబాలకు కూడా దశలవారీగా మధ్యంతర పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గల్లంతైన మరో 8 మంది కార్మికుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున మధ్యంతర పరిహారం అందజేస్తామని తెలిపారు. మొదటి విడతలో మొత్తం రూ.5.80 కోట్ల మధ్యంతర పరిహారం అందజేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. బాధిత కుటుంబాలకు ఇచ్చిన మాట ప్రకారం పూర్తి పరిహారాన్ని త్వరలోనే అందిస్తామని తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు
సుంకర రామచంద్రరావు కన్నుమూత

» ఆంధ్రజ్యోతిలో సుదీర్ఘ కాలం పాత్రికేయుడిగా సేవలు



హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయుడు, మనస్తత్వ శాస్త్ర రచనల అనువాదకుడు సుంకర రామచంద్రరావు (74) కన్నుమూశారు. కొంతకాలం నుంచి మూత్ర పిండాల సమస్యతో బాధపడుతున్న ఆయన.. మంగళవారం తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూనే కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. రామచంద్రరావు స్వస్థలం విజయవాడ. ఆయన తండ్రి సుంకర శివరామయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పనిచేశారు. రామచంద్రరావు డిగ్రీ పూర్తిచేసిన అనంతరం ఆంధ్రభూమిలో పాత్రికేయ జీవితం ప్రారంభించారు. తర్వాత ఆంధ్రజ్యోతి సెంట్రల్ డెస్క్, అంతర్జాతీయ వార్తల అనువాద విభాగాల్లో సుదీర్ఘ కాలం పనిచేశారు. మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో సుంకర రామచంద్రరావు అంత్యక్రియలు పూర్తి చేసినట్టు ఆయన కుమారుడు శివరామ్ తెలిపారు.

అది అటవీ భూమి కానేకాదు

(మొదటిపేజీ తరువాయి)

రామకృష్ణారావు మంగళవారమే సమగ్ర అంశాలు, చిత్రాలతో కూడిన అఫిడవిట్ దాఖలు చేశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ అఫిడవిట్‌పై స్పందించేందుకు కొంత సమయం కావాలని అమికస్ క్యూరీ పరమేశ్వర్, సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు కోరారు. దీనితో ధర్మాసనం విచారణను ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేసింది. అనంతరం సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతానికైతే అక్కడ అటవీ భూమిని పరిరక్షించారు కదా?' అని ప్రశ్నించారు. అభిషేక్ సింఘ్వీ జోక్యం చేసుకొని.. అది అటవీ భూమి కాదని, ఈ అంశంపైనే విచారణ జరగాల్సి ఉందని వివరించారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ "అది ఏ భూమి అయినా అక్కడ చెట్ల నరికివేత ఆగిపోయింది కదా? నేను కూడా సుస్థిర అభివృద్ధిని కాంక్షిస్తాను. స్థిరమైన అభివృద్ధి ముఖ్యమే.. కానీ రాత్రికి రాత్రి 30 బుల్డోజర్లు తెచ్చి చెట్లను కూల్చివేయడం సమంజసం కాదు" అని పేర్కొన్నారు.

అభివృద్ధికి ఆ భూమి కీలకం



హైదరాబాద్ మహానగర పరిధిలో కంచ గచ్చిబౌలి భూమి అత్యంత కీలకమని సుప్రీంకోర్టుకు సమర్పించిన తాజా అఫిడవిట్‌లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. "గచ్చిబౌలి, నానక్‌రామ్ గూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఇతర ఐటీ కారిడార్లలో అభివృద్ధి తారస్థాయికి చేరుకున్నందు వల్ల ప్రస్తుత భూమి మౌలిక సదుపాయాలు ఏర్పరిచేందుకు, కొత్త టెక్నాలజీ క్యాంపస్‌లను నిర్మించేందుకు అవసరం. దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. 2007 నుంచి 2014 మధ్య కోర్టుల్లో కేసుల నేపథ్యంలో కంచ గచ్చిబౌలి ప్రాంతంలో చెట్లు, మొక్కలు, పొదలు పెరిగాయి. అంత మాత్రాన దాన్ని అడవిగా భావించవద్దు. అసలు కంచ అంటే సాగుచేయని వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగించే భూమి అని అర్థం. అది అటవీ భూమి కాదనేందుకు ఇదొక న్యాయపరమైన సూచిక. 2001 అక్టోబర్ 29న జారీ అయిన జీవో 538 ప్రకారం ఈ భూమిని ప్రజా అవసరాల కోసం అభివృద్ధి చేసేందుకు నోటిఫై చేశారు. 2006, 2024లో సేకరించిన ఉపగ్రహ చిత్రాల ప్రకారం చూసినా అది అటవీ భూమి కాదన్న విషయం స్పష్టం అవుతోంది. అయినా చెట్ల సంరక్షణ కోసం తగిన చర్యలు తీసుకున్నాం. కూల్చిన చెట్లకు బదులుగా సాధ్యమైన చోటల్లా తిరిగి నాటుతున్నాం" అని వివరించింది.

హ్యామ్ 'బాట'లో తొలి అడుగు!

ఆర్‌అండ్‌బీ పరిధిలో 373 రోడ్లకు సర్కారు ఆమోదం.. ఉత్తర్వులు జారీ

» మంచి రోడ్లు అభివృద్ధికి చిహ్నం

» మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



హైదరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) విధానంలో ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో కొత్త రోడ్లను నిర్మించాలని, ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆ దిశగా తొలి అడుగు పడింది. ఆర్ అండ్ బీ శాఖలోని 16 సర్కిళ్లలో 5,190 కి.మీ మేర ఉన్న 373 రోడ్ల పనుల కోసం రూ.6,478.33 కోట్లు అవసరం అన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు 350 కి.మీ మేర రోడ్లను విస్తరించనున్నట్లు, మరో 4,840 కి.మీ రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందులో ఉమ్మడి నల్లగొండ పరిధిలో 537 కి.మీ మేర రోడ్లున్నాయి. వీటి కోసం రూ.623 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో పనులను రెండు భాగాలుగా విభజించారు. నల్లగొండ-1లో 231.12 కి.మీ మేర 18 పనులను.. నల్లగొండ-2లో 314.66 కి.మీ మేర 26 పనులు చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రోడ్లలో ఎక్కువ విస్తీర్ణంలో అంటే.. 2,900 కి.మీ మేర రోడ్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ఉండటంతోనే ఈ కేటాయింపులు చేసినట్లుగా భావిస్తున్నారు. కాగా హ్యామ్ విధానంలో తొలివిడతలో 373 రోడ్ల కోసం రూ.6,478 కోట్లు అంచనా వేశారని, ఆ పనుల నిర్వహణకు కన్సల్టెన్సీలు పలు విధానాలను సూచించాయని, వాటిలో సర్కిళ్ల ప్రకారమే పనులు నిర్వహించాలని శాఖ నిర్ణయించిందని చెబుతూ జూలై 4న 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లోనూ కన్సల్టెన్సీలు సూచించిన విధానాలు ఉన్నాయి. సర్కిళ్ల ప్రకారమే పనులను చేపట్టాలని నిర్ణయించిన విషయాన్ని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌అండ్‌బీకి 16 సర్కిళ్లు ఉండగా.. నల్లగొండ పనులను 2 భాగాలుగా చేయడంతో సర్కిళ్ల లెక్క 17గా ఉత్తర్వుల్లో పొందుపర్చారు.

హ్యామ్ విధానం అంటే

సాధారణంగా రోడ్ల నిర్మాణం సహా పలు పనులను ఇంజనీరింగ్-ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ), బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానాల్లో ఎక్కువగా చేస్తుంటారు. వీటిలో ఈపీసీ విధానం నిర్మాణం ద్వారా ప్రభుత్వంపై ఒకేసారి భారం పడుతుంది. బీవోటీ పద్ధతిలో కాంట్రాక్టు సంస్థే మొత్తం వ్యయాన్ని భరిస్తుంది. ఆ తరువాత టోల్‌గేట్ల ద్వారా చేసిన ఖర్చును రాబట్టుకుంటుంది. ఈ రెండు పద్ధతులను కలిపి ప్రభుత్వానికి సులభంగా ఉండేలా, ప్రజలపై భారం పడకుండా హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) విధానాన్ని రూపొందించారు. ఈ విధానంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు, కాంట్రాక్టు సంస్థలకు ప్రభుత్వం తొలుత 40 శాతం నిధులను అందిస్తుంది. మిగిలిన 60 శాతం నిధులను కాంట్రాక్టు సంస్థలే భరించి పనులు పూర్తిచేస్తాయి. ఆ సంస్థలు భరించిన 60శాతం నిధులను ప్రభుత్వం 15ఏళ్ల పాటు ఏటా కొంత చొప్పున వడ్డీతో సహా చెల్లిస్తుంది. అయితే ఈ రోడ్లపై టోల్‌గేట్లు పెట్టకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. హ్యామ్ విధానంలో గ్రామీణ రోడ్లను నిర్మించడం, విస్తరించడం రాష్ట్రంలో ఇదే మొదటిసారి.

ఆర్‌అండ్‌బీలో మొదటి దశలో చేపట్టే పనులు ఇవే.. (సర్కిళ్ల వారీగా)

సర్కిల్	రోడ్ల పనులు	కి.మీ.లు	ఖర్చు (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	18	313.09	365.68
కొత్తగూడెం	10	266	380.90
హనుమకొండ	39	394.42	467.90
జగిత్యాల	28	346.09	435.80
భూపాలపల్లి	10	194.23	249.31
కరీంనగర్	20	229.03	259.50
ఖమ్మం	35	382.29	468.98
మహబూబ్‌నగర్	26	380.85	434.19
మంచిర్యాల	12	259.23	294.29
నల్లగొండ-1	18	223.12	302.45
నల్లగొండ-2	26	314.66	320.80
నిజామాబాద్	24	362.83	438.54
రంగారెడ్డి	25	281.56	367.75
సంగారెడ్డి	26	387.19	523.47
సిద్దిపేట	25	289	379.69
వనపర్తి	15	279.16	399.34
యాదాద్రి	16	287.50	389.73
మొత్తం	373	5,190.25	6,478.33

సీఎంకు కృతజ్ఞతలు: మంత్రి కోమటిరెడ్డి

హ్యామ్ విధానంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో చేపట్టాల్సిన రోడ్లకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంచి రోడ్లు అభివృద్ధికి చిహ్నం అని, రాష్ట్రంలో మెరుగైన బీటీ రోడ్లు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి, మండలం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసల రోడ్లకు శ్రీకారం చుట్టామని చెప్పారు. హ్యామ్ రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించామని చెబుతూ ఉత్తర్వులు జారీ చేయడంపై సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపారు.

న్యూ ఇన్‌ఫ్రాలో ఈడీ సోదాలు

» మనీలాండరింగ్ ఆరోపణలతో హైదరాబాద్‌లో తనిఖీలు

» రూ.120 కోట్ల విలువైన ఆస్తులు, 33 బ్యాంకు ఖాతాలు సీజ్

» బ్యాంకులను మోసగించి, రుణాల

» దారిమళ్లింపు ఆరోపణలతో ఇప్పటికే సీబీఐ కేసు

హైదరాబాద్, జూలై 23: బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను దారి మళ్లించి మనీల్యాండరింగ్‌కు పాల్పడ్డాయనే ఆరోపణలతో హైదరాబాద్‌లోని న్యూ ఇన్‌ఫ్రా (సిల్), ప్రసాద్ అండ్ కంపెనీ ప్రాజెక్ట్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ (పీఎస్‌పీడబ్ల్యూపీఎల్) సంస్థల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం సోదాలు చేసింది. కంపెనీల కార్యాలయాలతోపాటు ప్రమోటర్ల నివాసాల్లోనూ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను, సుమారు రూ.120 కోట్లు విలువైన ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నామని.. ఈ సంస్థలు, వాటి ప్రమోటర్లు, కుటుంబ సభ్యులకు చెందిన 33 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశామని ఈడీ అధికారులు ప్రకటించారు. సిల్, పీఎస్‌పీడబ్ల్యూపీఎల్ సంస్థలు కలసి 'న్యూ ఎల్ఎస్‌వై హైవేస్ లిమిటెడ్' పేరిట కన్సార్షియంగా ఏర్పడి.. ఉత్తరప్రదేశ్‌లో ఒక హైవే నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకున్నాయి. దీనిని చూపి పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలోని 14 బ్యాంకుల కన్సార్షియం నుంచి రూ. 1,700 కోట్ల రుణం మంజూరు చేయించుకున్నాయి. ఇందులో రూ.603 కోట్లు రుణం విడుదలైంది. అయితే ఈ రుణాన్ని.. సిల్ గ్రూపు కంపెనీల మధ్య సబ్ కాంట్రాక్టుల పేరిట దారి మళ్లించారని, బ్యాంకులకు చెల్లించకుండా ఎగ్గొట్టారన్న ఫిర్యాదులపై గతంలో సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కంపెనీలు దారి మళ్లించిన సొమ్మును అక్రమ మార్గాల ద్వారా తరలించారనే ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది.

రూ.69 లక్షల విలువైన కొకైన్ సీజ్

స్థానిక పెడ్లర్..నలుగురు ముంబై స్మగ్లర్ల అరెస్టు

నగరంలో అక్రమంగా 4వేలమంది విదేశీయులు

వీరిలో 844 మంది నైజీరియన్లు

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికా దేశాల నుంచి సముద్ర మార్గంలో ముంబైకి.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్‌ను సరఫరా చేసే ముఠా ఆటను హైదరాబాద్ నార్కోటిక్స్ వింగ్(హెచ్-న్యూ) పోలీసులు కట్టించారు. లోకల్ పెడ్లర్, ముంబైకి చెందిన నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, రూ.69 లక్షల విలువైన 276 గ్రాముల కొకైన్‌ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వివరాలను వెల్లడించారు. నగరంలో కొకైన్ విక్రయాలపై హెచ్-న్యూ నిఘా పెట్టింది. ఈ క్రమంలో రవికుమార్ వర్మ, సచిన్ అనే ఇద్దరు డ్రగ్స్ వినియోగదారులను అదుపులోకి తీసుకుని, విచారించగా.. ముంబై డ్రగ్స్ ముఠా డొంక కదిలింది. నగరంలోని డ్రగ్స్ పెడ్లర్ ప్రేమ్ ఉపాధ్యాయ్‌కి.. ముంబైకి చెందిన స్మగ్లర్లు ముజఫిర్ వాహీద్ షేక్ అలియాస్ ముజఫర్, వినోద్ కృష్ణలాల్ శ్రీవాత్సవ్ అలియాస్ వినోద్, చైతన్య వినాయక్ వాగ్ అలియాస్ చైతన్య, ముస్తాక్ ఖాన్ అలియాస్ ఇమ్రాన్‌తో ఉన్న లింకును హెచ్-న్యూ బృందాలు గుర్తించాయి. వీరందరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముజఫర్, వినోద్‌కు ముంబైలో ఉండే నైజీరియన్లతో పరిచయం ఏర్పడి.. డ్రగ్స్ దందా చేస్తున్నట్లు సీపీ వివరించారు. లోకల్ పెడ్లర్ ప్రేమ్ జేఎస్ఆర్ సన్‌సిటీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తూ.. డ్రగ్స్‌కు బానిసయ్యాడని, ఆ తర్వాత గోవా నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి, నగరంలో విక్రయించడం ప్రారంభించాడని చెప్పారు. ఇతనిపై గతంలో పలు డ్రగ్స్ కేసులున్నట్లు వెల్లడించారు. ఇప్పుడు ముంబైలోని డ్రగ్స్ మూలాలపై, నైజీరియన్ల దందాపై దృష్టిసారించామని పేర్కొన్నారు. కాగా.. తొలుత పట్టుబడ్డ కస్టమర్లు రవికుమార్ వర్మ, సచిన్ నెట్‌వర్క్ పైనా హెచ్-న్యూ బృందాలు దృష్టి సారించాయి.

నైజీరియాకు డిపోర్టేషన్: సీపీ

వీసా గడువు ముగిసినా దేశంలోనే తిష్టవేసి, నేరాలకు పాల్పడుతున్న నైజీరియా దేశస్థులను డిపోర్టేషన్ ప్రక్రియ ద్వారా వెనక్కి పంపాలని నిర్ణయించినట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. డ్రగ్స్ దందాలో ఉన్న నైజీరియన్లను హెచ్-న్యూ ద్వారా వెనక్కి పంపుతామని చెప్పారు. ఇటీవల హెచ్-న్యూ అరెస్టు చేసిన నైజీరియన్లు అఫుల్ క్లైమెంట్ అలియాస్ అఫుల్ డేవిడ్, లాజరస్ చిన్‌వెన్‌మేరీ ఫేవర్‌ను వవిచారించిన క్రమంలో.. వారు గతంలో ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టై.. జైలుకు వెళ్లొచ్చినట్లు తేలింది. దీంతో వారిని డిపోర్ట్ చేయాలని నిర్ణయించినట్లు సీపీ ఆనంద్ తెలిపారు. కాగా.. నగరంలో 4,375 మంది విదేశీయులు అక్రమంగా నివసిస్తున్నారు. వీరిలో 844 మంది నైజీరియన్లని సీపీ వివరించారు.

వీసా గడువు ముగిసినా..
వారిని భారత్ నుంచి పంపలేం..!

» విదేశీ నేరగాళ్ల 'కాంట్రాక్ట్' పెళ్లిళ్లు

» పథకం ప్రకారం గృహహింస కేసులు

» అవి తేలే వరకు భారత్‌లోనే మకాం

» యథేచ్ఛగా నేరాలు, మోసాలు



హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడి తర్వాత.. భారత్‌లో ఉన్న పాకిస్థానీలను వెంటనే దేశం విడిచిపెట్టాలని కేంద్రం ఆదేశించిన విషయం గుర్తుందా? హైదరాబాద్‌లో ఉన్న పాకిస్థానీలను పోలీసులు యుద్ధ ప్రాతిపదికన గుర్తించినా.. వారిని వెనక్కి పంపలేకపోయారు. అందుక్కారణం.. వారు ఇక్కడి వారితో కాంట్రాక్టు పెళ్లిళ్లు చేసుకోవడం.. వారిపై గృహ హింస కేసులుండడమే..! సాధారణంగా క్రిమినల్ కేసులో కోర్టులు పాస్‌పోర్టులను సీజ్ చేస్తుంటాయి. అలాంటి సందర్భాల్లో విదేశీయులను వెనక్కి పంపడంలో న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత.. కాంట్రాక్టు పెళ్లిళ్ల పేరుతో భారత్‌లో మకాం పెట్టిన విదేశీయులు.. ముఖ్యంగా విదేశీ నేరస్తుల ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

కాంట్రాక్టు పెళ్లిళ్లతో..

ఒకప్పుడు అరబ్బు షేక్‌లు కాంట్రాక్ట్ పెళ్లిళ్ల కోసం హైదరాబాద్ వచ్చేవారు. ఇక్కడి అమ్మాయిలను భారీ కన్యాశుల్కం ఇచ్చి, పెళ్లి చేసుకునేవారు. ఒకట్రెండు నెలలు ఇక్కడే గడిపి, వెళ్లిపోయేవారు. నిజానికి ఇలాంటి పెళ్లిళ్లు భారత్‌లో చట్టబద్ధం కాదు. ఇప్పుడు సైబర్ నేరాలకు పాల్పడే నైజీరియా ముఠాలు, డ్రగ్స్ గ్యాంగ్‌లు, ఇతర విదేశీ మోసగాళ్లు భారత్‌లో తిష్ట వేసేందుకు కాంట్రాక్టు పెళ్లిళ్లను వరంగా మార్చుకున్నారు. విదేశీ నేరగాళ్లు పథకం ప్రకారం ఇక్కడి మహిళలను కాంట్రాక్టు పెళ్లి చేసుకుంటారు. ఆ తర్వాత తమ పథకంలో భాగంగా భార్యతో స్థానిక ఠాణాలో గృహ హింస కేసు పెట్టిస్తారు. అంతే.. కౌన్సెలింగ్‌కు భర్త (విదేశీ నేరస్తుడు) వెళ్లినా.. భార్య వెళ్లదు. అలా కేసును నెలలు, సంవత్సరాలపాటు పొడిగిస్తారు. ఒకవేళ తాము ఏదైనా సైబర్, డ్రగ్స్, ఇతర కేసుల్లో అరెస్టయితే.. పోలీసులు తమను డీపోర్ట్ చేయకుండా గృహ హింస కేసులు తమను కాపాడుతాయనేది నేరగాళ్ల విశ్వాసం. ఒకవేళ ఆయా కేసుల్లో పోలీసులు అరెస్టు చేసినా.. రోజుల్లోనే బెయిల్‌పై బయటకు వచ్చి.. మళ్లీ నేరాలకు పాల్పడుతుంటారు.

ఇవీ కొన్ని ఉదాహరణలు..

- కొద్దిరోజుల క్రితం సైబర్ క్రైమ్ పోలీసులు బెంగళూరులో ఉంటున్న నైజీరియా సైబర్ నేరగాణ్ని అరెస్టు చేశారు. అతనిపై అప్పటికే బెంగళూరులో గృహహింస కేసు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాంట్రాక్ట్ పెళ్లి ద్వారా అతను బెంగళూరులోనే మకాం పెట్టాడు. అతన్ని డీపోర్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా.. న్యాయపరమైన చిక్కులు అడ్డంకిగా మారాయి.
- బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడ్డ మహమ్మద్ హసీబుల్ అలియాస్ జోవన్ చౌదరి(25), రోమన్ సాహ అలియాస్ రహన్(21)ను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. అక్రమంగా వచ్చిన ఇద్దరినీ డీపోర్ట్ చేసేందుకు యత్నించగా.. వారు అప్పటికే ఇక్కడి మహిళలను పెళ్లి చేసుకున్నట్లు గుర్తించారు. న్యాయపరమైన చిక్కులు ఎదురవ్వడంతో.. వారిని తిప్పి పంపలేకపోయారు.
- ఆపరేషన్ సిందూర్‌కు ముందు భారత్‌లో ఉంటున్న పాకిస్థానీలను వెనక్కి పంపాలని పోలీసులు చేసిన ప్రయత్నాలను కాంట్రాక్టు పెళ్లిళ్లు అడ్డుకోవడం గమనార్హం..!

49పేజీలతో ముందస్తు బెయిల్ తీర్పా?

» బెయిల్ దశలోనే మొత్తం విచారణ జరిపినట్టు ఉంది

» ఐపీఎస్ సంజయ్ కేసులో సుప్రీంకోర్టు ఆశ్చర్యం

న్యూఢిల్లీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అగ్నిమాపక విభాగంలో పనిచేసినప్పుడు ఐపీఎస్ అధికారి సంజయ్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సమర్పించాలని ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ ఏపీ హైకోర్టు 49 పేజీలతో తీర్పు వెలువరించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. తీర్పు తీరును చూస్తే.. ముందస్తు బెయిల్ దశలోనే మొత్తం కేసు విచారణను జరిపినట్టు ఉందని వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించిన ఒప్పంద పత్రం, ఇన్‌వాయిస్‌లను వారం రోజుల్లో (ఈనెల 30వ తేదీ) అందజేయాలని ఆదేశించింది. అదే రోజు తదుపరి వాదనలు వింటామని జస్టిస్ అమానుల్లా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. విచారణ సందర్భంగా.. అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. సంజయ్ అవినీతికి పాల్పడ్డారని చెప్పేందుకు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, హైకోర్టు మాత్రం అవేమీ పరిగణనలోకి తీసుకోకుండానే ముందస్తు బెయిల్ మంజూరు చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కాగా, విజిలెన్స్ నివేదిక ఆధారంగా సంజయ్‌పై అగ్నిమాపక విభాగంలో జరిగిన అవినీతికి సంబంధించి ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆ కేసులో ఏపీ హైకోర్టు సంజయ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు తీర్పును ఈ ఏడాది మార్చి 5న ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

ఏపీ మద్యం కుంభకోణంలో ఇక ఈడీ వేడి!

» 'శర్వాణీ' డిస్టిలరీ డైరెక్టర్ చంద్రా రెడ్డికి నోటీసులు

» 28న విచారణకు హాజరుకావాలని ఆదేశం

అమరావతి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసు మరో కీలక మలుపు తిరిగింది! వేలకోట్ల ముడుపులు, విదేశీ లింకులు, హవాలా లావాదేవీలతో దేశంలోనే అతిపెద్ద దోపిడీగా భావిస్తున్న ఈ స్కామ్‌లో తీగలాగేందుకు ఎట్టకేలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. శర్వాణీ ఆల్కోబ్రూ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ ఎనకొండ చంద్రారెడ్డికి ఈడీ సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో ఈనెల 28వ తేదీ ఉదయం 10.30 గంటలకు తమ కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా ఈడీ హైదరాబాద్ బ్రాంచ్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రతీక్‌సింగ్ సమన్లు జారీ చేశారు. తాము గుర్తించిన/దర్యాప్తు జరుపుతున్న 'మనీ లాండరింగ్'కు సంబంధించి వివరాలు ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. జగన్ హయాంలో జరిగిన రూ.3500 కోట్ల లిక్కర్ స్కామ్‌పై విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు నేతృత్వంలో 'సిట్' ఏర్పాటైన సంగతి తెలిసిందే. ఏ1 రాజ్ కసిరెడ్డితో మొదలుకుని... వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి వరకు ఈ కేసులో 12 మందిని అరెస్టు చేశారు. ప్రాథమిక చార్జిషీటును కూడా దాఖలు చేశారు. మద్యం ముడుపుల వసూలు నుంచి అవి అంతిమంగా చేరిన చోటు వరకు... అనేక కోణాల్లో 'సిట్' దర్యాప్తు చేసింది. సాంకేతిక ఆధారాలూ సేకరించింది. ఈ కుంభకోణం తీవ్రత నేపథ్యంలో ఈడీ ఇప్పటికే 'సిట్' నుంచి ఈ కేసు వివరాలను తీసుకుంది. దీనిపై తాను సొంతంగా దర్యాప్తు ప్రారంభించింది. మరీ ముఖ్యంగా... తన పరిధిలోకి వచ్చే మనీ లాండరింగ్‌పై దృష్టి సారించింది. దీనికి సంబంధించిన ఆధారాలు లభించడంతో శర్వాణీ ఆల్కో బ్రూ కంపెనీ డైరెక్టర్ చంద్రారెడ్డిని విచారణకు పిలిచింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.